www.prajapaksham.in
PRAJAPAKSHAM ★★★★




# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

హసీనాపై 17న బంగ్లాదేశ్ కోర్టు తీర్పు

43 రోజుల 'షట్‌డౌన్'కు తెర **02**

సంపుటి 08, సంచిక: 343 | శుక్రవారం | 14-11-2025 | ఖమ్మం   Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar   పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## సిఎంఆర్ పక్కదారి

● రూ.22 కోట్ల బియ్యం దారిమళ్లినట్లు గుర్తించిన అధికారులు
● నిర్మల్-, మహబూబ్‌నగర్-, వనపర్తిలో విజిలెన్స్ దాడులు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో రైస్ మిల్లర్లు సబ్సిడీ బియ్యం, సిఎంఆర్ బియ్యాన్ని దారి మళ్లించి కోట్లాది రూపాయలు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఈ మేరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి శిఖాగోయల్ ఆదేశాల మేరకు అధికారులు గురువారం నిర్మల్, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లోని పలు రైస్ మిల్లులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.22 కోట్ల విలువైన సిఎంఆర్, సబ్సిడీ బియ్యం దారి మళ్లించినట్లు గుర్తించారు. పలువురు రైస్‌మిల్లర్ల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ విజిలెన్స్ యూనిట్ అధికారులు నిర్మల్ జిల్లా కడెం మండలం నాచన్ ఎల్లాపూర్ గ్రామంలోని కట్ట బాలాజీ రైస్ మిల్ ఇండస్ట్రీపై దాడి చేశారు. ఈ మిల్లు యజమాని రబీ 202425 సీజన్‌కు సంబంధించిన 2684 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ స్టాకును (సుమారు రూ. 6.22 కోట్ల విలువైనది) దారి మళ్లించినట్లు నిర్ధారణ తరువాయి 2లో



## నకిలీ కరెన్సీ కలకలం

● హైదరాబాద్‌లో 8 మంది అరెస్టు
● రూ.4.77 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో నకిలీ కరెన్సీ మరోసారి తెరపైకి వచ్చింది. గతంలో పాకిస్తాన్‌లో ముద్రించిన నకిలీ నోట్లను పాతబస్తీలో విక్రయిస్తుండగా పట్టుబడిన విషయం తెలిసిందే. తాజాగా సౌత్ వెస్ట్ జోన్, మెహిదీపట్నం పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించంతో నకిలీ 500 రూపాయల నోట్ల చలామణి చేస్తున్న 8 మందిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో వారి వద్ద 4.75 లక్షల నకిలీ కరెన్సీ తో పాటు ఒక కారు, మూడు ద్విచక్ర వాహనాలు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫ్ నగర్ ఎసిపి కృష్ణా కుమార్ గురువారం వివరాలను వెల్లడించారు. కోస్గిలోని గుండిమల్ గ్రామానికి చెందిన కస్తూరి రమేష్ తన సోదరి రామేశ్వరితో కలిసి



తాండూరు లోని తన నివాసంలో నకిలీ ఇండియా 500 రూపాయల నోట్లు తయారు చేసేవాడు. స్కానర్ సహాయంతో అసలు కరెన్సీ నోట్ల ముందు వెనుక వైపు స్కాన్ చేసి ఆపై కరెన్సీ నోట్ల సరైన తరువాయి 2లో

# ట్రెండ్ మారుస్తాం

### హైదరాబాద్ నగర రోడ్లకు గూగుల్, మెటా, టిసిఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీల పేర్లు పెడతాం

● హైదరాబాద్‌లో హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫోర్డ్ వంటి ఐవి లీగ్ వంటి విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయండి ● తక్కువ ఖర్చు, సులభమైన వీసాతో దక్షిణాది దేశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య ● ప్రపంచస్థాయి విద్యాసంస్థలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానం ● యుఎస్ఐఎస్‌పిఎఫ్ ప్రసంగం ● తెలంగాణ రైజింగ్– 2047 విజన్ ప్రదర్శన



ప్రజాపక్ష/హైదరాబాద్

మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫోర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల (గ్లోబల్ సౌత్) విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని సిఎం రేవంత్ రెడ్డి ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను ఆహ్వానించారు. భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని, హైదరాబాదులో ఆ ట్రెండ్‌ను మార్చాలని తాము అనుకుంటున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టిసిఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్లను తరువాయి 2లో

## నష్టపోయిన పంటలకు ప్రత్యేక సడలింపులివ్వండి

● కేంద్ర వ్యవసాయశాఖమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల లేఖ
● పత్తికి తేమశాతాన్ని తగ్గించాలి
● ఎకరాకు 11.74 క్వింటాళ్ల దిగుబడి ఆధారంగా కొనుగోలు చేయాలని మరోమారు విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మొంథా తుఫాను, అకాల వర్షాలు, అనిశ్చిత వాతావరణం కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న సోయాబీన్, మొక్కజొన్న, పత్తి పంటల కొనుగోలుకు సంబంధించి కేంద్రం ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. కేంద్ర ప్రభుత్వం సేకరించే సోయాబీన్, పత్తి పంటల విషయంలో కొన్ని ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, గిరిరాజ సింగ్‌లకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో 3,66,697 ఎకరాల్లో సోయాబీన్ సాగు జరిగిందని, సగటున దిగుబడి ఎకరాకు 7.62 క్వింటాళ్లుగా అంచనా వేశామని చెప్పారు. కోత సమయంలో కురిసిన అకాల వర్షాల వల్ల పంటకు తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం తరువాయి 2లో

## ఆర్‌టిసిలో ఆదాయ మార్గాలు అన్వేషించాలి

03

## జనవరి 3 నుంచి టెట్ పరీక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ('టెట్ 2026') షెడ్యూల్‌ను పాఠశాల విద్యా శాఖ డైరక్టర్ నవీన్ నికోలాస్ గురువారం విడుదల చేశారు. జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 15 నుంచి 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం కల్పించారు. శుక్రవారం నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు మాత్రమే టీచర్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే డిఎస్‌సి పరీక్షకు అర్హులు.




## హైదరాబాద్‌లో ఎన్ఐఎ సోదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అధికారులు గురువారం హైదరాబాద్‌లోని పలు చోట్ల సోదాలు నిర్వహించారు. ఉగ్రవాద కార్యకలాపాల్లో పాలుపంచుకున్నాడనే ఆరోపణపై వారం రోజుల క్రితం రాజేంద్రనగర్‌లో నివాసముంటున్న డాక్టర్ అహ్మద్ మెహియుద్దీన్ (35)ను గుజరాత్ యాంటి టెర్రరిస్టు స్క్వాడ్ (ఎటిఎస్) పోలీసులు ఇక్కడికి వచ్చి అరెస్టు చేసి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఇటీవల రాజేంద్రనగర్‌లో పట్టుబడిన డాక్టర్ అహ్మద్ మెహియుద్దీన్ ఇంట్లో ఎన్ఐఎ అధికారులు మరోసారి సోదాలు నిర్వహించారు. అతని ఇంటి సమీపంలో ఉన్న కాలువలో లభించిన సెల్‌ఫోన్‌లోంచి డేటాను ఎన్ఐఎ అధికారులు వెలికితీస్తున్నారు. అరెస్టు తరువాయి 12లో

## జూబ్లీ ఫలితం నేడే

● ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
● 10 రౌండ్‌లలో ప్రక్రియ పూర్తి చేస్తాం
● జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్

ప్రజాపక్షం/హైదరాబాద్




జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. అనుమతి ఉన్నవారు మాత్రమే లెక్కింపు కేంద్రం వద్దకు రావాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ మంగళవారం జరిగిన విషయం తెల్సిందే. నేడు ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మొదట బ్యాలెట్ ఓట్లు లెక్కించి ఆ తర్వాత ఈవిఎంలలోని ఓట్లను లెక్కిస్తామన్నారు. 407 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్లను లెక్కిస్తామని చెప్పారు. మొత్తం 58 మంది అభ్యర్థులతో పాటు నోటాతో కలిపి 59 మంది ఉన్నారన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను 10 రౌండ్లలో పూర్తి చేస్తామన్నారు. సాధారణంగా ఓట్ల లెక్కింపుకు 14 ఏర్పాటు చేయాల్సి ఉంటే ఇక్కడ ప్రత్యేక అనుమతితో ఈసారి 42 ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 1,94,631 ఓట్లు పోలయ్యాయని, 48.49 శాతం పోలింగ్ నమోదైందన్నారు. లెక్కింపు ప్రక్రియలో 186 మంది సిబ్బంది పని చేస్తారని, అందులో కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్‌తో పాటు ప్రతి టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్ కూడా ఉంటారన్నారు. కౌంటింగ్‌ను ఎప్పటికప్పుడు ఆర్ఓ పరిశీలిస్తారన్నారు. ఓట్ల లెక్కింపునకు మొత్తం 186 మంది తరువాయి 2లో



## అంచనాలు నిజమవుతాయా?

● బిహార్‌లో మరోసారి ఎన్‌డిఎ అధికారంలోకి వస్తుందా?
● ప్రజలు మార్పును కోరుకున్నారా?
● మరి కొన్ని గంటల్లో తేలనున్న రాజకీయ నేతల భవితవ్యం

**పాట్నా :** బిహార్‌తో పాటు యావత్ దేశ ప్రజలు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నగా అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు నేడు వెల్లడికానున్నాయి. ఇప్పటికే అన్ని ఎగ్జిట్ పోల్స్ కూడా అధికార ఎన్‌డిఎకే ప్రజలు మరోసారి పట్టం కట్టినట్లు, ఆర్‌జెడి ఏకైకా అతిపెద్ద పార్టీగా అవతరించనున్నట్లు అంచనా వేశాయి. కాగా, ఓట్ల లెక్కింపు కోసం బిహార్ సంసిద్ధమైంది. గురువారం రాజకీయ నేతలంతా చురుగ్గా చర్చలు జరిపారు. అయితే నితీశ్ కుమార్ రికార్డుస్థాయిలో మరోసారి ముఖ్యమంత్రి అవుతారా లేక రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకున్నారా అనేది మరికొన్ని గంటల్లోనే తేలనుంది. ఈనెల 6, 11వ తేదీల్లో రెండు విడతలుగా బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 243 నియోజకవర్గాలు ఉన్న బిహార్‌లో ప్రజలు గతంలో ఎప్పుడూ లేనంతగా 67.13 శాతం ఓటింగ్‌ను నమోదు చేశారు. ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. ట్రెండ్‌లు. ఫలితాలు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలోని 38 జిల్లాల్లో మొత్తం 46 లెక్కింపు కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. 2,616 మంది అభ్యర్థుల ఎన్నికల విధిని 7.45 కోట్ల మంది ఓటర్లు నిర్ణయించారు. ఎన్నికల్లో ఉపయోగించిన ఇవిఎంలు, వివిప్యాట్‌లను స్ట్రాంగ్ రూమ్‌ల లోపల డబుల్‌లాక్ సిస్టమ్ కింద సీలు చేసినట్లు ఇసి తెలిపింది. కేంద్ర పరిశీలకులు, అభ్యర్థులు నియమించిన ఏజెంట్ల సమక్షంలో మొత్తం ప్రక్రియను వీడియోగ్రాఫ్ చేయనున్నట్లు పేర్కొంది. లెక్కింపు కేంద్రాల వద్ద రెండంచెల భద్రతను మోహరించారు. లోపల కేంద్ర సాయుధ పారామిలిటరీ దళాలకు (సిఎపిఎఫ్‌లు) కేటాయించినప్పటికీ, బయట రాష్ట్ర పోలీసులను మోహరించారు. అలాగే 24 గంటల పాటు సిసిటివి నిఘా, ఇతర భద్రతా ఏర్పాట్లు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ప్రతి స్ట్రాంగ్ రూమ్ తరువాయి 12లో

## కెమెరాలకు చిక్కకుండా ఢిల్లీకి ఉమర్

● హైవేపై కాకుండా గజిబిజి రోడ్లపై ప్రయాణం
● 50 సిసిటివి కెమెరాల ద్వారా గుర్తించిన పోలీసులు ● ఎర్రకోట సమీపంలో మూడు గంటలపాటు పార్కింగ్‌లోనే..
● పేలుడు ఘటనలో 13కు చేరిన మృతులు
● న్యూలజ్‌పత్ రాయ్ మార్కెట్‌లో శరీర భాగం లభ్యం



**న్యూఢిల్లీ :** రెండు రోజుల క్రితం ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో ఘటనపై మృతుల సంఖ్య 13కు చేరింది. ఈ ఘటనలో క్షతగాత్రుడైన మరో వ్యక్తి గురువారం ఎల్‌ఎన్‌జెపి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతన్ని బిలాల్‌గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. బిలాల్ మరణం గురించి గురువారం తెల్లవారుజామున ఆసుపత్రి నుండి సమాచారం అందిందన్నారు. అయితే పేలుడు జరిగిన ప్రదేశానికి సమీపంలోని న్యూ లజ్‌పత్ రాయ్ మార్కెట్‌లో గురువారం ఓ శరీర భాగం లభ్యమైంది. దాన్ని ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపించారు. కేసు విచారణలో ఇది కూడా ఒక కీలక ఆధారంగా మారుతుందని తరువాయి 12లో



## బిసి కోటా భిక్ష కాదు.. హక్కు

● 'బిసి ధర్మ పోరాట దీక్ష'లో వివిధ పార్టీల నేతలు ఉద్ఘాటన
● 42శాతం రిజర్వేషన్ కేటాయింపు తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్
● సామాజిక న్యాయం కోసం కలిసికట్టుగా ఉద్యమిస్తేనే రిజర్వేషన్ ప్రక్రియ పూర్తవుతుందని అభిప్రాయం

ప్రజాపక్షం/హైదరాబాద్

'బిసి రిజర్వేషన్లు ఎవరి భిక్ష కాదు. ఇది బిసిల హక్కు' అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బిసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇందిరా పార్క్ వద్ద 'బిసి ధర్మ పోరాట దీక్ష' నిర్వహించారు. బిసి జెఎసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యతన జరిగిన కార్యక్రమంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బిఆర్‌ఎస్ శాసనసభాపక్ష నేత మధుసూదనా చారి, టిజెఎస్ అధ్యక్షులు, ఎంఎల్‌సిలు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఎంఎల్‌సిలు అద్దంకి దయాకర్, ఎల్ రమణ, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ తోపాటు 136 కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, 40 బిసి సంఘాల అధ్యక్షులు, 10 ఉద్యోగ సంఘాల అధ్యక్షులు, మహిళా సంఘాల నేతలు, ఓయు జెఎసి నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని వక్తలు డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం కోసం అందరూ కలిసికట్టుగా ఉద్యమిస్తేనే రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తవుతుందని అభిప్రాయం వ్యక్తం తరువాయి 2లో

## వరంగల్ ఎంజిఎంలో విజిలెన్స్ తనిఖీలు

రికార్డుల పరిశీలన



ప్రజాపక్షం/వరంగల్ టౌన్

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ నిధుల వ్యవహారంపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ఎంజిఎం చేరుకొని రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో 2021 నుంచి 2024 వరకు ఆరోగ్యశ్రీ ద్వారా చేసిన ఆపరేషన్లు వచ్చిన నిధుల వివరాలను రికార్డుల ఆధారంగా పరిశీలించారు. ఈ నిధులు అవసరమైన పనులకు కాకుండా అనవసరమైన పనులకు వెచ్చించినట్లు ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తనిఖీలను చేపట్టారు. ఈ నాలుగేళ్ల కాలంలో ఎంజిఎం ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కి సంబంధించి 30 కోట్లకు పైగా నిధులు ఆసుపత్రికి వచ్చాయి. ప్రతిరోజు ఈ పథకం కింద ఆసుపత్రిలో ఆపరేషన్లు చేస్తున్నారు.వీరికి సంబంధించిన నిధులు ఆసుపత్రి అభివృద్ధి కోసమే చేస్తారు. ఆపరేషన్ చేసిన వైద్యులకు ఫీజు కింద కొంత మొత్తం చెల్లిస్తారు. నిధుల ఖర్చు విషయంలో అవకతవకలు జరిగినట్లు తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## పెరూలో బస్సు ప్రమాదం : 37 మంది మృతి

**లిమా :** దక్షిణ అమెరికా పశ్చిమప్రాంత దేశం పెరూలో గురువారం తెల్లవారుజామున జరిగిన బస్సు ప్రమాదంలో 37 మంది ప్రయాణికులు మరణించారు. ఒక మలుపు వద్ద మరో వాహనాన్ని ఢీకొట్టిన బస్సు ఒకోనో నది ఒడ్డు నుండి 650 అడుగుల లోతులోకి దొర్లుకుంటూ పడిపోయింది. ఆ సమయంలో బస్సులో 60 మంది ఉన్నారు. పెరూ–చిలీ లను అనుసంధానం చేసే పాన్ అమెరికన్ హైవేలో ఈ ప్రమాదం సంభవించింది. పెరూ దేశంలో బస్సులు, ఇతర వాహనాల ప్రమాదాలు సాధారణంగా మారాయి. ప్రత్యేకించి రాత్రివేళ్ళలో, పర్వత ప్రాంతాలలో ఈ ప్రమాదాలు సర్వసాధారణమయ్యాయి. భద్రతకు సంబంధించిన సిగ్నల్స్ లేకపోవడం, అతివేగంతోపాటు రోడ్లు ఎంతమాత్రం సరిగ్గా లేకపోవడం ప్రధానకారణంగా చెబుతున్నారు. ఐతే ఈ ప్రమాదంలో ఢీకున్న రెండు వాహనాల డ్రైవర్లు మాత్రం సజీవంగానే ఉన్నారు. చారిత్రాత్మకంగా ఈ ప్రాంతం ప్రమాదాలకు పెట్టింది పేరుగా మారిందని ఘటనాస్థలాన్ని సందర్శించిన ఒకోనా జిల్లా మేయర్ వోల్టోర్ లెరేనా చెప్పారు.

## హసీనాపై 17న బంగ్లాదేశ్ కోర్టు తీర్పు



**ఢాకా:** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనాపై విచారణ జరిపిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ త్రిసభ్య ధర్మాసనం ఈనెల 17వ తేదీన తీర్పు ప్రకటిస్తుంది. గత ఏడాది జులైలో బంగ్లాదేశ్‌లో అల్లర్లు మొదలయ్యాక హసీనా ఆత్మరక్షణ కోసం ఆగస్టులో దేశం వదిలి భారత్‌కు వచ్చి అజ్ఞాతవాసం గడుపుతున్నారు. కానీ ఆమె కోర్టుకు హాజరు కాకపోయినా, దేశంలో లేకపోయినాగానీ ఏకపక్షంగా ఈ విచారణ కొనసాగింది. తాత్కాలిక ప్రభుత్వం ఆమెతోపాటు కుటుంబ సభ్యులపై కూడా కేసులు నమోదు చేసి విచారణ జరిపింది. అక్టోబరు 23వ తేదీన కేసు విచారణ పూర్తయింది. రాబోయే సోమవారం తీర్పు చెబుతామని ఐసిటి ప్రకటించింది. 28 రోజులపాటు కేసు విచారణ కొనసాగింది. 54 మంది సాక్షులను న్యాయస్థానం విచారించింది. ఈ కేసులో హసీనాతోపాటు నాటి హోంమంత్రి అసదుజ్జామన్ ఖాన్ కమల్, ఆనాటి పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల చౌధురి అబ్దుల్లా అల్ మమున్‌లను ప్రధాన నిందితులుగా చేసి విచారణ జరిపారు. ఐతే ఈ కేసులో ఐజిపి మామున్ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు. ప్రభుత్వ అనుకూల సాక్షిగా మారిపోయారు. మెకు ఉరిశిక్ష విధించాలని ప్రాసిక్యూషన్ డిమాండ్ చేసింది. హసీనాకు చెందిన అవామీలీగ్ పార్టీ కార్యకర్తలు దేశంలో గడచిన కొద్ది రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. తమ నాయకురాలికి వ్యతిరేకంగా తీర్పు చెబితే సహించేదిలేదని హెచ్చరిక చేశారు. ఈ నేపథ్యంలో దేశంలో హై ఎలర్ట్ ప్రకటించారు. అల్లర్లు కొనసాగుతున్నాయి.

# 43 రోజుల 'షట్‌డౌన్'కు తెర

### ఫండింగ్ ప్యాకేజీపై ట్రంప్ సంతకం





**వాషింగ్టన్ :** అమెరికా దేశ చరిత్రలో ఎన్నడూలేని రీతిలో సుదీర్ఘంగా 43 రోజులు కొనసాగిన షట్‌డౌన్‌కు తెరపడింది. ప్రతినిధులసభలో 222–209 ఓట్ల తేడాతో బిల్లు ఆమోదం పొందిన తర్వాత అధ్యక్షుడు ట్రంప్ ఈ ఫండింగ్ ప్యాకేజీపై సంతకం చేశారు. డెమోక్రాట్లు షట్‌డౌన్‌ను ఇంకా పొడిగించాలని చూశారనీ, వచ్చే ఏడాది మధ్యంతర ఎన్నికల్లో ప్రజలు వారికి ఓట్లు వేసే అవకాశం లేదని ట్రంప్ విమర్శించారు. అమెరికన్లు ఈ విషయం మరచిపోకూడదని, మధ్యంతర ఎన్నికల్లో ఇదే విషయంతో మళ్ళీ ప్రజల ముందుకు వెళతాననీ అన్నారు. తొలుత ఆదివారం సెనేట్‌లో ఈ బిల్లు ఆమోదం పొందింది. ట్రంప్ సంతకంతో ప్రభుత్వ సేవలు, నేషనల్ పార్కులు తిరిగి పనిచేయడం ప్రారంభిస్తాయి. ప్రయాణీకులకు నరకం చూపించిన విమానయాన రాకపోకల సేవలు యథాతథంగా కొనసాగుతాయి. ఇప్పటివరూ వేతనాలు లేకుండా సెలవులపై ఉన్న ఫెడరల్ ఉద్యోగులు విధుల్లో చేరతారు. అత్యవసర ఉద్యోగులకు వేతనాలు లభిస్తాయి. ఫుట్‌స్టాంపులు అని పిలిచే ''స్నాప్'' ప్రయోజనాలను వెంటనే అందుబాటులోకి తేవాలని, 4.20 కోట్లమందికి ఆహార సహాయం అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. బైపార్టిజన్ పాలసీ సెంటర్ సమాచారం ప్రకారం షట్‌డౌన్ సమయంలో 6.70 లక్షలమంది ఉద్యోగులను ఇళ్ళకు పంపారు. 7.30 లక్షలమంది అత్యవసర ఉద్యోగులు జీతం లేకుండా పనులు చేశారు. 216 మంది రిపబ్లికన్లు, ఆరుగురు డెమోక్రాట్లు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా, ఇద్దరు రిపబ్లికన్లు వ్యతిరేకంగా ఓటు వేశారు. మొత్తంగా 207 మంది డెమోక్రాట్లు బిల్లును వ్యతిరేకిస్తూ ఓటు వేశారు. ఒక రిపబ్లికన్, ఒక డెమోక్రాట్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ముందుగా కుదిరిన ఒప్పందం ప్రకారం ఆరుగురు ఉదారవాద డెమోక్రాట్లు బిల్లుకు అనుకూలంగా రిపబ్లికన్లతో కలిసి ఓటింగ్‌లో పాల్గొన్నారు. తక్కువ ఆదాయాలు పొందే అమెరికన్లకు సమకూర్చే ఆరోగ్య బీమా సబ్సిడీలు ఈ ఏడాది చివరాఖరుకు ముగిసిపోతాయి. ఈ సబ్సిడీలను పొడిగించాలని, రిపబ్లికన్లు అందుకు అంగీకరించాలని డెమోక్రాట్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిణామాలపై ట్రంప్ స్పందిస్తూ, షట్‌డౌన్‌కు డెమోక్రాట్లే కారణమని, తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వారు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గడచిన ఆదివారం సెనేట్‌లో ఈ బిల్లుపై సమస్య పరిష్కారం కావడంతో ఆశావాదంతో ఉన్న ట్రంప్ వేడుకల మూడ్‌లోకి జారుకున్నారు. ఇది రిపబ్లికన్ల విజయమని చెప్పుకొచ్చారు. రిపబ్లికన్లను అభినందిస్తూ, ఈ ఓటు ప్రభుత్వానికి అతిపెద్ద విజయమని ఆర్లింగ్టన్ శ్మశానవాటికలో జరిగిన వెటరన్స్ డే వేడుకల్లో అన్నారు. ఈ బిల్లుపై ఓటు వేయకుండా తప్పించుకున్న డెమోక్రాట్ ఛంక్ షుమర్‌పై సొంతపార్టీలో ఉన్న వ్యతిరేకతను గుర్తించిన ట్రంప్, ''అతగాడు రిపబ్లికన్‌పార్టీని విచ్ఛిన్నం చేయాలనుకున్నాడు, కానీ డెమోక్రాట్లే అతడిని విచ్ఛిన్నం చేశారు'' అని విమర్శించారు.

### ట్రంప్ విధానాలను తిరస్కరించిన 63 శాతం అమెరికన్లు

ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడచిన పది నెలలుగా దేశంలో ఆయన పాలనాతీరుపట్ల ప్రజల్లో వ్యతిరేకత క్రమంగా పెరుగుతోంది. ఎపి–ఎన్ఒఆర్‌సి తాజా సర్వే ప్రకారం దేశంలో కేవలం 39 శాతం మంది మాత్రమే ఇప్పుడు ట్రంప్ విధానాలను సమర్థిస్తున్నారు. షట్‌డౌన్‌తో పరిస్థితి మరింత తలక్రిందులైంది. కోర్టుకేసులు, ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాదాలు, వలస ప్రజలు వేటాడి తరిమికొట్టడం, దేశంలో పెరిగిన ధరలు వంటి అనేక అంశాలు ఆయనకు వ్యతిరేకంగా మారాయి. ఇక సిఎన్ఎన్–ఎస్ఎస్ఆర్ఎస్ చేసిన మరో తాజా సర్వేలో 37 శాతం మంది ప్రజలు మాత్రమే ట్రంప్‌ను సమర్థిస్తున్నారు. దేశంలో ఉన్న ఆర్థిక పరిస్థితులు, ట్రంప్ తీరు తెన్నులపై ప్రజల్లో ఆయన రెండో విడత పాలనలో అతి తక్కువ సమయంలో వ్యతిరేకత పెరిగింది. నవంబరునెల మొదటి పది రోజుల్లో ద ఎకనామిస్ట్ సర్వేలో 56 శాతం మంది ఆయనను వ్యతిరేకించారు. నేవిగేటర్ రీసెర్చ్ సర్వేలో 58 శాతంమంది, మోర్నింగ్ కన్సల్ట్ సర్వేలో 54 శాతం మంది ట్రంప్ విధానాలను వ్యతిరేకించగా గతనెల అక్టోబరులో ఆర్ఎంజి సర్వేలో 51 శాతం వ్యతిరేకత నమోదైంది.

## నెతన్యాహూను క్షమించండి

### ఇజ్రాయెల్ అధ్యక్షుడికి ట్రంప్ లేఖ



**జెరూసలెం :** అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూను క్షమించాలని, ఆయనను కేసుల నుండి విముక్తి చేయాలని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ లేఖ రాశారు. ఈ విషయాన్ని గురువారం హెర్జోగ్ ప్రకటించారు. నెతన్యాహూను క్షమించాలని కోరుతూ ట్రంప్ తనకు లేఖ రాశారని ఆయన వెల్లడించారు. దేశంలో లంచాలు, మోసాలు, విశ్వాసఘాతుకం వంటి కేసులను ఎదుర్కొంటున్న నెతన్యాహూకు విముక్తి కల్పించాలని ట్రంప్ కోరారు. ట్రంప్ కూడా హష్ మనీ కేసుల్లో 34 రకాల ఆరోపణలను దేశంలో ఎదుర్కొంటున్నారు. నెతన్యాహూను క్షమించాలన ఇప్పటికే ట్రంప్ అనేక సార్లు కోరారు. గతనెల ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించిన సందర్భంగా కూడా ఆయన దేశాధ్యక్షుడి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

### నెలరోజుల్లో 245 మందిని చంపిన ఐడిఎఫ్

గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినప్పటి నుండీ ఇజ్రాయెల్ ఆ ఒప్పందానికి కట్టుబడలేదు. అక్టోబరు 10వ తేదీన గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినప్పటినుండీ ఈనాటివరకూ 245 మంది పాలస్తినా పౌరులను ఐడిఎఫ్ సైనికులు కాల్చిచంపారు. దీంతో 769 రోజులుగా ఆగకుండా జరుగుతున్న యుద్ధంలో మృతులసంఖ్య 69,180కు చేరుకుందని హమాస్ ప్రభుత్వం ప్రకటించింది. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో కూడా గడచిన రెండేళ్ళలో 1,065 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ హతమార్చింది. మరోవైపు ఐక్యరాజ్యసమితి నెతన్యాహూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. పాలస్తినా ప్రజలకు ముఖ్యమైన అవసరాలను తీర్చేందుకు లారీలలో సరుకులను గాజాలోకి అనుమతించడంలేదని ఐక్యరాజ్యసమితి విమర్శించింది. దీంతో జికిమ్ క్రాసింగ్‌ను ఇజ్రాయెల్ సైన్యం గాజాలోకి సరుకులను తరలించే అంతర్జాతీయ సహాయ వాహనాల కోసం తెరిచింది.

## అధ్యక్షుడు– ప్రధాని మధ్య సెనెగల్‌లో అధికార పోరు

**డాకర్ :** పశ్చిమ ఆఫ్రికాదేశం సెనెగల్‌లో అధికార పోరాటం పెరిగింది. దేశాధ్యక్షుడు బస్సిరౌ డియోమాయే ఫాయే, ప్రధానమంత్రి ఔస్మానే సోంకో మధ్య అధికారంకోసం విభేదాలు తలెత్తాయి. దీంతో సంకీర్ణ ప్రభుత్వం సంక్షోభంలో పడే పరిస్థితి వచ్చింది. అధికారంకోసం తలెత్తిన ఈ విభేదాలవల్ల నిజమైన దేశాధికారం ఎవరి వద్ద ఉందనే విషయం తలెత్తింది. ఈ విషయంపై ఇప్పుడు దేశంలో చర్చ మొదలైంది. ప్రధానమంత్రి సోంకో కూటమి మిత్రుడు అస్సాటౌ ఎంబోడ్జ్ ను తొలగిస్తున్నట్లు అధ్యక్షుడు ఫాయే మంగళవారం ప్రకటన చేశారు. దీంతో దేశాధ్యక్షుణ్ణి ప్రధానమంత్రి సవాలు చేయడంతో అధికారపోరాటం మొదలైంది. అధ్యక్షుడు తన ప్రచార సమన్వయకర్త అమినాటా టౌరేను ఎంబోడ్జ్ స్థానంలో నియమించారు. కూటమిలో ఎలాంటి మార్పులూ ఉండవని ప్రజధానమంత్రి కొద్దిరోజులక్రితం చేసిన ప్రకటనకు అధ్యక్షుడి చర్య విరుద్ధంగా ఉండటంతో సంక్షోభ పరిస్థితి వచ్చింది. దీంతో ప్రధానమంత్రి తన పాస్టెఫ్ పార్టీని సమావేశ పరచి ఒక తీర్మానం చేశారు. దేశాధ్యక్షుడికి తన కూటమి మిత్రుణ్ణి తొలగించే అధికారం లేదని పార్టీ ఒక ఉమ్మడి ప్రకటన చేసింది. ఇటీవల దేశాధ్యక్షుడు తనపార్టీ ద్వారా దేశంలో అతిశక్తిమంతమైన భారీ ప్రదర్శనను వేలాదిమందితో నిర్వహించారు. విశ్లేషకులు దీనిని ఉటంకిస్తూ, సోంకో లేకుండా దేశాన్ని పాలించేందుకు తన అధికార స్థిరీకరణ యత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

## సడలింపులివ్వండి
(మొదటి పేజీ తరువాయి)

చేశారు. వర్షాల ప్రభావంతో గింజల్లో రంగు మారడం, ముడతలు పడటం వంటి సమస్యల వల్లతో ఎఫ్ఎక్యూ నిబంధనలకు అనుగుణంగా పంట రావడం లేదని ఆ లేఖలో వివరించారు. ఇలాంటి పరిస్థితులను ప్రత్యేక సందర్భంగా పరిగణించి సోయాబిన్ ఎఫ్ఎక్యూ ప్రమాణాలను సడలించాలని కేంద్రాన్ని కోరారు. ఆ ప్రకారం ఎన్ఎఎఫ్ఇడి, ఎన్‌సిసిఎఫ్ సంస్థలు సడలించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సోయాబీన్ కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని లేఖలో కోరారు. మొక్కజొన్న సాగు ప్రస్తుతం 6.74 లక్షల ఎకరాల్లో జరుగుతుండగా, 25 క్వింటాళ్ల సగటు దిగుబడితో సుమారు 16.85 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేశామని వివరించారు. మార్కెట్‌లో ధర క్వింటాకు రూ.1959కు పడిపోయి, కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2400 కూడా రాకపోవడంతో రైతులలో ఆందోళన పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా రంగంలోకి దిగి మొక్కజొన్న కొనుగోలు ఆరంభించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 48,757 ఎంటిను కొనుగోలు చేసి 14,519 మంది రైతులకు ప్రయోజనం కల్పించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో కనీసమద్దతు ధర కింద మొత్తం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల మక్కజొన్న కొనుగోలుకు ఎన్ఎఇవఫ్‌డి , ఎన్‌సిసిఎఫ్‌సంస్థలకు అనుమతి ఇవ్వాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖను ఆయన కోరారు. పత్తి కొనుగోలు విషయంలో సిసిఐ ప్రతిపాదించిన ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి నిర్ణయం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. ఎల్1, ఎల్2, స్లాట్ బుకింగ్ విధానంలో సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు ఇది మరో రకంగా ఇబ్బంది పెట్టె చర్యగా అన్నారు. ఇప్పటికే మొంథా తుఫాను ప్రభావంతో పత్తి పంట దెబ్బతిన్న పరిస్థితుల్లో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా తేమ శాతాన్ని సడలించాలని, ఎకరాకు 11.74 క్వింటాళ్ల దిగుబడి ఆధారంగా కొనుగోలు కొనసాగించాలని మంత్రి తుమ్మల కేంద్ర టెక్స్‌టైల్ మంత్రికి మరోసారి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.
రైతులకు కొనుగోలులో ఏర్పడుతున్న ఇబ్బందులు అధిగమించేందుకు, దిగుబడి నష్టాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న లక్షలాది చిన్న రైతులకు రక్షణ కల్పించేందుకు కేంద్రం వెంటనే నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా నేడు డిల్లీకి వెళ్ళిన ముఖ్యమంత్రి డిల్లీలో ఈ విషయంపై కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకురావాల్సిందిగా కోరడం జరిగిందని తెలిపారు

## 'జూబ్లీ' ఫలితం నేడే
(మొదటి పేజీ తరువాయి)

సిబ్బందిని నియమించామన్నారు. ఫలితాలను ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని, మీడియాకు ప్రత్యేకంగా ఎల్ఈడి స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తామని అన్నారు. నగర పోలీస్ జాయింట్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15 ప్లాటూన్ల సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అనుమతి ఉన్న వారు లెక్కింపు కేంద్రాల వద్దకు రావాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్ తలుపులు తెరుస్తారు. ఈవిఎంల సీళ్లు పరిశీలిస్తారు. అనంతరం లెక్కింపు ప్రారంభమవుతుంది. మొదటి కొంత అలస్యంగా జరుగుతుందని అధికారులు తెలిపారు. లెక్కింపు ప్రక్రియ గాడిలో పడ్డక ఒక్కో రౌండ్ ఓట్ల లెక్కింపునకు 30 నుంచి 45 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉందని చెప్పారు. మధ్యాహ్నం 3 గంటల వరకు చివరి రౌండ్ పూర్తవుతుందని అధికారుల అంచనగా ఉంది.

**ఏర్పాట్లు పూర్తి : సిఇఒ సుదర్శన్ రెడ్డి**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ ఉప ఎన్నికలో 59 మంది అభ్యర్థులు (నోటాతో కలిపి) పోటీలో ఉన్నందున, 42 కౌంటింగ్ టేంటింగ్ ఏర్పాటు కోసం ఈసిఐ ప్రత్యేక అనుమతి ఇచ్చిందని సిఈఓ చెప్పారు. కౌంటింగ్ రోజున భద్రతకు పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్టు, కౌంటింగ్ సెంటర్ పరిసరాల్లో సెక్షన్ 144 అమల్లో ఉంటుందని, ఉల్లంఘనలపై చర్యలు తప్పవని సిఈఓ హెచ్చరించారు.

## నకిలీ కరెన్సీ కలకలం (మొదటి పేజీ తరువాయి)

పరిమాణాన్ని తయారు చేయడానికి ఫోటో షాప్ ఉపయోగించి జే కే బాండ్ పేపర్ ముద్రించిన తర్వాత, ఆ నోట్లను బ్లేడ సహాయంతో అసలు సైజు కరెన్సీకి కట్ చేసేవాడు. ఆకుపచ్చ గిఫ్ట్ ప్యాక్ పేపర్ సహాయంతో ఆకుపచ్చ రంగు సెక్యూరిటీ థ్రెడ్ను సిద్ధం చేసి ఖచ్చితమైన పరిమాణానికి కత్తిరించి, ఫెవికోల్ సహాయంతో నకిలీ కరెన్సీకి స్ట్రిప్పు అతికించి సరఫరా చేసి అనంతరం హీట్ గన్ ఉపయోగించి నోట్లను ఆరబెట్టి, కరెన్సీ నోట్లను నిజమైన కరెన్సీ కట్టలుగా ప్యాక్ చేసి,1:4 నిష్పత్తి లో వివిధ ప్రాంతాలలో నకిలీ కరెన్సీని చలామణి చేసి అక్రమ డబ్బును సంపాదించే వాడు. ఈ క్రమంలో కస్తూరి రమేష్(35) ఇంటాగ్రాములో ఓ వీడియోను పోస్ట్ చేసి తన ఫోన్ నెంబర్ ను అందులో అమర్చాడు. సులేమాన్ నగర్ కి చెందిన అబ్దుల్ వహీద్ (21) మొహమ్మద్ తహా (21)ఇన్స్టాగ్రామ్ ద్వారా రమేష్ను సంప్రదించి అతని నుండి 1:4 నిష్పత్తిలో నకిలీ కరెన్సీ నోట్లను సేకరించడం ప్రారంభించారు. కాగా వారిద్దరు 1 అసలు నోటుకు 4 నకిలీ నోట్లను తీసుకొని 1:3 నిష్పత్తిలో నకిలీ నోట్లను సులేమాన్ నగర్ కి చెందిన మొహమ్మద్ సోహైల్ (21) బహదూర్పురాకి చెందిన మొహమ్మద్ ఫహాద్(23)లకు ఇచ్చారు. కాగా సోహైల్ ఫహాద్ 1:2 నిష్పత్తిలో కిషన్ బాగ్ కి చెందిన షేక్ ఇమ్రాన్ (23) కూకట్పల్లి కి చెందిన ఒమర్ ఖాన్లకు నోట్లను ఇచ్చారు. ఈ క్రమంలో ఇమ్రాన్ మరియు ఒమర్ ఫస్ట్ లాన్సర్స్ లోని ఈద్గా దర్గా వద్ద సయ్యద్ కిషన్ బాగ్‌కి చెందిన అల్తమాష్తో (21) నకిలీ నోట్లను మార్పిడి చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు రేడ హ్యాండేడ గా పట్టుకున్నారు. అనంతరం వారి వద్ద 950, 5 వందల రూపాయల నోట్లతో పాటు, ఒక కారు,3 ద్విచక్ర వాహనాలు 9 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను గురువారం రిమాండ కు తరలించారు. వీటి విలువ 4.75లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కాగా రమేష్ బాబు, రామేశ్వరిని గుజరాత్ తో పాటు తెలంగాణ లో దొంగ నోట్ల విషయంలో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఆపరేషన్ లో చురుకుగా పాల్గొన్న కిషన్ కుమార్, ఆసిఫ్ నగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ , ఎస్. మల్లేష్, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మెహదీపట్నం,జి. సంతోష్ కుమార్ సౌత్ వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్,డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ఎన్. రాంబాబు తో పాటు మెహదీపట్నం పోలీస్ విభాగం ఎస్ఎల్ఎన్. ప్రీతి రెడ్డినీ అభినందించి రివార్డులు అందించారు.

## భిక్ష కాదు.. హక్కు (మొదటి పేజీ తరువాయి)

చేశారు. బిసి రిజర్వేషన్ల ద్వారా విద్యా, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో సమన్యాయం జరుగుతుందన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని, రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. పార్లమెంట్ సమావేశంలో ఎంపిలందరూ కలిసి పార్లమెంటును స్తంభింపజేసి పార్టీలకు అతీతంగా చట్టబద్ధంగా అమలు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిసిలంతా కలిసి ఉద్యమించినప్పుడే 42 శాతం రిజర్వేషన్లు అమలవుతాయని ఉద్ఘాటించారు.

బండారు దత్తాత్రేయ దేశంలో 60 శాతానికి పైగా జనాభా కలిగిన బిసిల న్యాయమైన డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకుంటే బిసిల రూపంలో మరో స్వాతంత్ర పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం రోజున బిసి రిజర్వేషన్ల కోసం జంతర్‌మంతర్ వద్ద ఆయన ధర్నా నిర్వహించనున్నామని, ధర్నాకు బిసి సంఘాల నేతలు రావాలని ఆహ్వానించారు. సిఎంతో మాట్లాడి రిజర్వేషన్లపై చర్చిస్తానని హామీ ఇచ్చారు.

ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ బిసిలకు 42 రిజర్వేషన్ల సాధన కోసం మద్దతిస్తున్నామన్నారు. అన్ని సంఘాలతో ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రజలు కోరుకునే డిమాండ్‌లో న్యాయం ఉందా లేదా అనే విషయాన్ని ప్రభుత్వాలు ఆలోచించాలని, లేదంటే ప్రజాస్వామ్యానికి అర్థమే లేదన్నారు. ఎల్ రమణ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు జెండాలు పక్కన పెట్టి బిసి జెండాను ఎత్తుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని పార్టీల్లో ఉన్న బిసి ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఆ పార్టీలు ఇచ్చిన హామీలపై చర్చ పెట్టాలన్నారు. మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లా దుతూ బిసిల రిజర్వేషన్లపై చట్టబద్ధత చేయకుండా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్ర వ్యాప్తం గా బిసిలు తిరగబడతారని హెచ్చరించారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించడానికి డిసెంబర్ 1వ తేదీ నుండి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగాన్ని సవరించాలని, ఇందు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి సిఎం రేవంత్ రెడ్డి తక్షణమే అఖిలపక్షంతో కలిసి ఢిల్లీకి వెళ్లి ప్రధానితో భేటీ కావాలన్నారు. ప్రధాని సమయం ఇవ్వకపోతే ఇండియా కూటమి తరపున పార్లమెంట్ సమావేశాలను స్తంభింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు.


## విజిలెన్స్ తనిఖీలు
(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు రావడంతో విజిలెన్స్ డిఎస్పి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలను చేశారు. సుమారు రెండు గంటల పాటు తమ తనిఖీలను నిర్వహించి అవసరమైన వివరాలు, రికార్డులను పరిశీలించి సంబంధించిన పత్రాలను తీసుకువెళ్లారు. మిగతా వివరాలను అడిగినప్పుడు పంపించాలని వైద్యులను కోరినట్లు తెలిసింది. ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీకి సంబంధించిన నిధుల వ్యవహారంపై విజిలెన్స్ టీమ్ వచ్చి పరిశీలించి వెళ్లారని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రారెడ్డి తెలిపారు. రొటీన్ గా జరిగే తనిఖీలేనని తెలిపారు.

## 'సిఎంఆర్' పక్కదారి (మొదటి పేజీ తరువాయి)

అయింది. సదరు మిల్లు యజమానిపై తదుపరి చర్యలు ప్రారంభించడానికి పౌర సరఫరాల శాఖకు సిఫారసు చేశారు. వనపర్తి జిల్లా, పెదమందడి మండలం, మొజర్ల గ్రామాలలో రైస్ మిల్లర్లు భారీ పరిమాణంలో సిఎంఆర్ ధాన్యాన్ని దారి మళ్లిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు, విజిలెన్స్ డిఎస్‌పి నేతృత్వంలోని ఈ యూనిట్ అధికారులు వరాహి రైస్ మిల్‌తో పాటు చాముండి రైస్ మిల్‌పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. స్టాకులను తనిఖీ చేయగా, మిల్లు యజమానులు రబీ,ఖరీఫ్ 202425 సీజన్‌కు సంబంధించిన మొత్తం 1,47,375 బస్తాల సిఎంఆర్ స్టాకును (సుమారు రూ. 13.67 కోట్ల విలువైనది) దారి మళ్లించినట్లు నిర్ధారణ అయింది. వరాహి రైస్ మిల్‌లో 47,160 బస్తాలు (రూ. 4.37 కోట్లు), చాముండి రైస్ మిల్: 1,00,215 బస్తాలు (రూ. 9.30 కోట్లు) దారి మళ్లాయి. డిఫాల్ట్ మిల్లర్లపై తదుపరి చర్యలు ప్రారంభించడానికి జిల్లా పౌర సరఫరాల అధికారులకు సిఫారసు సంగారెడ్డి జిల్లా, ఆందోల్ మండలం, దకూర్ గ్రామంలోని మెస్సర్స్ కన్యకా పరమేశ్వరి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రబీ 202425 సీజన్‌కు సంబంధించిన 3752.80 క్వింటాళ్ల సిఎంఆర్ ధాన్యం (9382 బస్తాలు) తక్కువగా ఉన్నట్లు (సుమారు రూ. 87,06,496 విలువైనది) గుర్తించారు. సదరు మిల్లు యజమానిపై తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. హైదరాబాద్ రూరల్ యూనిట్ అధికారులు శంషాబాద్ నుండి మహబూబ్‌నగర్‌కు పిడిఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న ఒక డిసిఎం వాహనాన్ని అడ్డుకున్నారు. 15 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు. దీంతో పాటు రవాణా, మైనింగ్ శాఖ అధికారులతో కలిసి భూత్పూర్ ,జడ్చర్ల నుండి కొడంగల్ వరకు ఉన్న రాష్ట్ర రహదారిపై రూట్ తనిఖీ నిర్వహించారు. రవాణా అధికారులు పన్ను చెల్లించకుండా, అధిక లోడ్‌కు గాను సుమారు రూ.2,80,000 జరిమానా విధించారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం గురించి సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 14432 ద్వారా విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించాలని శిఖాగోయల్ తెలిపారు.

## ట్రెండ్ మారుస్తాం (మొదటి పేజీ తరువాయి)




పెడతామని సిఎం అన్నారు. ఢిల్లీలో గురువారం జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలుభారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు (యుఎస్ఐఎస్‌పిఎఫ్)లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. సదస్సు ప్రారంభంలో 'తెలంగాణ రైజింగ్–2047విజన్' ను రేవంత్ రెడ్డి ప్రదర్శించారు. తెలంగాణలో గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచార ని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని, భారత దేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారమని సిఎం తెలిపారు. జిసిసిలకు గమ్యస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడుల కు ముందుకు రావాలని సిఎం పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.

గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభు త్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ భారత దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సిఎం తెలిపారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్ ఫ్రంట్‌ల మాదిరిగానే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్ ల మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రి వివరిస్తూ చైనా +1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందన్నారు.

**ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యానికి విశేష ఆదరణ**

తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం ఢిల్లీలో జరిగిన యుఎస్ఐఎస్‌పిఎఫ్ వార్షిక సమావేశంలో విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన సిఎం ప్రసంగం అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది.

**రేవంత్ రెడ్డి విజన్ బోల్డ్, క్లియర్, అచీవబుల్**

'సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ విజన్ పారదర్శకంగా, సాహసోపేతంగా (బోల్డ్), సాధించగలిగే విధంగా ఉంది. ఆయన చెప్పిన ప్రాజెక్టులు, వాటి సామాజిక ప్రభా వం ఎంతో ప్రేరణాత్మకంగా ఉంది అని సిస్కో మాజీ సిఈఓ, టెక్ దిగ్గజం జాన్ ఛాంబర్స్ అన్నా రు.

**గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతాం : డాక్టర్ ముఖేష్ ఆఘి, యుఎస్ఐఎస్‌పిఎఫ్ అధ్యక్షుడు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు యుఎస్ఐఎస్‌పిఎఫ్ సభ్యులలో అత్యధిక సంఖ్యలో డిసెంబర్ 8, 9 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతామని, తెలంగాణ విజన్‌ను దగ్గరగా తెలుసుకోవాలని తామంతా ఆసక్తిగా ఉన్నామని యుఎస్ఐఎస్‌పిఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ ముఖేష్ ఆఘి ప్రకటించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## నెహ్రూ ఆకాంక్షల మేరకు ప్రభుత్వం కృషి

ప్రజాపక్షం/హైదరాబాద్: బాలలను జాతి సంపదగా భావించి, వారి మెరుగైన భవితవ్యానికి కృషి చేయాలన్న జవహర్‌లాల్ నెహ్రూ ఆకాంక్షల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి (నవంబర్ 14) సందర్భంగా ఆయనను రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ బాలల దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని, బాల బాలికలందరికీ సిఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులన్న నెహ్రూ స్ఫూర్తితో ప్రజాప్రభుత్వం పాఠశాల విద్యా రంగంలో మెరుగైన మార్పులకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. చదువు తోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమని విద్యారంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు.

# రామప్ప అభివృద్ధికి ప్రత్యేక కృషి

రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



ప్రజాపక్షం/వెంకటాపూర్ : రామప్పను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, ములుగు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్నదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం వెంకటాపూర్ మండలంలోని పాలంపేట రామప్ప సరస్సులో 13 కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన ద్వీపం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి లతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రామప్ప సరస్సులో ద్వీపం అభివృద్ధి చేయటానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని, అందులో భాగంగా శివుడి విగ్రహం ఏర్పాటు చేయడానికి, చెరువు మధ్యలో 20 ఎకరాల స్థలం ఉండగా, ఏడు ఎకరాలలో టూరిజం శాఖ ద్వీపం నిర్మాణం చేపట్టడం జరుగుతుందని వివరించారు. రామప్ప సరస్సులో ఎంత నీరొచ్చినా ఎలాంటి ఇబ్బందులు కలవకుండా పనులు పూర్తి చేయడం జరుగుతుందని, సహజ సిద్ధమైన ఈ ప్రాంతంలో ఆధ్యాత్మికంగా యోగ, పూజలు, శివతాండ నృత్యాలు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఎనిమిది వందల సంవత్సరాల చరిత్ర కలిగిన రామప్పకు ఇప్పటికే యునెస్కో గుర్తింపు వచ్చిందని, ఆలయ సమీపంలో ఆడిటోరియం నిర్మాణం పూర్తి కావడమే కాకుండా ఆలయాల పునరుద్ధరణ పనులు జరుగుతుందని వివరించారు. విద్య, వైద్యం, అభివృద్ధి, పర్యాటక ప్రాంతం అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్రంలోనే ములుగు జిల్లాను అభివృద్ధిలో ముందు స్థానంలో నిలిచేలా కృషి చేస్తున్నామని, కాకతీయులు, సమ్మక్క సారక్క తిరిగిన ఈ ప్రాంతం ఎంతో చరిత్ర కలిగి ఉందని వివరించారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నదని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను చురుకుగా కొనసాగించి భావితరాల వారికి అందిస్తామని, తాము చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని సీతక్క కోరారు. రామప్ప సరస్సులో మరో శివుని విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టూరిజం ఇంజనీరింగ్ డిఈ ధనరాజ్, ఏ ఈ విజయ్, తహసిల్దార్ గిరిబాబు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/ములుగు : ములుగు జిల్లా కేంద్రంలో రూ.15లక్షల నిధులతో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ భవనం, రూ.10లక్షల నిధులతో నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ భవనం నిర్మాణ పనులను, ములుగు జిల్లా కేంద్రంలో గట్టమ్మ వద్ద 3కోట్ల 62లక్షల నిధులతో 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణం పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, రాష్ట్ర, జిల్లా గెజిటెడ్, నాన్ గెజిటెడ్ సంఘం అధ్యక్షులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ సంఘం సభ్యులు, గెజిటెడ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసిలో ఆదాయ మార్గాలు అన్వేషించాలి

హైదరాబాలో కొత్త కాలనీలకు బస్సు సౌకర్యం

ఆర్‌టిసి ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : మహాలక్ష్మి పథకం ద్వారా సంక్షోభంలో ఉన్న ఆర్‌టిసి క్రమక్రమంగా లాభాల బాటలోకి వస్తుందని, ప్రభుత్వం నుండి వస్తున్న మహాలక్ష్మి టికెట్ ఆదాయమే కాకుండా ఇతర ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్‌టిసి ఉన్నాతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. సచివాలయంలో గురువారం ఆర్‌టిసి ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిలో ఇప్పటివరకు మహిళలు 237 కోట్ల జీరో టికెట్ ఉపయోగించుకోవడం ద్వారా రూ.7980 కోట్లను ఆర్‌టిసికి ప్రభుత్వం చెల్లించిందన్నారు. మహాలక్ష్మి టికెట్ ఆదాయమే కాకుండా ఆర్‌టిసి బస్సులు, బస్ స్టేషన్‌లతో పాటు టిమ్ మిషన్‌ల ద్వారా వచ్చే టికెట్‌పై అడ్వర్టైజ్‌మెంట్స్ ద్వారా ఆదాయాన్ని మరింత పెంచాలని సూచించారు.

**హైదరాబాద్‌లో కొత్త కాలనీలకు బస్సు సౌకర్యం**

హైదరాబాద్ నగరంలో కొత్తగా ఏర్పడుతున్న కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశి చారు. నగరంలో ఇప్పటికే 500 వరకు ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నందున పిఎం ఈ డ్రైవ్ కింద హైదరాబాద్‌కి కేటాయించిన 2 వేల బస్సులు విడతల వారిగా రానుండడంతో అందుకు సంబంధించిన చార్జింగ్ స్టేషన్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రస్తుతం నష్టాల్లో కొనసాగుతున్న తాండూరు, వికారాబాద్, బిహెచ్‌ఇఎల్, మియాపూర్, కుషాయిగూడ, దిల్‌సుఖ్ నగర్, హకీంపేట్, రాణిగంజ్, మిధానితో పాటు పలు డిపోలు నష్టాల బారిన ఉండడానికి గల కారణాలు, స్థానిక పరిస్థితులు, ఆయా డిపోలు లాభాల బాట పట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయడానికి ప్రత్యేక కమిటీ వేయాలని ఆర్‌టిసి ఎండి.నాగిరెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 578 బస్సులు కొత్తగా రోడ్లెక్కాయి. త్వరలో మరిన్ని కొత్త బస్సులు రానుండడంతో వాటిని ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ప్రాంతాల్లో నడిపించాలని సూచించారు.

**త్వరలో మరిన్ని నియామకాలు**

ఇప్పటికే ఆర్టీసీలో 1000 ఆర్టీసీ డ్రైవర్లు, 743 శ్రామిక్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో జరుగుతున్న నియామకాలు ఇంటర్వ్యూ దశలో ఉండడంతో వాటిని వేగంగా పారదర్శకంగా పూర్తి చేయాలని తెలిపారు. వచ్చే డిసెంబర్ చివరిలోపు 84 ట్రాఫిక్ సూపర్వైజర్ ట్రైనీ, 114 సూపర్ వైజర్ ట్రైనీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నియామక ప్రక్రియ టిజిపిఎస్సీ లేదా పోలీస్ బోర్డు ద్వారా నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కారుణ్య నియామకాల కింద చేరిన ఆర్టీసి కండక్టర్లకు ఉన్న మూడు సంవత్సరాల ప్రొవిజన్ రెండు సంవత్సరాలకు తగ్గించేలా పరిశీలించాలని అధికారులకు సూచించారు. మేడారం జాతర సమీపిస్తుండటంతో ములుగు బస్ స్టేషన్ నిర్మాణం వేగంగా పూర్తి చేయడంతో పాటు భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఫోర్త్ సిటీలో బస్ టెర్మినల్ నిర్మాణంతో పాటు బస్ రవాణ సౌకర్యాలపై ఆర్టీసీ ఉన్నతాధికారులు అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా కొత్త డిపోలకు అవసరమైన స్థల పరిశీలన చేసి జిల్లా కలెక్టర్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలని తెలిపారు. నగరంలో నలువైపుల బస్ స్టేషన్‌లు ఉండేలా జెబిఎస్ మాదిరి ఆరంఘర్‌లో అధునాతన బస్సు టెర్మినల్ నిర్మించడానికి ఆర్టీసీ, పోలీస్ శాఖకి సంబంధించిన భూ బదలాయింపు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఆర్టీసీలో ప్రమాదాలను తగ్గించడానికి తొలిదశలో లహరి, రాజధాని, గరుడ బస్సుల్లో అమలవుతున్న డ్రైవర్ మానిటరింగ్ సిస్టం పని తీరును అడిగి తెలుసుకున్నారు. దీని ద్వారా డ్రైవర్ నిద్ర ఉపక్రమించే సూచనలు కానీ, మొబైల్ వాడుతున్నప్పుడు మానిటరింగ్ చేస్తూ అప్రమత్తం చేస్తుంది. ఇక ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్ లకు నిరంతరం శిక్షణతో పాటు ప్రతి బస్సుకి ఇద్దరు డ్రైవర్లు తప్పనిసరి నిర్ణయాన్ని కఠిన తరం చేయాలని పేర్కొన్నారు. డ్రైవర్లకు నిరంతరం మెడికల్ టెస్ట్ నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్టీసి ఎండీ నాగిరెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## కేరళ పర్యటనకు 'రైతు కమిషన్ బృందం'

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేరళ రాష్ట్రంలో ఉద్యాన వన పంటల సాగు, లాభాలపై అధ్యయనం చేసేందుకు అధికారులతో కలిసి రైతు కమిషన్ బృందం గురువారం కేరళ పర్యటనకు వెళ్లింది. ఈ బృందంలో కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి, సభ్యులు కెవిఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, భవాని రెడ్డి, మెంబర్ సెక్రెటరీ గోపాల్, వ్యవసాయ , హార్టికల్చర్ అధికారులు ఉన్నారు. కేరళ రాష్ట్రంలోని పళక్కాడ్ జిల్లాలోని ఎలేవంచేరి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయల తోటలను, కేరళ వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి కమిషన్ బృందం పరిశీలించనుంది. గత కొన్నేళ్లుగా కూరగాయల సాగుతో కేరళ రైతులు ఆర్థికంగా లాభపడుతున్నారని,కూరగాయల తోటలతో సాధిస్తున్న విజయాలపై అధ్యయన కమిషన్ అక్కడి రైతులను అడిగి తెలుసుకోనున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో పర్యటించి అనంతరం కమిషన్ తన పర్యాటనను ముగించకుని ఈ నెల 15న సాయంత్రం హైదరాబాద్‌కు బయలుదేరనుంది.

# బిఆర్‌ఎస్ పాలనలో రూ.వేల కోట్ల అవినీతి

35 ఏళ్ల కల ఇంజనీరింగ్ కళాశాల తీసుకొచ్చాం

టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా : సుదర్శన్‌రెడ్డి



ప్రజాపక్షం/నిజామాబాద్ : గత బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సలహాదారులుగా నియమించింది. ప్రభుత్వ సలహాదారులుగా నియమించిన సుదర్శన్‌రెడ్డి గురువారం జిల్లా కేంద్రానికి తొలిసారి వస్తున్న సందర్భంగా నగరంలోని పూలాంగ్ చౌరస్తా నుండి పాత కలెక్టర్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారునిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా నిజామాబాద్ పట్టణానికి వచ్చిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికిన ప్రభుత్వసలహాదారు షబ్బీర్, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అనంతరం పాత కలెక్టరేట్ ప్రాంగణంలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వ సలహాదారులు కాదని జిల్లా నుంచి ఆయనే మంత్రి అన్నారు. జిల్లాకు మెడికల్ కళాశాల తెప్పించిన ఘనత సుదర్శన్ రెడ్డి చొరవతో వచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదన్నారు. కరీంనగర్ నిజామాబాద్ ఆలయం కారిడార్ 360 కోట్ల రోడ్డు నిధులు మంజూరయ్యాయి. త్వరలో లింబాద్రిగుట్ట, సిద్ధుల గుట్ట వద్ద పర్యాటక గెస్ట్‌హౌస్ ముందంజలో ఉంచబోతున్నామన్నారు. బోధన్‌లో పామాయిల్ ఫ్యాక్టరీ త్వరలో ఏర్పాటు చేయబోతున్నాం. జిల్లాను వ్యవసాయ పరంగా అభివృద్ధి చేస్తామని, త్వరలో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటాం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని, జిల్లాలో మున్సిపాలిటీలో అభివృద్ధికి రూ.500 కోట్లు మంజూరు చేశామన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, చైర్మన్లు కేశ వేణు, తాహెర్‌బిన్ హందాన్, గంగారెడ్డి, రాజారెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, నాయకులు నగేష్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, నరాల రత్నాకర్, నాయకులు పాల్గొన్నారు.



## తొలగించిన ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోండి

కల్వకుంట్ల కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్: వివిధ చిన్న చిన్న కారణాలతో 2021 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఆర్‌టిసిలో డిస్మిస్ అయిన సుమారు 1300మంది డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర కార్మికులను తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆర్‌టిసి యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు ఆర్‌టిసి ఎం.డి.నాగిరెడ్డిని హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో కల్వకుంట్ల కవిత గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ 2021 నుంచి ఇప్పటి వరకు తొలగించిన 1,300 మందిలో 491 మందిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని గతంలోనే ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ, వారిని కూడా ఉద్యోగాల్లోకి తీసుకునే ఆలోచనలో ఆర్‌టిసి సంస్థ లేనట్టుగా తెలుస్తోందన్నారు. ఇది వరకు ఉత్తర్వులు ఇచ్చిన 491 మంది కార్మికులతో పాటు మిగతా కార్మికుల విషయంలోనూ ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆర్‌టిసిలో హైర్ బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులు తీసుకుంటున్నారని, వాటి డ్రైవర్లపై ఆర్‌టిసికి నియంత్రణ ఉండటం లేదని, అందుకే హైర్, ఎలక్ట్రిక్ బస్సులను ఆర్‌టిసి డ్రైవర్లే నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని కవిత సూచించారు. ఆర్‌టిసి కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని, అప్పుడే ప్రజలకు భద్రతతో కూడిన ప్రయాణం , కార్మికులకు ఉద్యోగ భద్రత ఉంటుందని కవిత అన్నారు.

# రిజర్వేషన్లు అడ్డుకుంటే యుద్ధమే

స్థానిక సంస్థల్లో చట్టబద్ధంగానే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

బిసి వ్యతిరేకులకు గుణపాఠం తప్పదు

ఎంపి ఆర్.కృష్ణయ్య



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లను అడ్డుకుంటే యుద్ధమే జరుగుతుందని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. తెలంగాణ వ్యాప్తంగా బిసిల ఉద్యమం జోరందుకుందని, బిసి సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ సంఘాలు, ఒయులో విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో దీక్షలు జరుగుతున్నాయని, ఇక బిసి న్యాయవాదుల న్యాయ దీక్ష జరుగుతుందని, సకల జనుల సమ్మె తరహాలో మహా ఉద్యమాన్ని చేపడతామని అన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బర్కత్‌పుర వద్ద భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జారీ చేసిన జిఒకు రాజ్యాంగబద్ధత, చట్టబద్ధత ఉందని, న్యాయపరమైన అవరోధాలు లేవని న్యాయస్థానాల్లో కేసు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గత నెల 18న జరిగిన బంద్‌తోనైనా ప్రభుత్వం, రాజ్యాంగబద్ధమైన సంస్థలు కళ్ళు తెరవాలని, బిసిల వాటా బిసిలకు ఇవ్వడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రదర్శనలో బిసి సంఘం నాయకులు సి.రాజేందర్, టి.రాజ్‌కుమార్, పగిళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బందీ అవుతున్న బాల్యం

ఆటపాటలకు దూరం

సెల్‌ఫోన్‌తోనే జీవితం

నేడు బాలల దినోత్సవం



ప్రజాపక్షం/ఖమ్మం : బాల్యం ఓ మధుర జ్ఞాపకం. బాధ్యతలు తెలియని వయస్సులో ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపాల్సిన బాల్యం అటు తరగతి గదుల్లోనూ, హోంవర్క్‌లతో ఇంట్లోనూ బంధి అవుతుంది. ఇప్పటి బాల్యం అంటే తరగతి గదులు, హోంవర్క్‌లు, సెల్ ఫోన్లే. ఏడాది వయస్సు నుంచే సెల్‌ఫోన్ చూపితే ఏడుపు ఆగిన పరిస్థితికి బాల్యం నెట్టివేయబడింది. ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల మధ్య ప్రారంభమైన పాఠశాల సాయంత్రం నాలుగైదు అయితే తప్ప వదలడం లేదు. అంటే దాదాపు పగటి సమయమంతా తరగతి గదుల్లో బంధించబడుతున్నారు. సాయంత్రం విద్యా సంస్థ నుంచి బయటకు వచ్చి అరగంట నుంచి గంటన్నర సేపు బస్సు ప్రయాణం, ఇంటికి రాగానే హోంవర్క్ రోజంతా పసి మెదళ్లలోకి ఏమి చొప్పిస్తున్నారో తెలియదు కానీ ఎక్కువ సేపు బంధించే పాఠశాలలకు మంచి పేరు వస్తుందన్న ఆరోపణ లేకపోలేదు. ప్రైవేటు విద్యా సంస్థలకు ఆట స్థలాలు ఉండవు. అనుమతులకు ఆట స్థలాలు చూపిన అవి నిరూపయోగంగా ఉంటాయి. ఖాళీ సమయం దొరికితే సెల్‌ఫోన్‌తో ఆడటం, సెల్‌ఫోన్ కారణంగా మనుషుల అనుబంధాలు అడుగంటుతున్నాయనుకుంటే పిల్లల పరిస్థితి మరి ఘోరం. ఇరుగు పొరుగుకు దూరమవుతున్నారు. విద్యా బోధన పేరుతో పసి మెదళ్లపై ఒక పక్క దాడి జరుగుతుంటే మరో పక్క శారీరకంగా బలపడేందుకు దారుఢ్యాన్ని పెంచుకునేందుకు అవకాశాలు లేక బలహీనమైన భవిష్యత్తు గోచరిస్తుంది. ఎండకు వాడిన ఆకుకూర కట్టల్లా తయారవుతున్నారు. పిల్లల్లో నాటి చిరునవ్వులు మచ్చుకు కూడా కనిపించడం లేదు. పెద్దల ఆలోచనలు పిల్లలపై రుద్దుతున్నారు. ఆటలు ఆడితే, ఇతరులతో మాట్లాడితే తప్పు పిల్లలు చెడిపోతారన్న భావన తల్లిదండ్రుల్లో రోజు రోజుకు బలపడుతుంది. ఏడిస్తే సెల్‌ఫోన్‌లో బొమ్మలు చూపుతున్నారు తప్ప ఎత్తుకుని ఊరడించడం లేదు అంటే ఆంటీ అంకుల్ తప్ప మరో పదం పలకడం లేదు. బంధువులతోనూ సంబంధ బాంధవ్యాలు ఏర్పడడం లేదు. మహకవి శ్రీశ్రీ చెప్పినట్లు అచ్చటి కిచ్చటి అనుకోకుండా ఎచ్చటి ఎచ్చటికో ఎగురుతూ పోయే పిల్లల్లారా అన్న చరణం ఇప్పటికీ బాల్యానికి తద్ విరుద్ధంగా ఉంది. పాఠశాలల్లో విద్యా బోధన పేరుతో ఒక పక్క తన కళలను సార్థకం చేసుకోవాలని తమ ఆశలకు అనుగుణంగా ఎదగాలన్న ఆలోచనతో తల్లిదండ్రులు బాల్యం మధురస్మృతులకు నేటి తరాన్ని దూరం చేస్తున్నారు. ఎదగడానికి ఎందుకురా తొందర ఎదర బతుకంతా చిందర వందర అన్న మనసు కవి ఆత్రేయ మాటలను మననం చేసుకుంటే ఇప్పుడు ఎదగక ముందే బాల్యం ఓ చట్రంలో బంధించబడుతుంది. స్వేచ్ఛలేని పసి మనుస్సులు ఆలోచనలను కోల్పోతున్నాయి.

**పసి బాల్యం ఆశలన్నీ వసి వాడుతూ రాలుతున్నాయి**
**కార్పొరేట్ కసాయి మూకల**

కాళ్ల కింద నలుగుతున్నాయి అని ఓ కవి చెప్పినట్లు బాల్యం బాల్యంలా గడపటం లేదు. ఇప్పటికే ఫారెన్ కోళ్లలా పెరిగి ఉద్యోగ వేటలో విఫలమై తల్లిదండ్రులకు భారమైన ఇప్పటి యువతరంతోనే ఇబ్బందులు పడుతుంటే సమాజ పోకడ తెలియని చాటుమాటుగా సెల్‌ఫోన్ స్నేహితులుగా పెరిగిన నేటి బాలలు రేపటి పౌరులైతే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుంది. మెరుగైన భవిష్యత్తు సమాజం కోసం అటు పాలకులు, ఇటు తల్లిదండ్రులు ఆలోచన చేయాలి. రకరకాల కోర్సుల పేరుతో పసిమెదళ్లను తొలిచి హింసావాదులుగా మారిన కార్పొరేట్ లేదా ప్రైవేట్ విద్యా సంస్థల్లో బందీ అయిన బాల్యాన్ని విడిపించే ప్రయత్నం చేయాలి. లేదంటే పసివయస్సులో చిరునవ్వులు దూరమై బేల చూపుల బాల్యం కండ్ల ముందు కనపడుతుంది.

**CHANGE OF NAME**

I, **RUTUJA MARUTI DHENGE,** (old Name) H.No. Block No. 90/6, Indiramma Colony, Bahadurpally, Dundigal - Gandimaisamma Mandal, Medchal - Malkajgiri District, Telangana State - 500043, has changed as **PATIL RUTUJA AKSHAY, W/o. PATIL AKSHAY** (New Name) for all purposes

**దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ**
(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు - 17/2025-26.

**వివరాలు:** స్పెసిఫికేషన్ నెం. 17/25-26 (ECV>100L), 07/25-26(ECV>100L) మరియు 23/25-26(ECV>100L) యొక్క రెండవ పొడిగింపు. **1. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభం:** 14.11.2025న 14:00 గంటల నుండి. **2. బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ & సమయం ఆన్‌లైన్:** 21.11.2025న 14:00 గంటల వరకు. **3. బిడ్ సమర్పణ చివరి తేదీ & సమయం:** 21.11.2025న 14:30 గంటల వరకు. **4. DDs/BGs తో పాటు హార్డ్ కాపీలకు చివరి తేదీ & సమయం:** 22.11.2025న 14:00 గంటల వరకు. **5. సాంకేతిక బిడ్ ప్రారంభ తేదీ & సమయం :** 22.11.2025న 15:00 గంటలకు. **6. ధర బిడ్ ప్రారంభ తేదీ & సమయం :** 28.11.2025న 15:00 గంటలకు. మరిన్ని వివరాల కోసం దయచేసి www.tender.telangana.gov.in మరియు www.tgsouthernpower.org ని సందర్శించండి మరియు CE/Op/రూరల్ జోన్, గగన్‌విహార్, నాంపల్లి, హైదరాబాద్. ఫోన్ నంబర్: 040-29301311 ను సంప్రదించండి.

సం/- చీఫ్ ఇంజనీర్, ఆపరేషన్, రూరల్ జోన్, TGSPDCL, గగన్ విహార్, నాంపల్లి, హైదరాబాద్.

DIPR R.O. No. : 10593-PP/CL/ADVT/1/2025-26, Date: 13-11-2025

**GREATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
టెండర్ ప్రకటన

**NIT No.** కొటేషన్ నోటీసు నెం. 03EE/PD-NZ/GHMC/2025-26, తేది: 13.11.2025, **పని పేరు:** పాటిగడ్డ ROB నిర్మాణ పనుల కోసం నాన్-ఎస్ఎస్ఆర్ వస్తువులకు సీల్డ్ కొటేషన్లు. **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 14.11.2025న ఉ.11.00గం.ల నుండి, ఆఖరి తేది: 17.11.2025న మ.03.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఇఇ, పిడి-ఎన్‌జెడ్, జిహెచ్‌ఎంసి. సెల్ నెం.9959442013. **గమనిక:** కొటేషన్ సమర్పించడానికి సంబంధించిన వివరణాత్మక వివరణలు మరియు షరతులను www.ghmc.gov.in వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు సంప్రదించండి: ఎఇఇ 7331189758.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పిడి-ఎన్‌జెడ్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 10567-PP/CL/ADVT/1/2025-26, Date: 13-11-2025

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

బహిరంగ ప్రకటన HMDA చట్టం-2008 యొక్క సెక్షన్ 15 (4) ప్రకారం

**(G.O.Ms.No. 214 MA & UD డిపార్ట్‌మెంట్., తేదీ : 28. 10. 2025)**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (2008 యొక్క చట్టం నెం.8) లోని సెక్షన్ 15లోని సబ్ సెక్షన్ (1) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ ప్రభుత్వం ఇందుమూలంగా ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ MDP-2031లో ఊహించిన భూ వినియోగానికి G.O.Ms. No.33 MA &UD తేదీ : 24.01.2013 ద్వారా ఈ సెక్షన్ యొక్క సబ్‌సెక్షన్ (1) ప్రకారం అవసరమైన విధంగా ఈ కింది మార్పును చేస్తున్నది.

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట్ (మండలం), తుర్కపల్లి (గ్రామం)లోని సర్వే నెంబర్లు: 514/P, 513, 512/P, 550/Pలో ఎకరం 26-09 గుంటలు., లేదా 106128.80చదరపు మీటర్లు విస్తీర్ణంలో ఉంది. ఇది ప్రస్తుతం ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ MDP-2031లో కన్జర్వేషన్ వినియోగ జోన్ కోసం కేటాయించబడింది. ప్రభుత్వ G.O.Ms.No. 33 MA & UD తేదీ : 24.01.2013 ప్రకారం ఇప్పుడు నివాస వినియోగంగా గుర్తించబడింది. తేదీ: 06.07.2020 ప్రకారం G.O.Ms.No. 106 MA యొక్క సమ్మతికి లోబడి ఉంటుంది.

పైన పేర్కొనబడిన వివరాలు http: //gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయి.

సం/- ప్లానింగ్ అధికారి (KS) HMDA

DIPR R.O. No. : 10614-PP/CL/ADVT/1/2025-26, Date: 13-11-2025

## న్యాయవాదిపై పోలీసుల దాడి హేయమైన చర్య



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పుట్ట అనిల్ కుమార్ అనే న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడం హేయమైన చర్యని ఐఏఎల్, ఏఐఎల్‌యు యూనియన్స్ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, మారపాక వెంకన్నలు ఖండించారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నిర్మల్ జిల్లా కోర్టు ఆవరణలో అనిల్ కుమార్ అనే న్యాయవాది అతని కక్షిదారుని కోర్టులో సరెండర్ చేయటానికి తీసుకు వస్తుండగా కోర్టు ఆవరణలో న్యాయవాదిపై దాడిచేసి అతని కారును ధ్వంసం చేయడమే కాకుండా అతని కక్షి దారుని దౌర్జన్యంగా తీసుకపోయారని తెలిపారు. తక్షణమే న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి తొగిటి మురళి, ఏపూరి శంకరయ్య, ఏడెల్ల అశోక్, గూడూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 17న సదర్ సమ్మేళనం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈనెల 17న పట్టణంలోని ఎన్‌జి కళాశాలలో నిర్వహించనున్న సదర్ సమ్మేళనానికి సంబంధించిన వాల్ పోస్టర్ గురువారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో అధికారికంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. సామూహికాభివృద్ధికి ప్రజలను ప్రోత్సహించడానికి ఈ సమ్మేళనం ఒక ముఖ్యమైన వేదిక అని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి,ప్రభుత్వ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లి సుభాష్ యాదవ్,మేకల యాదయ్య యాదవ్, శివ యాదవ్,వంశీ యాదవ్ పాల్గొన్నారు.



## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

### మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతుల సంపాదించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో దామరచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థినిలతో కలిసి అల్పాహారం చేసి పాఠశాల వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. మండలంలోని తుంగపాడు మోడల్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలో గుంపులుగా విద్యార్థులు వెళ్తుండడాన్ని గురువారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గమనించి ఆటోను ఆపి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకొని వెంటనే మిర్యాలగూడ ఆర్టీసీ డీఎంకు ఫోన్ చేసి శనివారం నుంచి ఉదయం 8.30గంటల వరకు మిర్యాలగూడ బస్టాండ్‌లో మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం మోడల్ స్కూల్‌కు వెళ్లి ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి శనివారం నుంచి ఉదయం మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యార్థులందరికి తెలియచేయాన్నారు. ఎమ్మెల్యే చూపిన చొరవ పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## యుద్ధప్రాతిపదికన ఇంటి నిర్మాణ పనులు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** పేదవారి సొంతింటి కలను నెరవేర్చేందుకు సింగిల్‌బెడ్ రూమ్ ఇంటి నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న సింగిల్‌బెడ్ రూమ్ ఇంటి నిర్మాణ పనులను గురువారం కలెక్టర్ పర్యవేక్షించారు. కలెక్టర్ ఇందిరమ్మ కాలనీ మొత్తం తిరుగుతూ గృహాలను, రోడ్లను అలాగే నిర్మాణంలో ఉన్న నీటి సంపు, సెప్టిక్ ట్యాంక్, హాస్పటల్ పనులు అలాగే విద్యుత్ సరఫరా లాంటి తదితర పనులు వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతూ ఏటిసి ద్వారా మంచి నైపుణ్యాలు నేర్చుకొని ఉపాధి కల్పన పొంది జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం హుజూర్‌నగర్ ఆర్‌డిఓ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలో 338 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని మౌళిక వసతులు కల్పించామని తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణంలో నేడు రామస్వామి గుట్ట వద్ద సింగిల్ బెడ్ రూమ్ ఇల్లులు మొత్తం 2160 మంజూరయ్యాయని బ్లాక్‌కి 16 ఇండ్లు చొప్పున 135 బ్లాక్‌లో నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటికే 124 బ్లాక్‌లలో 1984 ఇల్లులు పూర్తయ్యాయని, 11 బ్లాక్‌లోని 176 ఇల్లులు స్లాబ్ పూర్తి అయి గోడల పనులు జరుగుతున్నాయని వాటిని త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఆర్‌డిఓ శ్రీనివాసులు, హౌజింగ్ పిడి సిద్ధార్థ, ఎంపిడిఓ సుమంత్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరెడ్డి, డిఈ జంగయ్య, డిటి నాగేందర్, ఏఈ సాయిరాంరెడ్డి ఉన్నారు.

## ప్రయాణం సంపూర్ణంగా సాగాలి

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర




**ప్రజాపక్షం/చిట్యాలః** వాహనాలపై ప్రయాణం చేసే వారు తమ గమ్య స్థానాలకు చేరే వరకు ప్రయాణం సంపూర్ణంగా సాగేలా చూసుకోవాలని నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర అన్నారు. జిల్లాలోని చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో 65వ నెంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలకు సంభందించిన హోర్డింగ్‌ను గురువారం రోజున ఆయన ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ రహదారిపై వాహనాలను నడిపే వారు అతి వేగంగా వాహనాలను నడపరాదని, ట్రాఫిక్ రూల్స్‌ను తప్పక పాటించాలని అన్నారు. డ్రైవర్లు అప్రమత్తంగా ఉండటం కోసం, వారికి అవగాహన కల్పించడం కోసం రహదారి పక్కన ప్రమాదానికి గురైన కారును ప్రదర్శిస్తూ హోర్డింగ్‌ను వినూత్నంగా ఏర్పాటు చేశామని ఎస్‌పి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శివ రాంరెడ్డి, సిఐ నాగరాజు, ఎస్ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో నలుగురు యువకులు అరెస్ట్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గంజాయి విక్రయిస్తూ నలుగురు యువకులు త్రిపురారం పోలీసులకు పట్టుబడ్డారు. గురువారం మిర్యాలగూడలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు వివరాలు వెల్లడించారు. అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పిల్లి మణికంఠ, మాడ్గులపల్లి మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన దండు వినోద్, బండి కోటేష్ అనే ముగ్గురు యువకులు స్నేహితులు, వీరు ముగ్గురు కలిసి గంజాయి తాగేవాళ్లు, వీరికి పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన శివ అనే వ్యక్తి తన స్నేహితుడైన చల్లా అంజి వద్ద గంజాయి కొనుగోలు చేసి పలు ప్రాంతాల్లో విక్రయించేవాడు. ఎప్పటిలాగానే కొమ్మెర శివ అనే వ్యక్తి తన స్నేహితుడైన చల్లా అంజి వద్ద 1.6కిలోల గంజాయిని మాచర్లలో కొనుగోలు చేసి గురువారం ఉదయం పది గంటల సమయంలో త్రిపురారం గ్రామ శివారులో గంగదేవరమ్మ గుడి వద్ద మణికంఠ, వినోద్, కోటేష్‌లకు విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న త్రిపురారం ఎస్ఐ కె.నరేష్ తన సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారని అన్నారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న చల్లా అంజి పరారీలో ఉన్నాడని అతన్ని కూడా త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. హాలియా సీఐ సతీష్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీను, చంద్రశేఖర్, నాగేశ్వర్‌రావు, ఆర్. శ్రీనివాస్, హోంగార్డులు రఫి, చాంద్‌పాషా, ఇబ్రహీం, కవిత పాల్గొన్నారు.

## శివరాత్రి నాటికి మేళ్లచెరువు ఎన్ఎస్‌పి కాల్వపై బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి

### రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (మేళ్ళచెరువు) :** రాబోయే శివరాత్రి నాటికి మేళ్లచెరువు ఎన్ఎస్‌పి కాల్వపై నిర్మిస్తున్న బ్రిడ్జిలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రావాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మేళ్ళచెరువులో రూ.3 కోట్లతో కోదాడ రేవూరు రోడ్డు మేళ్ళచెరువు గ్రామం మెయిన్ రోడ్డు డబుల్ లైన్ నుండి ఫోర్ లైన్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కందిబండ వద్ద వరదలకు తెగిపోయిన బ్రిడ్జిలు వేగవంతంగా, నాణ్యతతో నిర్మించి డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మేళ్లచెరువు గ్రామంలో షాదిఖానా నిర్మించుటకు రూ. 1 కోటి మంజూరు చేశామని, స్థలం సేకరించాలని తహశీల్దార్‌కి ఆదేశాలు జారీ చేశారు. ముత్యాల బ్రాంచ్ కెనాల్ చివరి ఆయకట్టుకు సాగర్‌లో నీరు తక్కువగా ఉన్నప్పుడు సాగునీరు అందడం లేదని పాత వెల్లటూరులో మహాత్మాగాంధీ ముత్యాల బ్రాంచ్ కెనాల్ పేరిట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను నిర్మించి పాత వెల్లటూరు నుండి ముత్యాల బ్రాంచ్ కెనాల్‌లో నీరు ఎత్తిపోసి 365 రోజులు పాటు సాగునీరు అందేలా చూస్తున్నానని దీని ద్వారా మేళ్లచెరువు మండలంలో 15వేల ఎకరాలకు సాగునీరందుతుందని, మేళ్ళచెరువు మండల భూ ము లు ఇప్పుడు రాజధానితో పోటీపడుతున్నాయన్నారు. అభివృద్ధి చేతనలో నేను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు.



## మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయం

**ప్రజాపక్షం/చింతలపాలెం :** కార్పోరేట్ కంపెనీలు సిఎస్ ఆర్ నిధులుతో సామాజిక బాధ్యతగా ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాలు కల్పించటం అభినందనీయమని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. చింతలపాలెంలో మెటల్ ఫౌడర్ కంపెనీ సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ.64లక్షలతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన తరగతి గదులు, వంటశాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెటల్ ఫౌడర్ కంపెనీ ద్వారా స్థానికులకు ఎక్కువ ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఇలాంటి అభివృద్ధి పనులు ఇంకా చేపట్టాలని కోరారు. హుజూర్‌నగర్ నియోజక వర్గంలో విద్య, వైద్యకి అధిక ప్రాధాన్యత నిస్తూ ముందుకు వెళ్తున్నామని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్, రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చింతలపాలెం మండలంలో సాగు నీరు అందుతుందని, ఇటీవలే కనివిని ఎరుగని రీతిలో జాబ్‌మేళా నిర్వహించి 4500 మందికి ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఆర్‌డిఓ శ్రీనివాసులు, తహశీల్దార్ సురేందర్ రెడ్డి, ఎంపిడిఓ రామచంద్రరావు, ఎంపిఓ భూపాల్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మెటల్ పౌడర్ కంపెనీ ప్రతినిధులు దీపక్, రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరాల కొండారెడ్డి పాల్గొన్నారు.



## నల్లగొండకు 19న సిపిఐ ప్రచార జాత

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ సందర్భంగా ఈనెల15 నుండి 21 వరకు గద్వాల నుండి ప్రారంభమై కొత్తగూడెం వరకు నిర్వహించే ప్రచార జాతలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి పిలుపునిచ్చారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రచార జాతకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో సిపిఐ భాగాన నిలిచిందన్నారు. పట్టణ కార్యదర్శి కత్ర సైదిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రచార జాత కార్యక్రమంలో భాగంగా ఈనెల 19 న నల్లగొండకు చేరుకుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి విశ్వనాధుల లెనిన్, ముండ్ల ముత్యాలు,యూసుఫ్,ధోటి పాండరీ,బి.వెంకటయ్య,కె.నారాయణ,అక్కలయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోదా యాదగిరి జ్ఞాపకార్థం కమ్యూనిటీ హాల్ ఏర్పాటు

### యాదగిరి ఆశయ సాధనలోనే ఆలేరు అభివృద్ధి
### స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐతో కలిసి పోటీ
### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకులు, పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన అమరజీవి గోదా యాదగిరి జ్ఞాపకార్థం కమ్యూనిటీ హాల్‌ను గుండ్లపల్లి గ్రామంలో నిర్మాణం చేయిస్తానని ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. గురువారం అమరజీవి కామ్రేడ్ గోదా యాదగిరి 26వ వర్ధంతి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు కోసం అనునిత్యం పోరాడిన గొప్ప నాయకుడు గోదా యాదగిరి అని అన్నారు. వారు చాలామంది నిరుపేదల కోసం ఉండడానికి ఇంటి స్థలాలు పంపిణీ చేయించారని అలాంటి గొప్ప నాయకుడు ఆశయ సాధన అడుగు జాడల్లోనే ఆదర్శంగానే ఆలేరు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గోదా యాదగిరి వారి కంటి చూపు లేకున్నా పేద ప్రజల కష్టాలను తెలుసుకొని వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటులో వారి పాత్ర చాలా ముఖ్యమైనది వారు అన్నారు. పాతగుట్ట రోడ్డులో అనేక స్థలాలను పంపిణీ చేయించారని దానికి వారి పేరు నామకరణం చేస్తామని హామీ ఇచ్చినారు. ఆలేరు నియోజకవర్గంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐతో కలిసి పోటీ చేస్తామని అన్నారు. అలాగే తన గెలుపుకు కృషి చేసి గెలుపులో భాగస్వాములైన సిపిఐతో ఆలేరు నియోజకవర్గంలో కలిసి అభివృద్ధికి పాటుపడతానని వారు అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ కామ్రేడ్ ఆరుట్ల రామచంద్రారెడ్డి కమలాదేవి నాయకత్వంలో ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి వారు కృషి చేశారని, గీతా కార్మిక కుటుంబంలో జన్మించిన ఆయన కామ్రేడ్ ధర్మ బిక్షం నాయకత్వంలో గీత కార్మికుల సమస్యల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఎమ్మార్వో, బస్టాండు, ప్రస్తుత మున్సిపల్ కార్యాలయల ఏర్పాటు చేయించడంలో వారి పాత్ర ముఖ్యమైనదని అన్నారు. అలాగే గణేష్ నగర్, బీసీ కాలనీ, ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు నిర్మాణం చేసుకోవడం వారు ఇప్పించారని అన్నారు. ఒక్కొక్కరికి 13 గుంటల చొప్పున పాత గుట్ట రోడ్డులో గుంజు బట్ట భూమి పంపిణీ వారు చేయించారన్నారు. వారి జ్ఞాపకార్థం కమ్యూనిటీ హాల్‌లో ప్రకటించినందుకు ఎమ్మెల్యేకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ కొల్లు రాజయ్య, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లపల్లి మహేందర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, ప్రజానాట్యమండలి కార్యదర్శి చెక్క వెంకటేష్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి ఎషాల అశోక్, మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన పెంటయ్య పాల్గొన్నారు.



## ఇన్సూరెన్స్ కంపెనీల ఆదేశాలను ఉపసంహరించుకోవాలి

### సిఎస్‌సిహెల్త్ టెస్టులను రద్దు చేయాలి
### రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

**ప్రజాపక్షం/నల్లగొండ :** భవన నిర్మాణం వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలనే జీవో నెంబర్ 12 ను సవరించి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించాలని, సహజ మరణానికి ఐదు లక్షలు ఇవ్వాలని, సిఎస్ సి హెల్త్ టెస్టులు ను రద్దు చేయాలని ఈనెల 25న కలెక్టరేట్ ధర్నా,డిసెంబర్ 5న చలో లేబర్ కమిషనర్ను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి (సిఐటియు) చినపాక లక్ష్మీనారాయణలు ప్రభుత్వాన్ని పిలుపునిచ్చారు. గురువారం భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్ లో అవుట రవీందర్ (సిఐటియు),దోటి వెంకన్న (ఎఐటియుసి),బి నరసింహ (ఐఎఫ్‌టియు) అధ్యక్ష వర్గంగా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం ప్రజా పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులు దుర్వినియోగం అవుతున్న పట్టించుకోవడంలేదని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద మరణం, సహజమరణం,శాశ్విత,పాక్షిక అంగవైకల్యం లాంటి స్కీములను జీవో నెంబర్ 12 ద్వారా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తూ 346.36 కోట్ల క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడం కార్మికులకు అన్యాయం చేయడమేనని ఇదేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. సిఎస్ సి హెల్త్‌కేర్ టెస్టులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సలీం, బిఆర్‌టియు నాయకులు బోడ ఇస్తారి, జిల్లా నాయకులు విలెనిన్,గుండె రవి,రేవెల్లి యాదయ్య, గుండ నాగయ్య, పోలే సత్యనారాయణ,ఎస్ సైదాచారి,కె ఎస్ రెడ్డి,నాయకులు నరేందర్ పాల్గొన్నారు.

## కొనుగోళ్ల విషయంలో జాప్యం చేయొద్దు



### ఐకెపి కేంద్రాలను నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/మునుగోడు:** కొనుగోలు కేంద్రాలకు నాణ్యత ప్రమాణాలతో వచ్చిన వరి ధాన్యాన్ని జాప్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం ఆమె మునుగోడులో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు పరిశీలించారు 17 శాతం తేమతో తాలు,తరుగు లేకుండా వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని,అన్నారు.వర్షం కూడా లేనందున తేమ ను పరిశీలించి రైతులకు మేలు జరిగే విధంగా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. రైతులతో మాట్లాడుతూ ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.రైతులు ధాన్యం కొనుగోలు విషయంలో ఏ ఇబ్బంది లేవని చెప్పారు. పత్తి కొనుగోళ్ల పై ఆమె మాట్లాడుతూ రైతులు 12 శాతం వరకు తేమ వచ్చిన తర్వాత స్లాట్ బుక్ చేసుకోవాలని అప్పుడు పత్తి కొనుగోలు లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి,పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపికృష్ణ,జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్,జిల్లా సహకార అధికారి పత్య నాయక్,ఆర్‌డిఓ శ్రీదేవి, తహసిల్దార్ నరేష్,సెక్రెటరీ సుఖేందర్ తదితరులు ఉన్నారు.

**సహజ వ్యవసాయం ద్వారా నాణ్యమైన పంటలు**

సహజ వ్యవసాయం చేయడం ద్వారా కల్తీలేని,ఆరోగ్యకరమైన నాణ్యమైన పంటలు పండించవచ్చని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కిష్టాపురం గ్రామంలో రసాయన ఎరువులు,పురుగుమందులు వాడకుండా యువ రైతు జక్కుల వెంకటేశ్ పండిస్తున్న సహజ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సహజ పంటలను ఏ విధంగా పండిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, రైతులు ఈ పద్ధతిని అవలంబిస్తే భూసారాన్ని కాపాడుతూ ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయగలుగుతారని అన్నారు. సహజ పద్ధతిలో సాగు చేయాలనుకున్న రైతులకు సాంకేతిక సాయం అందించాలని అధికారులకు సూచించారు.ఈనెల 22 న నల్లగొండ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉదయాదిత్య భవన్ లో సహజ వ్యవసాయంపై విజయరామ సహజ వ్యవసాయ నిపుణుల అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

## జాతీయ రహదారి వెంట పటిష్ఠ నిఘా

### సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌పి కె నరసింహ తనిఖీ

**ప్రజాపక్షం/సూర్యాపేట (సూర్యాపేట రూరల్) :** సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి కె నరసింహ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఉన్న పలు రికార్డులను, పోలీస్ స్టేషన్ నిర్వహణ, పరిసరాలు, ఫిర్యాదుల నిర్వహణ, రిసెప్షన్ మేనేజ్మెంట్ మొదలగు అంశాలను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన బాధితులతో మాట్లాడి ఫిర్యాదులను త్వరితగతిన పరిశీలించాలని ఎస్ఐని ఆదేశించారు. జాతీయ రహదారి వెంట పటిష్టమైన నిఘా ఉంచి భద్రత పర్యవేక్షణ చేయాలని అసాంఘీక కార్యకలాపాలు, అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాలను పటిష్టంగా నిర్మూలించాలని ఆదేశించారు. బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించాలని, వారితో మర్యాదగా, గౌరవంగా నడుచుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై వెంటనే త్వరితగతిన స్పందించి, ప్రాథమిక విచారణను వేగంగా నిర్వహించి బాధితులకు బరోసా కల్పించాలని సూచించారు. ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదులో ఎలాంటి జాప్యం ఉండవద్దన్నారు. రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఉన్నారు.


## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

### రూ, 1,20,000 నగదు, 36 లక్షల విలువ చేసే మూడు ఖరీదైన కార్లు స్వాధీనం
### ఎఎస్‌పి మౌనిక వెల్లడి

**ప్రజాపక్షం/చింతపల్లి :** పగటిపూట రెక్కి నిర్వహించి ఖరీదైన కార్లలో రాత్రి సమయాలలో తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను పట్టుకొని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ మౌనిక తెలిపారు. గురువారం మండల కేంద్రలోని పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మౌనిక తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజామున చింతపల్లి పోలీసులు నాగార్జునసాగర్ రహదారి పై తనిఖీలు నిర్వహిస్తుండగా స్కార్పియో వాహనంలో ప్రయాణిస్తున్న అంతర్ జిల్లా దొంగల ముఠా పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వెండబడించి వారిని పట్టుకోవడం జరిగిందన్నారు. పట్టుబడిన దొంగల ఫింగర్ ప్రింట్ స్కానర్‌తో చెక్ చేయగా గతంలో మేకల దొంగతనం కేసులో నిందితులుగా ఉన్నట్టు తెలిపారు. పట్టుబడిన దొంగల ముఠాలో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్టు తెలిపారు. దొంగల ముఠాను అదుపులోకి తీసుకొని విచారించగా వీరి పై గతంలో నల్గొండ, కనగల్, చండూర్, విజయపురి, నార్కట్‌పల్లి, నల్లగొండ టూ టౌన్, మర్రిగూడ, దేవరకొండ, శాలిగౌరారం, నాంపల్లి, మునుగోడు, చింతపల్లి పోలీస్ స్టేషన్లలో మేకల దొంగతనాల నేరాలలో నిందితులుగా ఉన్నట్టు గుర్తించారు. వీరు గతంలో జైలుకు వెళ్లి బెయిల్ పై వచ్చి వారి ప్రవర్తన మార్చుకోకుండా తిరిగి నేరాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. పరిచయం ఉన్న వారందరూ కలిసి గ్యాంగులుగా ఏర్పడి ఎవరికి అనుమానం రాకుండా ఖరీదైన కార్లలో వచ్చి పగటిపూట రెక్కీ నిర్వహించి, రాత్రి సమయాలలో మేకలను కార్లలో వేసుకొని సంతలలో గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి జల్సాలకు పాల్పడుతుంటారని ఏఎస్పీ మౌనిక తెలిపారు. చింతపల్లి, దేవకొండ, గుడిపల్లి, కల్వకుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల మేకల దొంగతనాలకు పాల్పడినట్టు తెలిపారు. ఈ దొంగల ముఠా నుండి రూ, 1,20,000 నగదు, 36 లక్షల రూపాయల విలువ చేసే మూడు ఖరీదైన కారులను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్టు ఆమె తెలిపారు. పట్టుబడిన దొంగలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అమ్మలూరి విజయ్, నల్లగొండ జిల్లాకు నిడమనూరుకు చెందిన దాసర్ల వినోద్ కుమార్, గుంజ కార్తీక్, నల్లగొండ జిల్లా అనుముల మండలానికి చెందిన సంపంగి శారద, పల్నాడు జిల్లా గురజాల మండలానికి చెందిన అమ్ములూ నందిని ఉన్నారు. పట్టుబడిన దొంగల ముఠాలోని ఇద్దరు సభ్యులు సంపంగి వెంకటేష్, శబరీష్ పరారీలో ఉన్నట్టు తెలిపారు.



దేవరకొండ ఏఎస్పీ మౌనిక పర్యవేక్షణలో ప్రతిభ కనబరిచిన నాంపల్లి సీఐ రాజు, చింతపల్లి ఎస్సై రామ్మూర్తి, కానిస్టేబుల్ సైదులు, చరణ్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, విజయ్ శేఖర్లను జిల్లా ఏఎస్పీ మౌనిక అభినందించారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ప్రమాదంపై పైలట్‌ను నిందించలేదు
### ఎయిర్ ఇండియా ఘటనపై సుప్రీంకు కేంద్రం వివరణ

**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్ విమానాశ్రయం సమీపంలో కుప్పకూలిన ఎయిర్ ఇండియా ప్రమాదంలో పైలట్‌ను నిందించలేదని, ఆయనను తప్పుపట్టలేదని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఎదుట హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం వివరణ ఇస్తూ, 260 మంది మరణించిన ఎయిర్ క్రాఫ్ట్ ప్రమాదంపై దర్యాప్తు జరిపిన ఎఎఐబి బృందాన్ని అంతర్జాతీయ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేశామని, అందుకోసం కొన్ని మన చట్టపరమైన నిబంధనలు కూడా ఉన్నాయని చెప్పారు. దీంతో జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ, విమాన ప్రమాదానికి గల కారణాన్ని చెప్పడానికి మాత్రమే దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు తప్ప ఇతరుల మీద నిందలు వేయడానికి దానిని ఏర్పాటు చేయలేదని, ఇలాంటి తప్పు మరోసారి జరగకుండా చూడాలని హితవు చెప్పారు. ఒక స్వచ్ఛంధ సేవా సంస్థ తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం ఎదుట మాట్లాడుతూ చాలా పెద్ద ప్రమాదం దేశంలో జరిగినందువల్ల కోర్టు విచారణ తరహాలో ఒక సమాంతర విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు.

ఢిల్లీ పేలుడు...

కుట్రదారులతా ఒకే మెయిల్ ఐడితో ఛాటింగ్

## కార్డియాలజిస్ట్ ఆరిఫ్ అరెస్ట్



**ముజఫర్‌నగర్ :** ఢిల్లీ బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు క్రమంలో మరో కీలక అరెస్ట్ జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో వైద్య విద్యార్థి(కార్డియాలజిస్ట్) డాక్టర్ మహ్మద్ ఆరిఫ్ (32)ను యుపి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఎటిఎస్) అదుపులోకి తీసుకుంది. జమ్ముకశ్మీరులోని అనంత్‌నాగ్ వాస్తవ్యుడైన అతడు, మూడు నెలల క్రితమే కాన్పూర్‌లోని గణేశ్ శంకర్ విద్యార్థి మెమోరియల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కార్డియాలజీ మొదటి సంవత్సరం కోర్సులో చేరాడు. ఢిల్లీ బ్లాస్ట్ కేసు నిందితురాలు డాక్టర్ షాహీన్ ఈ కాలేజీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసింది. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న డాక్టర్ షాహీన్ దర్యాప్తు క్రమంలో ఆరిఫ్ పేరును వెల్లడించినట్లు సమాచారం. దీంతో ఆరిఫ్‌ను అరెస్టు చేసి, ప్రశ్నించేందుకు రహస్య ప్రదేశానికి తరలించారు. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన డాక్టర్ ముజమ్మిల్, డాక్టర్ ఆదిల్, డాక్టర్ షాహీన్ ఎదుట కూర్చోబెట్టి ఆరిఫ్‌ను ప్రశ్నించే అవకాశం ఉంది.

**ఉగ్ర నెట్‌వర్క్‌తో టచ్‌లో ఆరిఫ్**

గురువారంతెల్లవారుజామున కాన్పూర్ సమీపంలోని నజీరాబాద్‌లో ఉన్న డాక్టర్ మహ్మద్ ఆరిఫ్ అద్దె ఇంటికి ఎటిఎస్ పోలీసులు చేరుకోగా, అతడు ఫోన్‌లోని డాటాను డిలీట్ చేయడానికి యత్నించాడు. అయితే పోలీసులు అతడి ఫోన్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. ఆరిఫ్ కాల్ రికార్డులు, ఛాట్‌లోని సమాచారాన్ని బట్టి అతడు ఢిల్లీ బ్లాస్ట్ కుట్రదారులతో కనెక్ట్ అయి ఉన్నట్లు అనిపిస్తోందని దర్యాప్తు అధికారులు తెలిపారు. డ్రాఫ్ట్ మెసేజ్‌లను షేర్ చేసుకునేందుకు ఈ కేసు నిందితులంతా ఒకే ఇమెయిల్ ఐడిని కలిసి వినియోగించారని గుర్తించామన్నారు. ఎలక్ట్రానిక్ నిఘా నుంచి తప్పించుకునేందుకు ఈవిధంగా చేసేవారని తెలిపారు. ఢిల్లీలో పేలుడు జరిగిన రోజున (నవంబరు 10న) నిందితురాలు డాక్టర్ షాహీన్ నెట్‌వర్క్‌లోని వ్యక్తులకు ఆరిఫ్ ఫోన్ కాల్స్ చేసినట్లు గుర్తించారు. ఉగ్ర కుట్ర వ్యవహారంలో డాక్టర్ షాహీన్, ఆమె సోదరుడు డాక్టర్ పర్వేజ్‌లతో ఆరిఫ్ టచ్‌లో ఉన్నాడని దర్యాప్తు అధికారులు చెప్పారు. డాక్టర్ మహ్మద్ ఆరిఫ్ ఇటీవలే జమ్ముకశ్మీరులోని సొంతూరికి వెళ్లి రావడం, అతడిపై ఉన్న ఉగ్ర లింకుల అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది.

**డాక్టర్ ఉమర్‌తో డాక్టర్ ముజమ్మిల్ గొడవ**

ఢిల్లీలో బాంబు పేలిన కారులో చనిపోయిన డాక్టర్ ఉమర్ కూడా జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా వాస్తవ్యుడే. దేశంలో నాలుగు ప్రధాన నగరాల్లో బాంబు పేలుళ్ల కోసం డాక్టర్ ఉమర్, డాక్టర్ ముజమ్మిల్, డాక్టర్ ఆదిల్, డాక్టర్ షాహీన్ కలిసి స్కెచ్ గీశారని దర్యాప్తులో గుర్తించారు. వారంతా కలిసి రూ.26 లక్షలను సమకూర్చుకొని, బాంబులు అమర్చేందుకు 32 పాత వాహనాలను కొన్నట్లు వెల్లడైంది. ఐఇడి పేలుడు పదార్థాల తయారీ కోసం రూ.3 లక్షలు విలువైన 26 క్వింటాళ్ల ఎన్‌పికె ఫెర్టిలైజర్‌ను కొన్నట్లు వెలుగులోకి వచ్చింది. దీనితో ముడిపడిన లావాదేవీల సమాచారం, డెలివరీ నివేదికలు పోలీసుల చేతికి చిక్కాయి. రూ.26 లక్షలను వినియోగించే విషయంలో డాక్టర్ ఉమర్, డాక్టర్ ముజమ్మిల్ మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని, ఈ క్రమంలోనే ఎర్రకోట సమీపంలో డాక్టర్ ఉమర్ కారులోని బాంబు పేలిందని అంటున్నారు.

## పేలుడుపై తక్షణం అఖిలపక్షం
### కాంగ్రెస్ డిమాండ్, పార్లమెంట్ సమావేశాల షెడ్యూల్‌ను ముందుకు జరపాలని సూచన



**న్యూఢిల్లీ :** ఢిల్లీ పేలుడుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పహల్గామ్ దాడి తర్వాత భవిష్యత్తులో జరిగే ఉగ్రవాద దాడి ఏదైనా 'యుద్ధ చర్య'గా పరిగణించాలని ప్రభుత్వం పేర్కొన్న 'కొత్త సాధారణ సిద్ధాంతం' చెల్లుబాటు అవుతుందా అని ప్రశ్నించింది. డిసెంబర్ 1న ప్రారంభం కానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాలను ముందే నిర్వహించాలని కూడా డిమాండ్ చేస్తూ సమావేశాల్లో ఢిల్లీ ఘటనపై చర్చ జరపవచ్చని పేర్కొంది. కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా మాట్లాడుతూ జవాబుదారీతనంగా ఉండాలని, ప్రభుత్వంలో ఎవరైనా బాధ్యత వహించాలని ఉద్ఘాటించారు. యుపిఎ హయాంలో ముంబై ఉగ్రవాద దాడి తర్వాత అప్పటి హోంమంత్రి శివరాజ్ పాటిల్ రాజీనామా చేశారని గుర్తుచేసుకున్నారు. ఢిల్లీలో దాడిన జరిగిన 48 గంటల తరువాత ఉగ్రచర్యగా కేబినెట్ ప్రకటిచడం ఆశ్చర్యమేస్తుందన్నారు. నిఘా సంస్థలు అక్కడే ఉన్నప్పటికీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ నిశితంగా గమనిస్తున్నప్పటికీ, 2,900 కిలోల పేలుడు పదార్థం ఫరీదాబాద్‌కు ఎలా చేరుకుందని ప్రశ్నించారు. ఎర్రకోట వద్ద ఓ కారులో చాలా పేలుడు పదార్థాలు ఉన్నాయని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తున్నారని, ఎవరు జవాబుదారీగా ఉంటారని నిలదీశారు. ఉగ్రవాద దాడి జరిగినప్పుడు తాము ప్రభుత్వానికి అండగా నిలబడ్డామని, భవిష్యత్తులో కూడా అలాగే చేస్తామన్నారు. అయితే దాడి ఎవరి వైఫల్యమని, దానికి ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నలు అడగడం తమ విధి అని ఆయన పేర్కొన్నారు.ప్రధానమంత్రి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తుందని ఆయన అన్నారు. ఇది తీవ్రమైన సవాల్ అని, అందదువల్ల పార్లమెంటులో చర్చించాల్సినందున సమావేశాల షెడ్యూల్‌ను ముందుకు జరపాలన్నారు. పహల్గామ్, ఆపరేషన్ సిందూర్ తర్వాత ఏదైనా ఉగ్రవాద దాడిని యుద్ధ చర్యగా పరిగణించాలనే కొత్త సాధారణ సిద్ధాంతాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని, అది నిజమవుతుందా అని నిలదీశారు. కాగా, ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడులో 13 మంది మరణించిన ఘటనను ప్రభుత్వం బుధవారం 'ఉగ్రవాద సంఘటన'గా పేర్కొంది. భూటాన్ నుండి తిరిగి వచ్చిన తర్వాత మోదీ అధ్యక్షత వహించిన కేంద్ర మంత్రివర్గ సమావేశం, దర్యాప్తు సంస్థలు ఈ కేసును 'అత్యంత అత్యవసరంగా, వృత్తి నైపుణ్యంతో' పరిష్కరించాలని, నేరస్థులను, వారి స్పాన్సర్లను ఆలస్యం చేయకుండా న్యాయం ముందు నిలబెట్టాలని ఆదేశించింది.

## ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించిన పోలీసులు
### పరారీలో ఉన్న ముజాఫర్‌పై రెడ్ కార్నార్ నోటీసు జారీ

**శ్రీనగర్ :** ఢిల్లీ పేలుడు ఘటనతో సంబంధమున్న ఫరిదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కేసులో నిందితుడిగా వెలుగులోకి వచ్చిన ఖజిగుండ్‌కు చెందిన డాక్టర్ ముజాఫర్‌పై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించాలని ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించారు. అధికారుల సమాచారం ప్రకారం, ముజాఫర్ పేరు ఎర్రకోట వద్ద పేలుడు కేసుతో సంబంధమున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ దర్యాప్తులో బయటపడింది. ఆ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారిలో ముగ్గురు వైద్యులు ఉండగా, ఏడుగురు కశ్మీర్‌కు చెందినవారు. వీరిలో ఒకరు డాక్టర్ అదీల్. అతడు ముజాఫర్ సోదరుడు. విచారణ సమయంలో అరెస్టయిన నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా డాక్టర్ ముజాఫర్ కూడా ఉగ్ర నెట్‌వర్క్‌లో కీలక పాత్ర పోషించాడని పోలీసులు నిర్ధరించారు. వారి వాంగ్మూలం ప్రకారం, ముజాఫర్ మరో ఇద్దరు వైద్యులు ముజమ్మిల్ గనై, ఉమర్ నబీతో కలిసి 2021లో తుర్కియే వెళ్లాడు. అక్కడ 21 రోజుల పాటు ఉన్నారని తెలుస్తోంది. ఆ ముగ్గురిలో ఉమర్ నబీనే గత సోమవారం ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో పేలిన కారు నడిపిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.ఆ వివరాలు బయటకు వచ్చిన వెంటనే జమ్ము కశ్మీర్ పోలీసులు డాక్టర్ ముజాఫర్‌ను వెతకడం ప్రారంభించారు. అయితే, అతడు ఇప్పటికే ఆగస్టులో భారత్ విడిచి దుబాయ్‌కు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అఫ్గానిస్థాన్‌లో ఉన్నాడని అధికారులు అనుమానిస్తున్నారు. అందుకే అంతర్జాతీయ స్థాయిలో న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించారు.

## అల్ ఫలాహ వర్సిటీకి షోకాజ్ నోటీసు



**న్యూఢిల్లీ :** ఢిల్లీ పేలుడు ఘటనపై విచారణ జరుపుతున్న దర్యాప్తు సంస్థల దృష్టి ప్రస్తుతం హర్యానాలోని అల్ ఫలాహ యూనివర్సిటీపై పడింది. దర్యాప్తు సంస్థలు ఇప్పటికే తనిఖీలు నిర్వహించాయి. ఈ క్రమంలోనే నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఆ విద్యాసంస్థ వెబ్‌సైట్‌లో గుర్తింపు గురించి తప్పుడు సమాచారం ప్రచురించినందుకు గానూ ఈ నోటీసులు ఇచ్చినట్లు తెలిపింది. 'అల్‌ఫలాహ వైద్య కళాశాల న్యాక్ గుర్తింపు పొందకుండానే వెబ్‌సైట్ కళాశాలలో గుర్తింపు ఉందని బహిరంగా ప్రదర్శించింది. కనీసం అక్రిడేషన్ కోసం దరఖాస్తు కూడా చేసుకోలేదు. ఇది పూర్తిగా తప్పు. ప్రజలను, ముఖ్యంగా తల్లిదండ్రులు, విద్యార్థులను తప్పుదారి పట్టించడమే అవుతుంది' అని నోటీసుల్లో పేర్కొంది. ఈ యూనివర్సిటీకి 2013లో న్యాక్ 'ఎ' గ్రేడ్ అందుకుందని జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. 2014లో రాష్ట్ర ప్రభుత్వం దీనికి యూనివర్సిటీ హోదా కల్పించింది. ఇదే యూనివర్సిటీకి అనుబంధంగా 2019లో అల్‌ఫలాహ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు.

**రూం నంబర్ 13లో ప్లానింగ్**

ఈ కేసులో భాగంగా అల్ ఫలాహ యూనివర్సిటీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. అక్కడి మెడికల్ కాలేజీలోని బాయ్స్ హాస్టల్ ఉండే 17వ నంబరు భవనం ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో ఇప్పటికే అరెస్టయిన మరో డాక్టర్ ముజమ్మిల్‌కు చెందిన 13వ నంబరు గదిలోనే ఉగ్రకుట్రలకు పథక రచన చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. యూనివర్సిటీ ల్యాబ్ నుంచి కొన్ని రసాయనాలను ఉమర్, ముజమ్మిల్ సేకరించినట్లు తెలిసింది. ఈ గదిలో సోదాలు జరిపిన పోలీసులు కొన్ని కెమికల్స్, డిజిటల్ పరికరాలు, పెన్‌డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. అటు ముజమ్మిల్‌తో పాటు ఉమర్‌కు చెందిన 4వ నంబరు గదిలో సోదాలు చేసిన అధికారులు మూడు డైరీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ డైరీలను పరిశీలించిన దర్యాప్తు అధికారులు దేశంలోని నాలుగు ప్రాంతాల్లో వరుస పేలుళ్లకు వీరు ప్రణాళికలు చేసినట్లు గుర్తించారు. 4 నగరాల్లో ఇద్దరు చొప్పున మొత్తం 8 మంది పేలుళ్లకు కుట్ర పన్నినట్లు తెలిపారు. ఈ ఎనిమిది మందిలో ఉమర్, ముజమ్మిల్‌తో పాటు డాక్టర్ అదిల్, డాక్టర్ షాహీన్ కూడా ఉన్నట్లు తెలిపారు. ఈ కుట్రను అమలుచేసే బాధ్యతను ప్రధానంగా ఉమర్‌కు అప్పగించినట్లు సమాచారం. ఇందుకోసం నిందితులు దాదాపు 26 లక్షల వరకు నిధులు సేకరించి ఆ మొత్తాన్ని ఉమర్‌కు ఇచ్చినట్లు దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి. ఇందులో రూ.3 లక్షల విలువైన 20 క్వింటాళ్లకు పైగా ఎన్‌పికె ఫెర్టిలైజర్‌ను గురుగ్రామ్, నూహ్ తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించాయి. ఈ పదార్థాలను వినియోగించి వారు ఐఇడి బాంబులను తయారుచేయాలని ప్లాన్ చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. అయితే, వీరి కుట్రలను పోలీసులు భగ్నం చేశారని దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి.

## ఢిల్లీలో మరోసారి పేలుడు శబ్దం..
### భయంతో వణికిపోయిన స్థానికులు..


**న్యూఢిల్లీ :** ఢిల్లీలో పేలుడు ఘటనతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటనతో ఢిల్లీ వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భారీ కుట్రకు ఉగ్రవాదులు ప్లాన్ చేశారని తేలడంతో నగరవాసులు భయంతో వణికిపోతున్నారు. ఈ క్రమంలో ఎలాంటి పేలుడు శబ్దం వినిపించినా ఉలిక్కిపడుతున్నారు. తాజాగా ఢిల్లీలో తాజాగా భారీ శబ్దం కలకలం రేపింది. గురువారం ఉదయం ఢిల్లీలోని మహిపాల్‌పూర్ ప్రాంతంలో రాడిసన్ హోటల్ సమీపంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. మరోసారి పేలుడు జరిగిందని ఆందోళన చెందారు. అయితే, అది పేలుడు కాదని అధికారులు తేల్చారు. ఆ శబ్దం బస్సు టైర్ పేలడం వల్ల వచ్చిందిగా తేల్చారు. ఢిల్లీ అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. 'మహిపాల్‌పూర్ ప్రాంతంలో రాడిసన్ హోటల్ సమీపంలో భారీ శబ్దం వచ్చిందంటూ అగ్నిమాపక శాఖకు ఉదయం 9:18 గంటలకు ఫోన్ కాల్ వచ్చింది. అప్రమత్తమైన అధికారులు, సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అయితే, ఆ శబ్దం టైరు పేలడం వల్ల వచ్చింది. పేలుడు కాదు' అని తెలిపారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## చైతన్య బఘేల్ ఆస్తులు జప్తు



**న్యూఢిల్లీ :** ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణం కేసులో ఇడి కీలక చర్యలు తీసుకుంది. మాజీ ముఖ్యమంత్రి తనయుడు భూపేష్ బఘేల్ కొడుకు చైతన్య బఘేల్‌కు చెందిన రూ.61.20 కోట్ల విలువైన ఆస్తులను ఇడి తాత్కాలికంగా జప్తు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) 2002 కింద చర్యలు తీసుకుంది. ఇడి వివరాల ప్రకారం.. స్వాధీనం చేసుకున్న ఆస్తుల్లో రూ.59.96 కోట్ల విలువైన 364 ప్లాట్లు, వ్యవసాయభూమి సహా స్థిరాస్తులు ఉన్నాయి. అలాగే, బ్యాంక్ బ్యాలెన్స్, స్థిర డిపాజిట్లతో సహా రూ.1.24కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో మద్యం కుంభకోణంపై మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఇడి తెలిపింది. రూ.2500కోట్ల విలువై మద్యం సిండికేట్‌లో చైతన్యది కీలకపాత్రని పేర్కొంది. ఈ నిధుల సేకరణ, పంపిణీకి సంబంధించిన అన్ని ప్రధాన నిర్ణయాలన్నీ ఆయన ఆదేశాల మేరకు తీసుకున్నట్లుగా ఆరోపించింది. చైతన్య బఘేల్ నేరం ద్వారా వచ్చిన ఆదాయాన్ని అందుకున్నారని ఇడి దర్యాప్తులో తేలింది. అక్రమంగా సంపాదించిన ఆదాయాన్ని తన రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా వైట్‌గా మార్చాడని పేర్కొంది. చైతన్య బఘేల్ మద్యం కుంభకోణం నుంచి పొందిన నేర ఆదాయం (పిఒసి) తన యాజమాన్య సంస్థ మెస్సర్స్ బఘేల్ డెవలపర్స్ ఆధ్వర్యంలో తన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ విఠల్ గ్రీన్‌ను అభివృద్ధి చేయడానికి ఉపయోగించారని చెప్పింది. చైతన్య బఘేల్‌ను మద్యం కుంభకోణం కేసులో ఈ ఏడాది జులై 18న అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ కేసులో అనిల్ తుతేజా (మాజీ ఐఎఎస్), అరవింద్ సింగ్, త్రిలోక్ సింగ్ ధిల్లాన్, అన్వర్ ధేబర్, అరుణ్ పాటి త్రిపాఠి (ఐటిఎస్), కవాసి లఖ్మా (మాజీ ఎక్సైజ్ మంత్రి) ఇడి అరెస్టు చేసింది. ప్రస్తుతం జప్తు చేసిన రూ.61.20కోట్లు సుమారు.. రూ,215కోట్ల స్థిరాస్తుల స్వాధీనంలో భాగమేనని ఇడి తెలిపింది. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొంది.

## మేకెదాతు నిర్మాణంపై.. పిల్ తోసిపుచ్చిన సుప్రీం
### అది కర్ణాటక ప్రభుత్వం 'అకాల ప్రాజెక్ట్' అని ఆక్షేపించిన తమిళనాడు సర్కార్




**న్యూఢిల్లీ :** కర్ణాటక ప్రభుత్వం కావేరి నదిపై చేపట్టిన మేకెదాతు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అకాల సమయం ప్రాజెక్ట్‌గా ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలను నిపుణుల సంస్థలు, కావేరీ జల నియంత్రణ కమిటీ (సిడబ్ల్యుఆర్‌సి), కావేరీ జల ప్రాధికార సంస్థ (సిడబ్ల్యుఎంఎ) అభిప్రాయాన్ని పరిగణనలోనికి తీసుకున్న తర్వాతే ప్రణాళికను ఆమోదిస్తామని స్పష్టం చేసింది. 'ఈ దశలో సిడబ్ల్యుసి జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పనులు జరుగుతున్నాయని, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలను సిడబ్ల్యుఎంఎ, సిడబ్ల్యుఆర్‌సి నిపుణుల అభ్యంతరాలను పరిగణనలోనికి తీసుకున్న తర్వాతే డిపిఆర్ తయారీకి అనుమతి ఇస్తున్నారని, డిపిఆర్ పరిశీలనకు సిడబ్ల్యుఎంఎ , సిడబ్ల్యుఆర్‌సి ముందస్తు ఆమోదం తప్పనిసరి అని సిడబ్ల్యుసి ఆమోదించిందని గుర్తుంచుకోవాలి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు దరఖాస్తు అకాలదశలో ఉందని గమనించాలని మేం భావిస్తున్నాం' అని అత్యున్నత న్యాయస్థానం నొక్కి చెప్పింది. 2023 ఆగష్టు ప్రారంభంలో 2023 రుతుపవనాలకు సంబంధించిన అంశంపై తలెత్తిన అంశంపై జోక్యం చేసుకోవడానికి ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం నిరాకరించిందని, కోర్టుకు ఆ నైపుణ్యం లేదంటూ పరిస్థితిని అంచనా వేయమని సిడబ్ల్యుఎంఎను కోరిందని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఆగష్టు 2023 నాటి మా ఉత్తర్వులో గమనించిన దానిని మేం పునరుద్ఘాటిస్తున్నాం. మాకు నైపుణ్యం లేదు. నిపుణులకు ఉత్తమంగా కేటాయించబడిన ప్రాంతాల నుండి ఈ అత్యున్నత న్యాయస్థానం దూరంగా ఉండాలని ఈ కోర్టు పదే పదే పునరుద్ఘాటిస్తున్నది' అని ధర్మాసనం పేర్కొంది. 'కోర్టు ఆదేశాలకు అనుగుణంగా కర్ణాటక రాష్ట్రం నీటిని విడుదల చేయడానికి కట్టుబడి ఉంది. కర్ణాటక ఈ కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో వైఫల్యం చెందితే కోర్టు ధిక్కారంగా పరిగణించబడుతుంది' అని సుప్రీంకోర్టు చెప్పింది. కర్ణాటకతమిళనాడు సరిహద్దులో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను కర్ణాటక ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ స్వస్థలమైన బెంగళూరు సౌత్ జిల్లాలోని (గతంలో రామనగర జిల్లా) కనకపురాలో ప్రతిపాదించారు. ఈప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.9,000 కోట్ల నుండి రూ.14,000 కోట్ల మధ్య ఉంటుందని అధికారవర్గాలు వెల్లడించాయి.

**'సుప్రీం' తీర్పు 'బెంగళూరువాసుల విజయం : ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్**

కావేరి నదిపై కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న మేకెదాటు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు తోసిపుచ్చడాన్ని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ స్వాగతించారు. అధికార ప్రభుత్వంలో డి,కె.శివకుమార్ నీటి వనరుల శాఖను కూడా నిర్వహిస్తున్నారు. ఆయన ఈ తీర్పుపై స్పందిస్తూ 'న్యాయం న్యాయ పీఠం నుండి తప్పుకుంది' అని వ్యాఖ్యానించారు. కర్ణాటక కేవలం కావేరి నీటిలో న్యాయమైన వాటాను కోరుకుందని ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ నొక్కిచెప్పారు. శివకుమార్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'మా హక్కును, మా నీటిని మేం అభ్యర్థిస్తున్నాం. మేం ఎవరికీ ఇబ్బంది కలిగించడం లేదు. తమిళనాడు కూడా తగినంత నీటిని పొందడం ద్వారా లబ్ధి పొందుతుంది' అని పేర్కొన్నారు. కర్ణాటకలో ప్రభుత్వం సొంత ఖర్చుతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టిందని ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ చెప్పారు. 'మేం మా ఏరియాలో మా నిధులతో నిర్మించుకుంటున్నాం. తమిళనాడుకు కూడదా మేం వర్షపాతంలోటు సమయంలో సహాయం కూడా చేస్తాం. మేం చేపడుతున్నది బ్యాలెన్సింగ్ రిజర్వాయర్' అని ఆయన స్పష్టంచేశారు. కర్ణాటకకు అనుకూలంగా వచ్చిన తీర్పు 'బెంగళూరువాసుల విజయం' అని డి.కె.శివకుమార్ వ్యాఖ్యానించారు.

## ఎమ్మెల్యేపై అనర్హత వేటు
### పదవి నుంచి సస్పెండ్ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు

**కోల్‌కత్తా :** పార్టీ ఫిరాయింపుల విషయంలో కలకత్తా హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచిన ముకుల్ రాయ్.. ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ముకుల్ రాయ్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని బిజెపి నేతలు కలకత్తా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై కోర్టు విచారణ జరిపింది. ముకుల్ రాయ్‌ను ఎమ్మెల్యే పదవి నుంచి సస్పెండ్ చేస్తూ కలకత్తా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2021లో బిజెపి టికెట్‌పై గెలిచిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్‌లో చేరడం ద్వారా రాయ్ తన సభ్యత్వాన్ని కోల్పోయారని జస్టిస్ దేబాంగ్సు బసక్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ గురువారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రాయ్‌ను అనర్హులుగా ప్రకటించడానికి లేదా పబ్లిక్ అకౌంట్స్ కమిటీ నుండి తొలగించడానికి నిరాకరించిన స్పీకర్ బిమన్ బెనర్జీ నిర్ణయాన్ని కూడా ధర్మాసనం రద్దు చేసింది. పిఎసి చైర్మన్‌గా రాయ్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ బిజెపి ఎమ్మెల్యే అంబికా రాయ్ 2021లో పిటిషన్ దాఖలు చేయడంతో వివాదం ప్రారంభమైంది. ఈ పదవి సాంప్రదాయకంగా ప్రతిపక్షానికి వెళుతుందని, తృణమూల్‌కు మారిన తర్వాత రాయ్‌ను బిజెపి ప్రతినిధిగా పరిగణించలేమని ఆయన వాదించారు. సాంకేతికంగా బిజెపి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ముకుల్ రాయ్ బహిరంగంగా తృణమూల్‌లో చేరారని ఆరోపిస్తూ ప్రతిపక్ష నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. 2023లో సువేందు అధికారి మరొక పిటిషన్ దాఖలు చేస్తూ, ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ముకుల్ రాయ్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. అన్ని వైపులా విన్న తర్వాత ఈ విషయాన్ని పునఃపరిశీలించాలని హైకోర్టు స్పీకర్‌ను ఆదేశించింది. ఆ తర్వాత కూడా ముకుల్ రాయ్‌ను అనర్హులుగా ప్రకటించడానికి ఎటువంటి ఆధారం లేదని స్పీకర్ వాదించారు. మొత్తానికి ముకుల్ రాయ్ సభ్యత్వాన్ని గురువారం కలకత్తా హైకోర్టు రద్దు చేసింది.

## గృహ కొనుగోలుదారులను మోసంచేసిన జెపి ఇన్‌ఫ్రాటెక్ మాజీ ఎండి అరెస్టు



**న్యూఢిల్లీ:** నివాసిత భవనాలు నిర్మిస్తామని వేలకోట్లు దండుకుని కొనుగోలుదారులను మోసం చేసిన జేపీ ఇన్‌ఫ్రాటెక్ మాజీ ఎండి, వ్యాపారవేత్త మనోజ్ గౌర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు అరెస్టు చేశారు. హోం బయ్యర్స్‌ను మోసం చేశారన్న అభియోగాలపై ఈ అరెస్టు చేశారు. రూ.14,599 కోట్ల మేరకు నగదును గృహనిర్మాణ ప్రాజెక్టులకు ఖర్చుపెట్టకుండా, ఆ సొమ్మును లెక్కల్లో చూపించకుండా అక్రమంగా ఇతర మార్గాలకు మళ్ళించారన్న కేసులను ఇడి అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పిఎంఎల్ఎ చట్టం కింద మనోజ్ గౌర్‌ను అరెస్టు చేసినట్లు ఇడి అధికారులు చెప్పారు. హోం బయ్యర్ల నుండి నిధులు వసూలు చేసి వాటిని లక్ష్యిత ప్రాజెక్టులలో కాకుండా ఇతరత్రా అనేక ట్రస్టులకు మళ్ళించారన్నది ఆయనపై ప్రధాన అభియోగం.దీనివల్లప్రాజెక్టులు పూర్తికాకుండా పెండింగ్‌లో పడిపోయాయి. ఇన్వెస్టర్లు మోసపోయారు.

ఈ ఏడాది మే నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జేపీ గ్రూపు సంస్థలలో 15 చోట్ల సోదాలు జరిపి రూ.1.70 కోట్ల నగదు, వారి కుటుంబ సభ్యుల పేర్లతో నమోదైన ఆస్తి, సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. జేపీ సేవా సంస్థాన్‌కు గౌర్ మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తున్నట్లు ఇడి అధికారులు కనుగొన్నారు. ''జేపీ గ్రూప్‌పై ఇ డి దర్యాప్తు ప్రారంభించింది, ఆర్థికనేరాల కింద అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి, ఢిల్లీ ఆర్థిక నేరాల విభాగం, ఉత్తర ప్రదేశ్ పోలీసులు ఈ ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. హోం బయ్యర్లు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు జేపీ విస్టాన్, జేపీ గ్రీన్స్ ప్రాజెక్టులు నేరపూరితమైన కుట్రకు పాల్పడ్డాయి, మోసానికి పాల్పడ్డాయి, విశ్వాసాన్ని కోల్పోయి ప్రమోటర్లకు, కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా నేరాలకు పాల్పడ్డాయి అని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. వేలాదిమంది హోం బయ్యర్ల నుండి వారు నిధులను వసూలు చేశారు. నివాసిత ప్రాంతాల నిర్మాణం పేరుతో ఈ నిధులు వసూలు చేశారు. కానీ ఇతరత్రా వాటిని దారిమళ్ళించారు. ఈ మోసం వల్ల ప్రాజెక్టులు పూర్తికాలేదని అధికారులు చెప్పారు.

## ఎన్‌కౌంటర్ మృతుల గుర్తింపు



**ఖమ్మం :** ఈనెల 11న ఛత్తీస్‌గఢ్‌లోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మృతిచెందిన విషయం విధితమే. మృతదేహాలను గుర్తించి వారి వివరాలను గురువారం బస్తార్ రేంజ్ ఐజిపి సుందర్‌రాజ్ తెలియ జేశారు. డివిజనల్ కమిటీ మెంబర్ కన్న అలియాస్ బుచ్చయ్య (35) ఇతను గడ్డిపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెదక్‌పాల్ ఏరియాకు చెందినవాడు. ఇతనిపై ఎనిమిది లక్షల రూపాయల రివార్డు ఉంది. మరో మృతుడు ఊర్మిళ పాపారావు(40)గా గుర్తించారు. ఇతను పామెడు పరిధిలోని చింతల్ నార్ ప్రాంతానికి చెందిన వాడు. ఇతనిపై ఎనిమిది లక్షల రూపాయల రివార్డు ఉంది. పార్టీ సభ్యుడు జగత్ తమో అలియాస్ మోటు (25) కూడా నేషనల్ పార్కులో ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. ఇతను జంగ్లా పిఎస్ పరిధికి చెందినవాడు. ఇతనిపై ఐదు లక్షల రివార్డు ఉంది. పార్టీ సభ్యులు దేవే (25), భగత్ (30), మంగ్లీ ఓఎం (25) మృతిచెందిన వారిలో ఉన్నారు. దేవే మీనగట్ట ప్రాంతానికి చెందిన వాడు కాగా భగత్, మంగ్లీ ఓఎం గంగులూరు ప్రాంతానికి చెందిన వారు. వీరి ఒక్కొక్కరిపై రెండు లక్షల రూపాయల చొప్పున రివార్డు ఉంది. ఎన్‌కౌంటర్ తర్వాత వారి వద్ద నుంచి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు సుందర్‌రాజ్ తెలిపారు.



ప్రజాపక్షం
శుక్రవారం, 14 నవంబరు

# అర్థరహితమైన జెపిసి

తీవ్రమైన క్రిమినల్ ఆరోపణల కింద అరెస్టు చేయబడి వరుసగా 30 రోజులు జైల్లో ఉన్న పక్షంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర–రాష్ట్ర మంత్రులను పదవులనుంచి తొలగించేందుకు ఉద్దేశించిన బిల్లు కూలంకష పరిశీలన నిమిత్తం 31 మంది సభ్యులతో పార్లమెంటరీ జాయింట్ కమిటీ బుధవారం ఏర్పాటైంది. ప్రభుత్వపక్షం నుంచి ఇది ఒకింత ఆశ్చర్యం గొలిపే నిర్ణయం. హోంమంత్రి అమిత్ షా పార్లమెంటు వర్షాకాల సమావేశంలో ఆగస్టు 20న 130వ రాజ్యాంగ సవరణ బిల్లు పేరుతో మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రతిపక్షాలు అప్పుడే నిరసన తెలియజేశాయి. ఏదైనా వివాదాస్పద బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నివేదించాలని ప్రతిపక్షాలు స్పీకర్‌ను కోరటం సహజం. ఈ బిల్లు విషయంలో హోంమంత్రి తనంతటతానే దాన్ని జెపిసికి పంపాలని తీర్మానం ప్రవేశపెట్టగా లోక్‌సభ ఆమోదించింది. హోంమంత్రి ప్రవేశపెట్టిన మూడు బిల్లులు – రాజ్యాంగం(130 వ సవరణ) బిల్లు; జమ్మూ–కశ్మీర్ రీ ఆర్గనైజేషన్ (సవరణ) బిల్లు, 2025; ది గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ (సవరణ) బిల్లు, 2025.

బిజెపి సభ్యుడు అపరాజిత సారంగి చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీని బహిష్కరించాలని ఇండియా బ్లాక్ నిర్ణయించింది. 21మంది లోక్‌సభ సభ్యులు, 10మంది రాజ్యసభ సభ్యులతో కూడిన ఈ కమిటీ డిసెంబర్ 1 నుండి 19వరకు జరిగే పార్లమెంటు శీతాకాల సమావేశంలో తన నివేదిక సమర్పించాలన్నది ఆదేశం. తీవ్ర పర్యవసానాలతో కూడిన ఈ రాజ్యాంగ సవరణ బిల్లుపై 15–20 రోజుల్లో నివేదిక సమర్పించాలన్నమాట. ఎందుకీ తొందర? ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు చెందిన 340మంది పార్లమెంటు సభ్యులు బహిష్కరిస్తుండగా – బిజెపి, దాని మిత్రులతో కూడిన కమిటీ ఇచ్చే నివేదికకు ఏమైనా విలువ ఉంటుందా? బోఫోర్స్ శతఘ్నుల కుంభకోణంపై 1987లో జెపిసిని ప్రతిపక్షాలు బహిష్కరించాయి. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక విశ్వసనీయత పొందిందా? ఈ అనుభవం కళ్లముందు ఉండి కూడా నాడు ప్రతిపక్షంలో ఉన్న నేటి పాలక బిజెపి ఎందుకీ ఏకపక్ష పోకడ పోతోంది? ఈ బిల్లు పైకి ఎంతో స్వచ్ఛమైనదిగా కనిపించినా దాని వెనుక దురుద్దేశాలు దాగి ఉన్నాయని, వాటిని నెరవేర్చుకునేందుకు బిజెపి తొందర పడుతోందని అనుమానించటానికి ఆస్కారం ఏర్పడుతున్నది.

మన న్యాయశాస్త్రం ప్రకారం, అవినీతి నేరారోపణకు గురికాగానే ఆ వ్యక్తి దోషి కాబోడు. ఒకవేళ ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయని ప్రభుత్వం 'పంజరంలో చిలుక'గా పనిచేసే దర్యాప్తు సంస్థలు నిర్ధారించి ఆ ప్రజాప్రతినిధిని అరెస్టు చేయవచ్చు. మన న్యాయవ్యవస్థ ఏదొక కారణంతో బెయిలు మంజూరును వాయిదా వేయవచ్చు. 30రోజుల్లోపల బెయిలు దొరక్కపోతే (ప్రభుత్వజోక్యం కూడా నిరాకరించలేనిది.) అట్టి వ్యక్తి తన పదవి కోల్పోతాడు. ప్రతిపక్షపాలిత రాష్ట్రాలపైకి సిబిఐ, ఇడిలను ప్రయోగించి మంత్రులను అవినీతి ముద్రతో వేధిస్తున్న పాలక పార్టీ, రేపు ఈ బిల్లు చట్టమైనాక మరెంత విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందోనన్న భయాందోళన ప్రతిపక్షపార్టీల్లో కలగటం సహజం. ప్రస్తుత చట్టాల ప్రకారం, అధికారంలో ఉన్న ఏ ప్రజాప్రతినిధికైనా ఏదైనా అవినీతి కేసులో న్యాయస్థానం 2 సంవత్సరాలు, అంతకుపైన జైలు శిక్ష విధిస్తే తప్ప అతడు లేక ఆమె పదవి కోల్పోరు. కోర్టు శిక్ష విధించినందున పదవులు కోల్పోయిన ప్రముఖుల జాబితాలో లాలుప్రసాద్ యాదవ్, జయలలిత, అరెస్టు అయినా బెయిలు దొరకనందున జైల్లోనుంచి పరిపాలన సాగించిన వ్యక్తిగా అరవింద్ కేజ్రీవాల్ ఉదాహరణలు. ఇడి కేసుల్లో పదవులకు రాజీనామా చేసినవారు, బెయిలు దొరికాక తిరిగి పదవుల్లోకి వచ్చినవారున్నారు. జైల్లో ఉండి పరిపాలన చేయటం అసహ్యంగా కనిపించవచ్చు. నేరనిరూపణ కానప్పుడు అనుమానంతో ఎలా శిక్షిస్తారు? ఇటువంటి నైతికాంశాలు, ధర్మసూక్ష్మాలున్నందున, రాజకీయ–పరిపాలనా వ్యవస్థలను క్షాళన చేయటానికి రాజకీయ ఏకాభిప్రాయ సాధన అవసరం.

అమిత్‌షా బిల్లులో ప్రధానమంత్రిని చేర్చినా, ఆ వ్యక్తిపై అవినీతి ఆరోపణలు చేసే ప్రత్యర్థులు ఉండవచ్చుగాని, వాటిని దర్యాప్తు చేసే, అవసరమైతే అరెస్టు చేసే వ్యవస్థ ఉందా? ప్రధానిపై ఆరోపణల విచారణకు లోకాయుక్త ఉంది. ప్రధానమంత్రిని లోకాయుక్త పరిధిలోకి తెచ్చే విషయంలో భిన్నాభిప్రాయాలతో దాదాపు పాతికేళ్లు గడిపిన రాజకీయ వ్యవస్థ మనది. కాంగ్రెస్ అన్నట్లు "ఈ జెపిసి జిజెపి, దాని బి టీమ్‌ది" తప్ప పార్లమెంటరీ ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించదు. ఆ బిల్లును ఉపసంహరించుకుని కార్యనిర్వాహకవర్గంలో అవినీతిని అంతంచేసి నిజాయితీకి పెద్దపీటవేసే వ్యవస్థ ఏర్పాటుపై దేశంలో చర్చ పెట్టాలి, ప్రజలను చైతన్యపరచాలి, రాజకీయ ఏకాభిప్రాయం సాధించాలి.


# పత్తి రైతుల మెడకు సిసిఐ కొత్త ఉరి(రూ)లు


దిలీప్.వి
8464030808

దేశంలో ప్రభుత్వాలు రైతులను రాజులను చేస్తామని, రైతులవల్లనే దేశం సుభిక్షంగా ఉందని ఊక దంపుడు ఉపన్యాసాలు ఇస్తారు కానీ వాస్తవికంగా వారి సంక్షేమం కోసం ఆలోచించాలని అనుకున్నపుడు మాత్రం మీనమేషాలు లెక్కపెడుతవి. రైతులకి మేలు కలిగించే ఆలోచనలు అమలు చేయడానికి ఏళ్లకేళ్ళు గడిపే ప్రభుత్వాలు వారికి ఆంక్షల కొర్రీలు పెట్టడానికి మాత్రం వారికేమన్న ఇబ్బంది కలుగుతుందా అని క్షణకాలంపాటు కూడా ఆలోచించకుండా వారి విధానాలను అమలు చేస్తారు. దానికి అతిపెద్ద ఉదాహరణనే ఇటీవల కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (CCI)తీసుకువచ్చిన పత్తి కొనుగోళ్లలో నూతన నిబంధనలు. ఆ నిబంధనలు ఏంటి? వాటి వివరాలు వాటివల్ల కలిగే కష్టాలు చెప్పుకునే ముందు ఈ నూతన నిబంధనలు తీసుకురావడానికి CCI చెప్పిన కారణమే అత్యంత హాస్యాస్పదంగాను, అసహ్యంగానూ తోస్తుంది. అదేమంటే పత్తి కొనుగోళ్లలో జిన్నింగ్ మిల్లులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాయట వాటి నివారణకోసమే ఈ నూతన నియమాలు, నిబంధనలు అట. ఇది ఎట్లా ఉందంటే వాడెవడో కొట్టడం వల్ల కాలికి గాయమైతే ఆ కొట్టిన వాడిని కట్టడి చేయడం మాని గాయమైన వారి కాలిని తొలగించమని చెప్పినట్టుగా ఉన్నది. తప్పొకడు చేస్తే శిక్షొకడికి వేసినట్టుగా ఉన్నది. పైకెళ్ళి వాడు తప్పు చేయడానికి కారణం నీవే అయితున్నావ్ కాబట్టి నీవే అనుభవించాలని బుకాయిస్తారేమో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ )వారు.

వివరాల్లోకి వెళితే దేశంలో పత్తి కొనుగోళ్లు, పత్తికి మద్దతు ధర కల్పించడం, ధరల స్థిరత్వం పత్తి పరిశ్రమను బలోపేతం చేయడం కోసమని భారత ప్రభుత్వం 1970లలో ఈ సిసిఐ ను ఏర్పాటు చేసింది. అది ఏర్పాటు చేసిన ఉద్దేశం అవన్నీ చూస్తే చాలా మేలు చేయడానికి రైతులకు లాభం చేకూర్చడానికే ఈ సంస్థ ఏర్పాటు చేశారని భావించి సంతోషపడుతాం కానీ వాస్తవంగా అదెప్పుడు రైతులకు లాభాలు చేసే పనికి నిజాయితీగా పూనుకోలేదు. తద్విరుద్ధంగా రైతులకు నష్టాలు చేసే ప్రతిపాదనలనే ఎక్కువసార్లు ప్రవేశపెట్టి పరోక్షంగా రైతుల నడ్డి విరగ్గొట్టుతుంది. ప్రభుత్వాలు తప్పించుకోవడానికి తమపైన నిందరాకుండా చూసుకోవడానికి ఏర్పాటుచేసుకున్న ఓ అధికార దళారి వ్యవస్థనే ఈ సంస్థ. ఈ సంస్థ ఇటీవల జూలైలో 2025–26 (అక్టోబర్, సెప్టెంబర్) సీజన్ కోసం పత్తికి కనీస మద్దతు ధర (MSP) ను ప్రకటించింది. అది వివిధ రకాలుగా పత్తి నాణ్యతను వర్గీకరణ చేసి ఆ మద్దతు ధరను నిర్ణయించింది. దీంట్లో ప్రధానంగా మీడియం స్టాపల్ కాటన్ కు క్వింటాలుకు రూ.7710గా, లాంగ్ స్టాపల్ కాటన్ కు రూ.8110గా మద్దతు ధరను ప్రకటించింది. మీడియం స్టాపల్ అంటే పొడవు 24.5మీ.మీ నుండి 25.5మీ.మీ ఉండి, మైక్రోనైర్ వాల్యూ(పత్తి నాణ్యతను సూచించే విలువ)4.3 నుండి 5.1వరకు ఉండాలి. అదే లాంగ్ స్టాపల్ పొడవు29.5మీ.మీ నుండి 30.5మీ.మీ మైక్రోనైర్ వాల్యూ 3.5 నుండి 4.3గా ఉండాలి. గతంలో ఒక ఎకరాకు 12క్వింటాలు పత్తికంటే ఎక్కువగా కొనుగోలు చేయలేమని చెప్పిన CCI తీరా పత్తి మార్కెట్లకు చేరుకుంటున్న సమయంలో ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తికి మించి కొనుగోలు చేయమని కొత్త రూలును ఒకదానిని తీసుకువచ్చింది. ఇదేమిటంటే పైన చెప్పిన జిన్నింగ్ మిల్లుల అవినీతి కథను ముందుకు తీసుకువచ్చి రైతుల మెడకు ఉరి తాళ్ళు పేనుతుంది. దానితో పాటు పత్తిలో తేమ 08శాతం లేదా అంతకంటే తక్కువ ఉంటేనే మద్దతు ధర లభిస్తుంది అని చెప్పింది. లేదంటే 08 శాతం కంటే ఎక్కువ కానీ 12శాతం తేమ ఉన్న పత్తిని అమ్మే రైతులకు తక్కువ ధర వస్తుందని, పత్తికొనుగోలు చేయడానికి నియామకం చేసిన ఏజెన్సీలు 12శాతం కంటే ఎక్కువ తేమ శాతం ఉన్నపత్తిని అనుమతించబడమని మరియు మద్దతు ధర నిరాకరించబడవచ్చు అని అందులో పేర్కొన్నది. ఇప్పుడు సిసిఐ తమ నూతన నిబంధనల్ని సమర్థించుకోడానికి తమ ఇంటెలిజెన్స్ వర్గాల నివేదిక ప్రకారం పత్తి మిల్లులు రైతుల దగ్గర తక్కువకు కొని ఎక్కువ పత్తిని సిసిఐ కి అమ్మి లాభాలు గడిస్తున్నాయని అన్నది. అంతేకాక సగటున ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వస్తున్నదని రిపోర్ట్ ఉన్నది. అందుకే ఆ పరిమితి పెట్టాం అని చెబుతుంది. నిజానికి సగటున ఒక ఎకరాకు 08 నుండి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. కరువు ప్రభావిత ప్రాంతం లేదా అధిక వరద ప్రభావిత ప్రాంతాలలో మాత్రమే 06 నుండి 08 క్వింటాలు సగటు పత్తి పండుతుందనేది రైతులు, విషయనిపుణులు చెబుతున్న మాట. నిజానికి సిసిఐ చెప్పిందే నిజం అనుకుంటే నిన్నమొన్నటి వరకు ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు మాత్రమే కొనుగోలు చేస్తామని ఎట్లా చెప్పింది. ఇది జిన్నింగ్ మిల్లులను కట్టడి చేయడం కంటే కూడా రైతులను ముంచడంగానే చూడాల్సి వస్తుంది.

నిజానికైతే ఆ జిన్నింగ్ మిల్లుల వద్ద అవినీతి అక్రమాలు జరుగకుండా పర్యవేక్షణ చేయడం సిసిఐ కి పెద్ద కష్టమేమీ కాదు. రైతులు వారు అమ్ముకున్న ప్రతిచోటా న్యాయమైన మద్దతు ధరను పొందే విధంగా ప్రభుత్వం తలుచుకుంటే అటువంటి వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చు. నేరుగా జిన్నింగ్ మిల్లులు, దళారుల వల్ల అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని అనుకుంటే ప్రభుత్వం అవి నేరుగా కొనకుండా అడ్డుకోవచ్చు. గ్రామాలలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను(ఐకెపి)ఏర్పాటు చేసినట్టు పత్తి కొనుగోలు కూడా చేపట్టవచ్చు. ప్రతిగ్రామంలో అటువంటి కేంద్రం ఏర్పాటు చేసే వీలు లేకుంటే కొన్ని గ్రామాలను కలిపి ఒక క్లస్టర్ గా చేసి కూడా పత్తి కొను



గోలు చేయవచ్చు. దానిద్వారా రైతులకు లాభం జరుగుతుంది. వ్యయప్రయాసలు తగ్గుతవి. సిసిఐ కట్టడి చేద్దాం అనుకున్న అవినీతి కూడా ఆగిపోతుంది. కానీ అవి చేయడం చేతకాక, ఇష్టం లేక ఇగో ఇటువంటి చర్యలకు పాల్పడి రైతుల నడ్డి విరుస్తుంది.

ఇంకొక కొత్త సమస్యను రైతుల మెడకు కట్టింది సిసిఐ. అది 'కపాస్ కిసాన్' ఆప్.ఈ ఆప్ లో రైతుల వివరాలు నమోదు చేసుకున్న వారే పత్తి అమ్ముకోగలరు. అది కూడా రైతులు ఏ రోజు అమ్ముకోవాలని ముందుగా చెప్పితే ఆ రోజు మాత్రమే పత్తిని కొంటారు కానీ రైతులు తమ వీలు వెంబడి తీసుకుపోతే కొనరు అనే కొర్రీ రైతులకు ఏవిధంగా లాభదాయకమో సిసిఐ చెప్పాలి. అకాల వర్షాలతో నిండా రైతులను ముంచే వాతావరణం కలిగిన ఈ దేశంలో చిన్న సన్నకారు రైతులు వ్యవసాయం చేయడం అంటే సాహసం మాత్రమే కాదు వారి ప్రాణాలను పణంగా పెట్టడమే. అటువంటిది రైతులు వారు అనుకున్న రోజు పత్తిని అమ్ముకుందాం అనుకుని స్లాట్ బుక్ చేసుకుని ఉంటే హఠాత్తుగా వర్షాలు పడితే ఉన్నఫలంగా ఎవరికో ఒకరికి దళారి చెప్పిన రేటుకి మాత్రమే అమ్ముకోగలరు కానీ సిసిఐ మాత్రం రైతు కపాస్ ఆప్ లో స్లాట్ బుక్ చేసుకున్న రోజు మాత్రమే కొంటుంది కానీ రైతుల కష్టాలను, ప్రకృతి విపత్తులను చూసి చచ్చిన కొనదు. ఈ ఆప్ ను వినియోగించాలి అంటే కచ్చితంగా స్మార్టఫోన్ ఉండాల్సిందే. నూటికి 90శాతం నిరక్షరాస్యులైన రైతులు ఈ ఆప్ ను వినియోగించి మాత్రమే అమ్మాలి అంటే అది ఎట్లా సాధ్యమవుతుంది? నిజానికి ఆ మిగిలిన పది శాతం అవగాహన ఉన్న రైతులకు కూడా పనిగట్టుకుని ఆ యాప్ వినియోగాన్ని గురించి శిక్షణ ఇచ్చింది నామమాత్రమే.

ఈ మొత్తం ప్రక్రియలో అత్యంత అన్యాయానికి గురయ్యేది కౌలు రైతులు. భూమిపై వాస్తవంగా వ్యవసాయం చేసే రైతులు నూటికి 50 శాతంమంది కౌలు రైతులే. అటువంటపుడు ఈ కౌలు రైతులను గుర్తించే ప్రత్యేక చర్యలు ప్రభుత్వాలేవి తీసుకోనపుడు ఈ కౌలు రైతులు వారి పంటలను ఎట్లా అమ్ముకోగలరు. మళ్ళీ భూ యజమాని దయా దాక్షిణ్యాలపై ఆధారపడే అతను పత్తిని అమ్ముకోగలడు తప్పించి న్యాయమైన మద్దతు ధరను అతను ఏ రకంగానూ పొందలే డు.

నిత్యం దేశమంతా నకిలీ విత్తనాలతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే పట్టించుకున్న పాపానపోదు. కల్తీ పురుగుమందులు విక్రయించి దిగుబడి రాక అప్పుల్లో కూరుకుపోతుంటే ఆ కల్తీ పురుగు మందులు కంపెనీలను కట్టడిచేసే చర్యలు తీసుకోదు. మేలైన పత్తి విత్తనం ఏది, దేన్నీ మీడియం స్టాపల్ కాపాస్ అంటారు, దేన్నీ లాంగ్ స్టాపల్ కాపాస్ అంటారు అని రైతులను అవగాహన చేసిన దాఖలాలు ఉండవు. ఎటువంటి విధానాలు అవలంబిస్తే అధిక దిగుబడి వస్తుందనే శిక్షణ రైతులకు ఇవ్వదు కానీ మేము చెప్పిన ప్రమాణాలతో లేకుంటే మాత్రం కొనుగోలు చెయ్యం, మద్దతు ధరలు ఇప్పించలేం అని వారికి తోచిన రూల్స్ వారికి తోచిన విధంగా ఇస్తారు. దేశంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు వారికి పట్టవు. ఆ వాతావరణం వల్ల దెబ్బతిన్న పంటలు, ఆ రైతుల కష్టాలు వారికి కనపడవు కానీ మెరుగైన పత్తికి మాత్రమే మద్దతు ధరను ఇప్పిస్తాం అంటే ఈ సిసిఐ ఉన్నది రైతులకోసమా లేకా దళారీల కోసమా. కార్పొరేట్ శక్తులకోసమా చెప్పాలి.

ఇటీవల తెలంగాణలో విపరీతంగా కురిసిన వర్షాలకు పత్తి అంతా నీళ్లలో మునిగి తేలితే 08శాతం తేమ ఉంటేనే పత్తిని కొనుగోలు చేస్తాం అంటే ఇప్పుడు ఆ పత్తి రైతులంతా విధిలేక అగ్గువసగ్గువకు మధ్య దళారీలకు అమ్ముకోక తప్పనిపరిస్థితి కల్పించింది ఈ సిసిఐ ఏ కదా. సిసిఐ నీ మధ్యలో పెట్టి ప్రభుత్వాలు పత్తి రైతులతో ఆడుతున్న నాటకమే ఇదంతా. ఇదంతా కూడా పెద్దపెద్ద కార్పొరేట్ కాటన్ పరిశ్రమలకు లాభాలు చేకూర్చేందుకు మాత్రమే చేస్తున్న ఉపాయాలు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిజానికి పత్తి పరిశ్రమను బలోపేతం చెయ్యడానికే ఉద్దేశించబడింది ఐతే ముందుగా అది బలోపేతం చెయ్యాల్సింది పత్తి రైతులను. అందుకు వారికి నిత్యం నూతనంగా వస్తున్న మార్పులను వివరించాలి. మారుతున్న వాతావరణ మార్పులను తట్టుకునే విత్తనాలు ఏవో విరివిగా రైతులకు తెలిసేలా ప్రభుత్వంతో ప్రచారం చేయించాలి.వాతావరణ ఉపద్రవాలు సంభవించినప్పుడు తేమ తదితర విషయాలను పట్టించుకోకుండా కొనుగోళ్లు చేస్తూ నష్టం రైతుల మీద మోపకుండా ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకుని రైతుకి మద్దతు ధర స్థిరంగా కలిగేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడు మాత్రమే అది పత్తి పరిశ్రమను బలోపేతం చేసినట్టుగా భావించాల్సి ఉంటుంది కానీ లేదంటే అది పత్తి పరిశ్రమను బలోపేతం చేయడం అంటే పెద్ద పెద్ద కార్పొరేట్ పరిశ్రమలను బలోపేతం చేయటానికి ఏర్పాటు చేసిందిగానే భావించాల్సి ఉంటుంది.

ఈ మొత్తం ప్రక్రియలో అత్యంత విషాదం ఏమంటే ఇంత నష్టాన్ని గుర్చి తెల్సిన కేంద్ర ప్రభుత్వం ఏమెరుగనట్టు గమ్మునుండడం. పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలకు నష్టాలు వచ్చాయని, కట్టలేని స్థితిలో ఉన్నవని భావించి ఎంతో ఉదారంగా వేల కోట్లు రైటాఫ్ చేయగలిగిన ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్చి ఇసుమంత కూడా పట్టించుకోకపోవడమే వారి పక్షపాత బుద్ధికి నిలువుటద్దం పడుతుంది. పాలకులు పనిచేస్తున్నది ఎవరికోసమో తేటతెల్లమవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని పత్తి రైతుల మెడలపై పెట్టిన నూతన రూల్స్ కత్తిని తొలగించి వేలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఇందుకు ప్రభుత్వాలపై పత్తి రైతులు మాత్రమే కాదు సమాజం అంతా ఒత్తిడి తీసుకురావాలి. లేకుంటే ప్రభుత్వాలు, ప్రభుత్వరంగ సంస్థలు తీసుకునే విధాన నిర్ణయాలు ఇట్లా వారి అనుయాయుల లాభాలకోసం ఇష్టానుసారం వస్తూనే ఉంటాయి. సామాన్య ప్రజల నెత్తిమీద మోయలేని భారాలుగా మారుతూనే ఉంటాయి. ప్రతిఫలంగా నూటికి 90శాతం ప్రజలు వారి చర్యలకు బలవుతూనే ఉంటాం.

# బాలలను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ లోకం

బాలలు నేర్చుకోదగిన, చదువుకోదగిన, వినదగిన, రాయగలిగిన సాహిత్యాన్ని బాల సాహిత్యం అంటున్నారు.

బాల సాహిత్య బ్రహ్మగా పేరు పొందిన చింతా దీక్షితులు గారు 'శిశువు జన్మించినది మొదలు బాల్య దశ వీడే వరకు వారి మనసుకు రంజకంగా ఉండేదే బాల వాఙ్మయము' అని పేర్కొన్నారు. బాల సాహిత్యం, బాల సాహితీ, బాల వాఙ్మయం, పిల్లల సాహిత్యం, శిశు సాహిత్యం మొదలైన పదాలన్నిటిని సమానార్థకా లుగానే వాడుతున్నారు. వీటిలో బాల సాహిత్యం అనేది బహుళ ప్రచారం పొందింది.

18 సంవత్సరాల లోపు వయసుగల వారిని బాలలుగా గుర్తిస్తారు. వీరంతా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న బాల బాలికలు. సాధారణంగా 16 సం.లలోపు పిల్లలు మాత్రమే నేడు ఉన్నత పాఠశాల లో విద్యను అభ్యసిస్తున్నారు. 17,18 సంవత్సరాల పిల్ల లు ఇంటర్మీడియట్‌కు వెళ్లిపోతున్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు ఎంసెట్, నీట్, ఐఐటి, మొదలగు పరీక్షల ఉద్దేశించిన సిలబస్ పాఠ్యాంశాలు నేర్చుకోవడం, అనేక లక్ష్యాలు ఉండటం వల్ల, కథలు గేయా లు మొదలైన బాల సాహిత్యాన్ని చదవటం గానీ, రాయ టం గానీ చేయలేకపోతున్నా రు. కనుక ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వర కు గల బాలబాలికలను ఉద్దేశించి బాల సాహిత్యం ఉన్న ది.

ప్రాచీన కాలంలో బాలసాహిత్యం అంటే రామాయణంలోని కొన్ని ఘట్టాలు, మహాభారతంలోని అభిమన్యుడు, పద్మవ్యూహం ఘట్టాలు ఇలా పురాణ గాధలలోని భక్తులకు సంబంధించిన జీవిత చరిత్రలను బాల సాహిత్యంగా పరిగణించేవారు. తరువాత పాశ్చాత్య భాషా ప్రభావం వల్ల ఆయా భాషలలో రూపొందించిన నవలలు, పిల్లల కథలు మొదలగునవి తెలుగులోకి అనువాదం అయ్యాయి. ముఖ్యంగా సింద్ బాద్ సాహస యాత్రలు కథలు ఇలా ఇతర వేరువేరు దేశాలకు సంబంధించిన కథా సాహిత్యమంతా తెలుగులోకి అనువాదం చేయబడి బాలసాహిత్యానికి ప్రత్యేకమైన ఒక రూపు రావడం జరిగింది. ప్రధానంగా విష్ణుశర్మ చేత రాయబడి న పంచతంత్ర కథలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి.

2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలకులు మన రాష్ట్ర చరిత్ర, సంస్కృతి సాంప్రదాయాలు నేటి బాలలకు తెలియాలని, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని, గుర్తింపు తీసుకురావాలని భావించారు. అందులో భాగంగానే పాఠ్యపుస్తకాలలో కథారచన, గేయ రచన, లేఖారచన, కవిత్వం, సమీక్ష మొదలైన అంశాలు పిల్లలు తప్పకుండా రాయాలనే విధానాన్ని భాషా పాఠ్యపుస్తకాలలో పెట్టారు. ఇది గతంలో లేదు. కేవలం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే ఇది రూపొందించబడ్డది. దీనివలన పిల్లలు సబ్జెక్టు నేర్చుకోవడంతో పాటు పరీక్షల కోసం పాఠ్య గ్రంథాలను చదవటం, వీటికి కూడా ప్రత్యేక మార్కులు ఉండటంతో పిల్ల లు అనివార్యంగా కథలు, కవిత్వం మొదలైన వాటిలో లీనమయ్యారు. ఈ విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వందల పాఠశాలల్లో విద్యార్థులు ఈ అంశాలతో ప్రేరేపితులవుతున్నారు. కేవలం మార్కుల కోసమే కాకుండా పిల్లలు సృజనాత్మకతవైపు తమ ఆలోచనలను సారిస్తున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పిల్లల రచనలను పరిశీలించినట్లయితే ప్రస్తుతం జడ్.పి.హెచ్.ఎస్ తిప్పర్తి, నల్లగొండలో పనిచేస్తున్న దొడ్డి రామ్మూర్తి అనే తెలుగు ఉపాధ్యాయుడు పిల్లలను బాలకవులుగా, రచయితలుగా, గేయ రచయితలుగా తీర్చిదిద్దుతున్నారు. వీరు 2008 సంవత్సరంలో పిల్లలచే కవిత్వాన్ని రాయించారు. వారు అల్లిన కవితలతో 'పిట్టగూళ్లు' అనే కవితా సంకలనాన్ని తీసుకొచ్చారు. ఈ పుస్తకంలో దాదాపు 40 మంది విద్యార్థులు రాసిన కవితలు చోటు చేసుకున్నాయి. అదే సంవత్సరంలో 'చెలిమె పాట' అనే పాటల కథల సంకలనాన్ని తీసుకొచ్చారు. పసి మనసులు భయం లేని ఆలోచనలు కలిగినటువంటి ఈ విద్యార్థులు కవిత్వం రాయడం, పాటలు రాయడం, చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వీరు 2017 సం.లో జడ్.పి.హెచ్.ఎస్ మునుగోడు విద్యార్థులు రాసిన కథలను 'జాలు కథలు' అనే సంకలనాన్ని తీసుకొచ్చారు. మరో పుస్తకం 'చిలుకల దండ' ఇది పాటల సంకలనం. జడ్.పి.హెచ్.ఎస్ పెద్దకాపర్తి చిట్యాల మండలం విద్యార్థుల సంకలనం.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గుండ్రంపల్లిలో పనిచేసే తెలుగు ఉపాధ్యాయురాలు డా.ఉప్పల పద్మ విద్యార్థులచే కథలు రాయించారు. వీరు ఇదివరకు పనిచేసిన పాఠశాలలో 'మిర్యాలగూడ మిణుగురులు' మిర్యాలగూడ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల కవిత్వం సెప్టెంబర్, 2018న తీసుకొచ్చారు. రెండవ పుస్తకం 'నల్లగొండ జిల్లా బడి పిల్లల కథలు' 2020. ఈ పుస్తకంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన విద్యార్థుల కథలు ఉన్నాయి.

మూడవ పుస్తకం 'మంత్రదండం' మంత్రాలకు చింతకాయలు రాలవు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండ్రాంపల్లి విద్యార్థుల కథలు 2025 జనవరిలో తీసుకొచ్చారు. పై మూడు పుస్తకాలకు వీరే సంపాదకత్వం వహించారు. విద్యార్థులలో మూఢనమ్మకాలను, భయాలను తొలగించడానికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది. 'తళతళ తారకలు' కరోనా బాలల చైతన్య గీతం వీడియో పాటను 2020లో ఆవిష్కరించారు.

జడ్.పి.హెచ్.ఎస్ వట్టిమర్తి, నల్లగొండలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పెరుమాళ్ళ ఆనంద్ పనిచేస్తున్నారు. వీరు సంపాదకత్వం వహించిన పుస్తకాల్లో మొదటిది 'రెక్క విప్పిన బాల్యం' పిల్లల యాత్రా స్మృతుల నేపథ్య వ్యాసాలు, కవితల పుస్తకాన్ని వెలువరించారు. 35 మంది విద్యార్థులు వారి యొక్క భావాలను అందులో పొందుపరచడం జరిగింది. ఈ పుస్తకం 2019 సం.లో వెలువడింది. రెండవ పుస్తకం 'జర్నీ' యాత్రా నేపథ్య కథలు, దీన్ని 25 మంది విద్యార్థులు కథలు రాశారు. ఇది 2024 లో వెలువడింది. కవి, రచయిత సాగర్ల సత్తయ్య జెడ్పిహెచ్ఎస్ తాటికల్‌లో పనిచేస్తున్నారు. వీరు విద్యార్థులచే 'చీమ–ఉడుత' అనే కథల సంకలనాన్ని తీసుకొచ్చారు. విద్యార్థులచే బాలసభలు నిర్వహించడం, సమీక్షలు రాయించడం చేయిస్తున్నారు. హిందీ ఉపాధ్యాయులు తౌర ఉప్పలయ్య జెడ్పిహెచ్ఎస్ పాటిమట్లలో పనిచేసినప్పుడు 'పాటిమట్ల పాలపిట్ట1' అనే కవితా సంకలనాన్ని 2018లో తీసుకొచ్చారు. 2021 సం.లో 'పాటిమట్ల పాలపిట్ట 2' ప్రకృతి కవితలు అనే పుస్తకాన్ని తీసుకొచ్చారు. వీరు ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా, జెడ్పిహెచ్ఎస్ మోత్కూర్‌లో పనిచేస్తున్నారు. అక్కడి విద్యార్థులచే కూడా కవితలు, కథలు రాయిస్తున్నారు.

షేక్ అబ్దుల్ ఘని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భువనగిరిలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నా రు. 'భువనగిరి వెలుగులు' పిల్లల కథల పుస్తకాన్ని తీసుకొచ్చారు. తెలుగు ఉపాధ్యాయుడు ముక్కామల జానకిరామ్ జడ్.పి.హెచ్.ఎస్ మేళ్లచెరువు, సూర్యాపేట జిల్లా విద్యార్థులచే కథలు రాయించి, 33 కథలతో 'ఊహలకు రెక్కలొస్తే' అనే పుస్తకాన్ని 2023 సం.లో తీసుకొచ్చారు.

దండాల మధుసూదన్ రెడ్డి భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు. వీరు పుప్పాల కృష్ణమూర్తి గారి సహకారంతో జడ్.పి.హెచ్.ఎస్ కోదాడ విద్యార్థులచే కథలు రాయించి 'కోపిక' పిల్లల కథల సంకలనాన్ని తీసుకొచ్చారు. శీలం భద్రయ్య, దేవినేని అరవింద నాయుడు, మండల స్వామి మొదలగు వారు పాఠశాల సంచికలను తీసుకురావడం జరిగింది.

కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వడ్డేపల్లి వెంకటేష్ మరి కొంతమంది ఉపాధ్యాయులు పిల్లలచే కథారచన చేయిస్తున్నారు. వాటిని అచ్చు రూపంలోకి తీసుకురావలసి ఉన్నది. జనవిజ్ఞాన వేదిక, జాబిలి వంటి సంస్థలు బాలల కథలను అచ్చువేసి బాలసాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లానే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా, రెండు రాష్ట్రాల్లో కూడా అనేకమంది ఉపాధ్యాయులు పిల్లలచే వివిధ ప్రక్రియలో రచనలను చేయిస్తున్నారు. ఇప్పటికీ దాదాపుగా అన్ని ప్రక్రియల్లో కలిపి 500కు పైగా బాలల రచనలు అచ్చులోకి వెలుగు చూశాయి అంటే అతిశయోక్తి కాదు.

వీరు అనేక సాహితీ పోటీల్లో అవార్డులను కూడా గెలుచుకోవడం జరిగింది. కెనడా, గడుగ్గాయి సంయుక్తంగా నిర్వహించే సాహిత్య పోటీల్లో, తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ సరస్వత పరిషత్తు, బాలచెలిమి లాంటి సంస్థలు బాలసాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. వారి రచనలను ప్రచురిస్తున్నాయి.

సందేహం లేదు, నేటి బాలలే భావి రచయితలుగా, కవులుగా ఎదిగి, సమాజానికి విలువైన సాహిత్యా న్ని అందిస్తారు.

బాల సాహిత్యం వర్ధిల్లాలి!

*( నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా)*

**ముక్కామల జానకిరామ్**
బాల సాహితీవేత్త,
6305393291

# పిల్లల్లోనే దేశ భవిష్యత్తును చూసిన చాచా నెహ్రూ


చాచా నెహ్రూ, ప్రతి పిల్లలలోనూ సత్యం, ధైర్యం, కరుణ ద్వారా మార్గనిర్దేశం చేసినట్లయితే మెరుగైన, ప్రజాస్వామ్య భారతదేశం ఆశలు, ఆశయాలు వాళ్ళ ద్వారానే నెరవేరుతాయి అని నమ్మారు, ఆయన పిల్లలపై చూపిన ఆప్యాయతే 'చాచా నెహ్రూ' అనే పేరును తెచ్చిపెట్టింది. నేటి బాలలే రేపటి పౌరులు. పిల్లలు. సత్యం, ధైర్యం, క్రమశిక్షణతో పెరిగితే దేశం బలపడుతుంది అని ఆయన నమ్మకం, అందుకే ఆయన పుట్టినరోజును పిల్లలు సంతోషంగా ఉండాలని, ఆటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రతి సంవత్సరం జరుపుకుంటారు. ఆయన 136వ జయంతి నవంబర్ 14న, భారతదేశం అంతటా బాలల దినోత్సవాన్ని జరుపుకుంటారు.

పిల్లల చిరునవ్వు దేశ భవిష్యత్తుకు పునాది అని, విద్యావంతులైన, శాంతి, సమానత్వం శాస్త్రీయ దృష్టితో ముందుకు సాగే దేశం అని భారత స్వాతంత్ర్యానంతరం దేశ నిర్మాణానికి దిశ, దశ చూపిన నాయకుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన ఆలోచనాతత్వం, భారత రాజ్యాంగ విలువలకు మౌలిక ఆధారం. ప్రజాస్వామ్య విధానం, లౌకికత, శాస్త్రీయ దృక్పథం, సామాజిక సమానత్వం అనే నాలుగు స్తంభాలపై నిలిచిన భారత ఆలోచనా విధానమే నెహ్రూ సిద్ధాంతం. నెహ్రూ యొక్క తాత్విక దృక్పథానికి ఆధారం మానవతావాదం, తర్కం, శాస్త్రీయత, సమానత్వం, ప్రేరణ మూలాలు మార్క్సిస్టు ఆలోచనలు, పాశ్చాత్య ప్రజాస్వామ్య తత్వం, గాంధీజీ ప్రభావం. మూల సిద్ధాంతం ప్రజలకు స్వేచ్ఛతో పాటు సామాజిక సమానత్వం అందించడంతో పాటు, ప్రపంచ ప్రసిద్ధి చెందిన రచయితల్లో ఒకడి గా ప్రసిద్ధి చెందినారు. శాస్త్రం లేకుండా ప్రజల అభివృద్ధి సాధ్యం కాదు అని నమ్మిన మేధావి నెహ్రూ. నెహ్రూ ప్రజాస్వామ్య పునాదిపై సామ్యవాద ఆర్థిక వ్యవస్థను నిర్మించి భారతదేశం పంచవర్ష ప్రణాళికల (1951– 1964) ద్వారా మొదటి పంచవర్ష ప్రణాళికల ద్వారా (1951 –56) వ్యవసాయ రంగం బలోపేతం, రెండవ పంచవర్ష ప్రణాళికల 1956–61) ద్వారా భారీ పరిశ్రమలు, ఇంధన రంగం; మూడవ పంచవర్ష ప్రణాళికల ద్వారా విద్య, శాస్త్ర పరిశోధన, ఆరోగ్య రంగాల్లో దేశాన్ని స్వయం సమృద్ధి సాధించి, అభివృద్ధి దిశగా నడిపించి ప్రజాస్వామ్య పునాదిపై నెహ్రూ భారతదేశాన్ని మతపరమైన విభజనలేని లౌకిక రాజ్యంగా చేశారు, ఆయన దృష్టిలో మతం వ్యక్తిగత విశ్వా సం, కానీ దేశం అందరి కోసం అని స్పష్టం చేశారు. రాజ్యాంగంలో లౌకికతకు ప్రాధాన్యం, విద్యా వ్యవస్థలో మత ప్రాతిపదిక లేని పాఠ్యభాగాలు, మైనారిటీ హక్కుల రక్షణ, సామ్యవాద ఆర్థిక వ్యవస్థను నిర్మించారు.

1950–60 దశకాల్లో నెహ్రూ విదేశాంగానికి నూతన దిశ చూపించారు. ఆయన ప్రవేశపెట్టిన అలీన విధానంతో ప్రపంచానికి భారతదేశ స్వతంత్ర ధోరణిని చాటిచెప్పాడు, భారతదేశం ఎవరి శిబిరంలోనూ ఉండకూడదు; మన శిబిరం శాంతి శిబిరం కావాలి అని అన్నారు. నెహ్రూ (1960లలో ) ఆర్థిక మరియు శాస్త్రీయ ఆధునికీకరణకు ఐఐటి, ఎయిమ్స్, డి.ఆర్.డి.ఓ, ఇస్రో లకు పునాది వేసిన దార్శనికుడు, భారీ పరిశ్రమలైన భిలాయి స్టీల్ ప్లాంట్, బోకారో, హిరాకుడ్, వ్యవసాయ పరిశోధన మండళ్లు, నీటి ప్రాజెక్టులకు ఊపిరి పోశారు, ఫలితంగా సాంకేతిక విద్యకు బలం, స్వయం సమృద్ధి భావన, శాస్త్రీయ దృక్పథం పెంపొందింది. సామాజిక న్యాయం, విద్యా సంస్కరణలతో ఉచిత ప్రాథమిక విద్యా ప్రోత్సాహం, స్త్రీ విద్యాభివృద్ధి, పేదల, అణగారిన వర్గాల సంక్షేమ పథకాలు, విద్యా సంస్థల ప్రాముఖ్యతను తెలియజేసారు.

అష్ట ఐశ్వర్యాలతో, యురోపియన్ వాళ్లనే ఇంట్లో పనిలో పెట్టుకున్న శ్రీమంతుడు, 1921 నుండి 1945 మధ్య కాలంలో జవహర్‌లాల్ నెహ్రూ తొమ్మిది సార్లు జైలుకెళ్లారు, భారత స్వాతంత్ర్య పోరాటంలో దాదాపు 3,259 రోజులు జైలులో గడిపారు. ఆయన ఒకానొక సందర్భంలో జైలు జీవితంలో కుక్కల శబ్దం విని కొన్ని నెలలు (సంవత్సర కాలం)అయ్యింది అని ఉత్తరంలో పేర్కొన్నారు, అంతటి కఠిన కారాగారంలో వ్రాసినదే 'ది డిస్కవరీ ఆఫ్ ఇండియా'(భారత దర్శనం), 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ'(ప్రపంచ చరిత్ర), 'యాన్ ఆటోబయోగ్రఫీ (టువార్డ్స్ ఫ్రీడం)' 'ఒక తండ్రి నుండి తన కూతురికి లేఖలు' (చిరంజీవి ఇందిరకు) ప్రపంచ ప్రసిద్ధి చెందిన రచయితల్లో ఒకడిగా ప్రసిద్ధి చెందినారు.

ఇటీవల న్యూయార్క్ నగరానికి కొత్తగా ఎన్నికైన మేయర్ జోహ్రాన్ మమ్దానీ తన విజయ ప్రసంగంలో జవహర్‌లాల్ నెహ్రూను ఉటంకిస్తూ, ఒక యుగం ముగిసి కొత్తది ప్రారంభమౌతుంది, యుగం ముగుస్తుంది ఒక దేశ ఆత్మ దీర్ఘకాల నిశ్శబ్దము నుంచి తన



స్వరాన్ని పొందుతుంది, అదే ఈ రాత్రి న్యూయార్క్ కూడా అదే చేసిందన్నారు. నెహ్రూపై విమర్శలు లేకపోలేదు, ఆర్థిక విధానంపై బలమైన బ్యూరోక్రసీ, నెమ్మదైన వృద్ధి, రక్షణ విధానం, చైనా యుద్ధం (1962)లో లోపాలు, గ్రామాభివృద్ధికన్నా పట్టణాలపై అధిక దృష్టి, అయినా ఆయన చూపిన రాజకీయ పరిపక్వత, అంతర్జాతీయ మానవతా దృక్పథం భారత అభివృద్ధికి మార్గదర్శకం.

నెహ్రూ భారతాన్ని ఒక పేద దేశం నుండి ఆధునిక ప్రజాస్వామ్య దేశంగా మార్చిన మహనుభావుడు. అతని దృష్టి, విజ్ఞానం, మానవతా దృక్పథం ఈరోజు కూడా భారత ప్రగతికి పునాది వంటివి. నెహ్రూ భారతదేశానికి ప్రజాస్వామ్య ఆత్మ, శాస్త్రీయ మానసికత, లౌకిక చింతన అందించారు. అది వేకప్ ఇండియా అనే దిశలో తీసుకెళ్లిన నిజమైన సిద్ధాంతం. ప్రస్తుతం ప్రపంచంలోని పెద్ద కంపెనీలకు సిఇఒలుగా, ప్రెసిడెంట్లుగా ఉన్నారంటే అది నెహ్రూగారి విధానపరమైన చలవే. ప్రపంచంలోని అంతరిక్ష పరిశోధన, సాంకేతిక రంగాల్లో రాణింపునకు అప్పుడు వేసిన బీజమే.

పిల్లలకు కులం, మతం, ఎక్కువ తక్కువ అని తేడా లేకుండా, ఆధునిక విద్య, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించగలిగితే దేశ భవిష్యత్తుకి వారే ఆశాదీపాలౌతారని ఆయన నమ్మకం. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న పరిస్థితిలో అయన లౌకిక వాదమే అనుసరణీయం. అందుకే పిల్లలకు ఒత్తిడిలేని, నాణ్యమైన విద్య, ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలకు అందించాలి, అప్పుడే మనదేశం ప్రపంచ దేశాల్లో మరింతగా ముందుకెళుతుంది. భవిష్య భారతం పిల్లలదే.

**డా ఎ. భాగ్యరాజ్**, 9019224208

## నృసింహస్వామిని దర్శించుకున్న మంత్రి అడ్లూరి

ప్రజాపక్షం/ధర్మపురి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారిని గురువారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారల దర్శనార్థం ఆలయానికి చేరుకున్న మంత్రి లక్ష్మణ్ కుమార్ ను దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్,కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు ఆలయ సాంప్రదాయం ప్రకారం మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. మంత్రి అడ్లూరి మొదట ప్రధానాలయం శ్రీ యోగనంద స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనుబంధ ఆలయాలలోని స్వామివారలను మంత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్,ఈఓ స్వామివారి శేషవస్త్రంతో మంత్రి అడ్లూరిని సత్కరించి ప్రసాదం అందజేశారు. ప్రముఖ వ్యాపారి రేణికుంట ప్రసాద్ మమత దంపతుల కుమార్తె ఐశ్వర్య వివాహము హరిహరనాథ్‌తో ఇటీవల వివాహం జరుగగా నూతన దంపతులను వారి ఇంటికి వెళ్లి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## భవిత సెంటర్ పెండింగ్ పనులు వేగవంతం: కలెక్టర్



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్: భవిత సెంటర్ పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన భవితా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన భవిత సెంటర్ పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భవిత సెంటర్ కు కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, పక్కన ఉన్న రేకుల షెడ్డు కూడా వినియోగించుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మండల విద్యాధికారి సురేందర్ కుమార్,ఐ.ఈ.ఆర్.పి సంధ్యా రాణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని వీడి ఉండటం ఇబ్బంది కలిగించింది: మంత్రి అడ్లూరి



ప్రజాపక్షం/ధర్మపురి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుకోసం జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని సోమాజిగూడ లో 12 రోజులపాటు అక్కడే ఉండాల్సి రావడంతో తన నియోజకవర్గం ధర్మపురి ప్రజలకు దూరంగా గడపడం ఇబ్బంది కలిగించిందని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,వికలాంగుల శాఖా మాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామివారిని గురువారం ఆయన దర్శించుకున్నారు.అనంతరం పాత్రికేయులతో మాట్లాడారు.తన ప్రజా జీవితంలో నియోజకవర్గాన్ని 12 రోజులపాటు వదిలి ఉండటం మొదటిసారి జరిగిందని,నిత్యం తన మనసంతా ధర్మపురి ప్రజల చుట్టూనే ఉందనీ అన్నారు.జూబ్లీహిల్స్ ఎన్నికలు పూర్తికాగానే తన నియోజకవర్గ ప్రజల్ని ఎప్పుడెప్పుడు కలుస్తానా అని తహతహలాడానని అడ్లూరి చెప్పారు.ఈరోజు తన ఇష్టదైవం లక్ష్మీ నృసింహుడిని దర్శించుకోవడం,తన ప్రాంత ప్రజలను కలుసుకోవడం ఆనందంగా ఉందని భావోద్వేగంతో తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని చెప్పారు. ప్రజల మద్దతు చూసి రెండు రోజుల ముందే బీఆర్ఎస్ చేతులెత్తేసిందన్నారు. పదేళ్ల దొరల పాలనలో ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవించారని మార్పు కోరుకున్న ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని చూస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లుగా 2034 వరకూ తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని అన్నారు. పేదల సంక్షేమం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.దేవస్థానం అధ్యక్షులు జక్కు రవీందర్, రాజేశ్, రాజేశ్, లక్ష్మణ్, సింహరాజు ప్రసాద్, అప్పం తిరుపతి,ఆశెట్టి శ్రీనివాస్, వొజ్జల లక్ష్మణ్,రాపర్తి సాయికిరణ్, ఎదులాపురం మహేందర్, నరేందర్, ప్రభాకర్ రావు, తదితరులు ఉన్నారు.

## సేవా భావం ఉన్నప్పుడే వైద్య వృత్తిలో రాణింపు: ఎమ్మెల్యే



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో గురువారం ఇండక్షన్ ప్రోగ్రామ్ మరియు వైట్ కోట్ సెర్మోని కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనీ మొదటి సంవత్సరంలో ఉత్తమ పలితాలు సాధించి డిస్టింగ్షన్ లో పాసైన విద్యార్థులను ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేసి జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ సత్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేను మెమెంటో అందజేసి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సహకారంతో 40 కోట్ల పెండింగ్ బకాయిలు విడుదలతో మెడికల్ కాలేజీ పనులు త్వరిత గతిన జరుగుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. మెడికల్ కళాశాలలో సమస్యలు ఉంటే మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమస్య ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా ఎమ్మెల్యే అన్నారు. మెడికల్ విద్యాభ్యాసంలో ఫలితాలతో పాటు క్యారెక్టర్ కూడా ముఖ్యమని వైద్యుడు సేవా భావం ఉన్నపుడే వైద్య వృత్తిలో రాణిస్తారు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. మెడికల్ అభ్యాసంతో పాటు వైద్య రంగంలో నూతన సాంకేతికత పై కూడా పట్టు ఉండాలని ఎన్ఎంసి ప్రకారం అన్ని రూల్స్ పాటిస్తూ ఉండడం వల్ల నే జగిత్యాల మెడికల్ కళాశాలకు ఆమోదం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.సునీల్, సూపరిండెంట్ డా.కృష్ణ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అర్చన, ప్రొఫెసర్స్ హెచ్ఓడిలు మెడికల్ విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను ప్రశంసించిన విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: కరీంనగర్ జిల్లాలో కలెక్టర్ పమేలా సత్పతి నేతృత్వంలో విద్యారంగ అభివృద్ధికి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ప్రశంసించారు. దాదాపు 20 అంశాలపై విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేకంగా వినూత్న కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. గురువారం సాయంత్రం కరీంనగర్‌లోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌజ్‌లో జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి చేపట్టిన సంస్కరణలు, వినూత్న కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులతో ఆకునూరి మురళి సుధీర్ఘ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన పవర్ ప్రజెంటేషన్ ఆద్యంతం ఆకట్టుకుంది. విద్యా కమిషన్ చైర్మన్ ప్రత్యేకంగా ఒక్కొక్క అంశంపై క్షుణ్ణంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలు బాగున్నాయని కలెక్టర్ పమేలా సత్పతిని అభినందించారు. పాఠశాలల్లో బుధవారం బోధన, స్నేహిత, కాన్షియస్ క్లబ్‌ల ఏర్పాటు, ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, విటమిన్ గార్డెన్స్ ఏర్పాటు, ఇండియన్ సైన్ లాంగ్వేజ్, గణితం సైన్స్ ఒలంపియాడ్, టెట్ ఎడ్ సమ్మర్ క్యాంపుతో పాటు వివిధ రకాల వినూత్న కార్యక్రమాలపై కలెక్టర్ పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కరీంనగర్ జిల్లాలో అద్బుతమైన కార్యక్రమాలు చేపడుతూ మంచి ఫలితాలు సాధించడం పట్ల విద్యా కమిషన్ చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో పాఠశాలల పనితీరు విద్యార్థుల హాజరు ఫలితాలు ఉపాధ్యాయుల వివరాలు హాజరు శాతం అన్ని విషయాలను సమగ్రంగా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ,డిఈవో మొండయ్య, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి తదితరులున్నారు.

## బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: గజ్వేల్ రూరల్ సిఐ ఆధ్వర్యంలో జగదేవ్‌పూర్ పోలీసులు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని నాలుగురిపై కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని తిగుల్ గ్రామంలో గురువారం అక్రమంగా మద్యం నిల్వ చేశారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 25 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్న నాలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ



### మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/పెద్దపల్లి: పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్ల ను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు బుధవారం రాత్రి మంథని మండలం అడవి సోమనపల్లి గ్రామంలో పర్యటించి పూర్తయిన 40 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి వర్యులు శ్రీధర్ బాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన ప్పటి నుండి పేద ప్రజలకు ఇచ్చిన మాట మేరకు మొదటి దఫా లోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 చొప్పున మొత్తం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే పేదలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ప్రతి సోమవారం డబ్బులు విడుదల చేస్తున్నామని అన్నారు.మన పెద్దపల్లి జిల్లాలో మంథని నియోజకవర్గం పరిధిలో నేడు గృహ ప్రవేశాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పేద ప్రజల ముఖాలలో సంతోషం చూస్తే తనకు చాలా సంతృప్తి కలుగుతుందని అన్నారు.అర్హులైన ప్రతి పేదవాడికి ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల లోపు మరో మూడు విడతలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.పేద ప్రజల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఉగాది నుంచి నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, 11 లక్షల నూతన రేషన్ కార్డుల పంపిణీ చేశామని తెలిపారు. సోమనపల్లి వద్ద 200 కోట్లతో చేపట్టిన యంగ్ ఇండియా గురుకుల పాఠశాల పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో రైతులు తాళ్ళ కట్టింగ్ తో ఇబ్బందులు పడితే మన ప్రజా ప్రభుత్వం కట్టింగ్ కు స్వస్తి పలికి సన్నరకం వడ్లకు క్వింటాళ్ల 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు.25 లక్షల 65 వేల మంది రైతులకు 20 వేల 681 కోట్ల రూపాయల 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసామని అన్నారు. వానాకాలం పంటలో సన్న రకం పండించిన ధాన్యానికి 1800 కోట్ల బోనస్ అందించామని అన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ లాభసాటి వ్యవసాయం ఎలా చేయాలి అనే అంశం పై రైతులకు శిక్షణ అందించే కార్యక్రమాన్ని చేపడతామని అన్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అడవి సోమనపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో నేడు 40 గృహ ప్రవేశాలు మంత్రి చేతుల మీదుగా జరపడం సంతోషకరమని అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి మేరకు ప్రతి సోమవారం నిధులు చెల్లించడం జరుగుతుందని అన్నారు.అనంతరం అడవి సోమనపల్లి గ్రామంలో 3 కోట్ల 5 లక్షలతో నిర్మించనున్న సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ రాజేశ్వరరావు, మంతిని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## కనీస సౌకర్యాల్లేవ్.. ఇష్టమొచ్చినట్లు రేట్లు పెంచేస్తారా?

### ఆర్జిత సేవా రుసుం పెంచడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఆర్జిత సేవా రుసుంలను భారీగా పెంచడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడిన బండి సంజయ్ భక్తులకు కనీస సౌకర్యాల్లేవు.. ఆలయ ప్రాంగణంలో శుభ్రత లేకుండా తాగునీరు, పార్కింగ్ సదుపాయాలు, షెల్టర్ వసతులు లేకుండా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. అలాంటి పరిస్థితుల్లో ఆర్జిత సేవా రుసుములను అడ్డగోలుగా పెంచడం ఏమిటి? అని ప్రశ్నించారు. భక్తుల సౌకర్యాలపై దృష్టి పెట్టకుండా ఆర్థిక లాభాల కోసమే నిర్ణయాలు తీసుకోవడం తగదని హెచ్చరించారు. తక్షణమే పెంచిన ఆర్జిత సేవా రుసుములను వెనక్కి తీసుకోవడంతో పాటు భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలన్నారు. కొండగట్టు తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక గుండెచప్పుడు లాంటిదని, ఇక్కడ భక్తులకు కష్టాలు కలగడం ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని సూచిస్తుందని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## అభివృద్ధి పనులు పూర్తి : కలెక్టర్

ప్రజాపక్షం/రామగిరి: గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి సింగరేణి గెస్ట్ హౌస్ లో మంథని నియోజకవర్గం అభివృద్ధి పనులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, డిసెంబర్ 7 వరకు మిషన్ భగీరథ సంబంధించి మంథని నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు , పైప్ లైన్ పనులు, మరమ్మతు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.మంథని నియోజకవర్గ సంబంధించి అడవి సోమనపల్లి యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణం సకాలంలో పూర్తి కావాలని కలెక్టర్ తెలిపారు. మంథని పరిధిలోని రామగిరి కేజీబీవీ కాంపౌండ్ వాల్, ఆదర్శ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను, పీఎం పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ నిర్మాణం, హాస్టల్ భవన నిర్మాణ వేగవంతంగా పూర్తి చేసే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. ఈ సమావేశంలో మంథని ఆర్.డి.ఓ. సురేష్,ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా శ్రీనివాస్, మిషన్ భగీరథ గ్రిడ్ పూర్ణ చందర్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇచ్చిన ఎన్నికల హామీలు ఇంకెప్పుడు అమలు?

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 23 నెలలు కావస్తున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి దుయ్యబట్టారు. గురువారం కరీంనగర్ జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ అధ్యక్షతన స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయంగా మారాయన్నారు. అందులో చదువుతున్న విద్యార్థులు సమస్యలు పరిష్కరించాలని రోడ్డెక్కినా పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో అనేక హాస్టళ్లలో విద్యార్థులకు దుప్పట్లు రాక చలికాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్నా ఆయన అపాయింట్‌మెంట్‌లు ఇవ్వక సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి నియమిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, విద్యను వ్యాపారంగా మారుస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు, ప్రతి విద్యార్థికి ఇంటింటికి ఉచిత వైఫై, ఐదు లక్షల విద్య భరోసా కార్డు వంటి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 23 నెలలైనా ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. విద్యార్థులకు ఇస్తామన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తోందన్నారు. రాష్ట్రంలో నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, జిల్లా ఆఫీస్‌బేరర్స్ మామిడిపల్లి హేమంత్, కనకం సాగర్, రాము యాదవ్, లద్దునూరి విష్ణు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల నిధులు రక్షణకు ఆందోళనలు



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: భవన నిర్మాణ కార్మికుల నిధులు రక్షణ కోసం నిరంతరం ఆందోళనలు చేయాలని సంబంధిత జిల్లా జేఏసీ తీర్మాణం చేసినట్లు నాయకులు తెలిపారు. గురువారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో భవన నిర్మాణ కార్మికుల జిల్లా జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 17న వినతి పత్రాలు అందజేత, 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా, డిసెంబర్ 5న చలో హైదరాబాదు నిర్వహిస్తున్నట్లు తీర్మాణం చేసినట్లు జేఏసీ సంఘా నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి, సిఐటియు, బిఆర్‌టియు, ఇతర స్వతంత్ర సంఘాలు పాల్గొన్నాయి. రౌండ్ టేబుల్ సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ కార్మిక సంఘాలతో భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీ ద్వారా నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఎస్‌సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలని, వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన అనుమతిని ఉపసంహరించాలన్నారు. సహజ మరణానికి ఐదు లక్షలు ఇవ్వాలని, రెన్యువల్ కాని 13 లక్షల వెల్ఫేర్ బోర్డు కార్డులను వెంటనే రెన్యువల్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. డిమాండ్ల సాధనకై 17న కార్మిక మంత్రి, లేబర్ కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేయాలని, 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా చేయాలని, డిసెంబర్ 5న చలో హైదరాబాదు కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. అన్ని రకాల భవన నిర్మాణ కార్మికులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో ఏఐటియుసి భవన నిర్మాణ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్,కొమురయ్య, సమ్మయ్య, రమేష్, మల్లేశం, రాములు, కుమార్, సత్యం, రమేష్, సంతోష్‌చారి తదితరులున్నారు.

## రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

### ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

### హాజరైన ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల: ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తుల చివరి గింజ కొనుగోలు వరకూ రైతులకు అధికారులు అండగా ఉండాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. ఖరీఫ్ సీజన్ 2025 2026 వరి, పత్తి, మక్కల కొనుగోళ్లపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జిల్లాలో 4,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ అధికారులు అంచవేశారని, దాదాపు 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఐకేపీ 156, పీఏసీ ఎస్ 72, డీసీఎంఎస్ 1, మెప్మా ఆధ్వర్యంలో 7 మొత్తం 236 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, సీసీఐ ఆధ్వర్యంలో ఐదు కొనుగోలు కేంద్రాలు, మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మక్కల కొనుగోలుకు రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం, 17 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులకు అండగా నిలుస్తుందని, వారి సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. 20 నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ. లక్ష కోట్లకు పైగా రైతు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చించిందని వెల్లడించారు. 20 వేల కోట్లకు పైగా రుణమాఫీ రైతులకు చేసిందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని ఆయా మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు దాన్యం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వెంకటేశ్వర్లు, చంద్ర ప్రకాశ్ ఆయా శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, వ్యవసాయ అధికారులు, లారీ కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐది వందేళ్ల సుదీర్ఘపోరాటాల చరిత్ర

### వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడారి రాములు

ప్రజాపక్షం/వేములవాడ : వేములవాడ మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఐ పార్టీ వంద సంవత్సరాల ముగింపు సభ, ఖమ్మం జిల్లాలో డిసెంబర్ 26న జరిగే సభ కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి. రాములు, ముఖ్య అతిధి సిపిఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 1617 తేదీలలో వేములవాడ కు వస్తున్న సిపిఐ పార్టీ బస్సు జాతారకు కార్మికులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలని, వంద సంవత్సరాల సుదీర్ఘ కాలంలో వేలాది ఎకరాల భూములు పంచిన ఘన చరిత్ర సిపిఐ పార్టీ దని, పేదల హక్కుల కోసం నిరంతరం పాటు పడే పార్టీ అని, ఈ ర్యాలీ లో పాల్గొంటు, బహిరంగ సభను విజయవంతం చేయాలని, ఈ ర్యాలీ లో ముఖ్య అతిధిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడా వెంకట్ రెడ్డి పాల్గొంటారు. ముగింపు సభలో 40 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎల్ల దేవరాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, శ్రీరాముల నర్సయ్య, పెంట. మల్లయ్య, వావిలాల. నర్సయ్య, గూడెం. కనకయ్య, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల మండలంలో క్రీడా ప్రాంగణాలపై పట్టింపేదీ?

### క్రీడలకు పనికి రాకుండా క్రీడా ప్రాంగణాలు

### మండల గ్రామ స్థాయి అధికారుల నిర్లక్ష్యం

### లక్షల్లో ప్రజా ధనం వృథా!



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహిస్తూ యువత తాము ఎంచుకున్న క్రీడల్లో శిక్షణ పొందడానికి సుమారు ఎకర స్థలం విస్తీర్ణం తగ్గకుండా ఉండాలని గత ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాలను పట్టణాలు, గ్రామాలలో ఏర్పాటు చేసింది. యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారిలోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీయాలనే ప్రభుత్వ లక్ష్యం ఉన్నతంగా ఉన్నా మండల, గ్రామస్థాయి అధికారులు నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం దారి తప్పియిందని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

మండల గ్రామ స్థాయి అధికారుల నిర్లక్ష్యం లక్షల్లో ప్రజా ధనం వృథా : జగిత్యాల అర్బన్ మండలంలోని 5 గ్రామాలలో క్రీడా ప్రాంగణాలు పూర్తి చేయగా అందుకు 2,26,457 (రెండు లక్షల ఇరవై అరు వేల నాలుగు వందల యాభై ఏడు రూపాయలు) కాగా, జగిత్యాల రూరల్ మండలంలోని 30 గ్రామాలలో క్రీడా ప్రాంగణాలు పూర్తి చేయగా అందుకు 11,13,200 బిల్లులు పెట్టరాని సమాచారం. జగిత్యాల అర్బన్, రూరల్ మండలంలో 35 క్రీడా ప్రాంగణాలకు మొత్తం ఖర్చు 1,339,657 ఎట్టకేలకు ప్రజాధనం వృధా చేయదంలో నాటి అధికారులు, ప్రజాప్రతినిధులు నిమగ్నం అయ్యారనే విమర్శలు లెక్కపోలేవు.

జగిత్యాల అర్బన్, రూరల్ మండలంలో 35 క్రీడా ప్రాంగణాలను ఏర్పాట్లు చేయగా ఎకర స్థలం విస్తీర్ణంలో ఏర్పాటు చేయవలసిన క్రీడా ప్రాంగణాలను జగిత్యాల మండలంలో మండల గ్రామ స్థాయి అధికారులు తూ తూ మంత్రంగా కొన్ని చోట్ల తక్కువ స్థలలలో, కొన్ని గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలో, కొన్ని గ్రామాలలో జనవసాలకు చాలా దూరంలో, హై వే రోడ్ల పక్కన క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి మండల గ్రామ స్థాయి అధికారులు చేతులు దులుపుకున్నారని గ్రామాల ప్రజలు తెలిపారు. జగిత్యాల మండలం లోని కొన్ని క్రీడా ప్రాంగణాలు దారుణంగా ఉన్నాయని పిచ్చి మొక్కలతో, గ్రామల చెత్తను పోస్తున్నారు, ఓ గ్రామంలో స్మశాన వాటికలో, మరో గ్రామంలో గ్రామానికి దూరంగా గుట్టలకు సమీపంలో, ఓ గ్రామంలో హైవే రహదారి పక్కన ఏర్పాటు చేయగా ఆ క్రీడా ప్రాంగణం పెద్ద పెద్ద ట్రక్కులు, టిప్పర్లులు నిలుపుకునే పార్కింగ్ స్థలంగా ఉపయోగపడుతుందని జగిత్యాల అర్బన్, రూరల్ మండలంలో క్రీడా ప్రాంగణాల స్థితి ఒక్కో గ్రామంలో ఒక్కో రీతిగా మండల, గ్రామ స్థాయి అధికారుల నిర్లక్ష్యపు ధోరణికి నిదర్శనంగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి నిరుపయోగంగా ఉన్నాయని క్రీడా ప్రాంగణాలను బిల్లుల కోసమే తప్ప యువతకు ఉపయోగపడడానికి కాదు అనేలా ఉన్నాయని జగిత్యాల మండలంలో యువత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను యువతకు ఉపయోగకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని యువత కోరుతున్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రజాపక్షం/నిజాంపేట్:రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని డిపి ఎం యాదయ్య అన్నారు. నిజాంపేట మండలం నందగోకుల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. ధాన్యం కొనుగోలు జరిగిన 48 గంటలలోనే రైతుల ఖాతాలో డబ్బులు జమవుతాయని పేర్కొన్నారు. రికార్డులను పరిశీలించి నిర్వాహకులు పలు సూచనలు చేశారు. ఎపిఎం అశోక్, సిసివెంకటరాజం, రవీందర్, నిర్వాహకులు తదితరులు ఉన్నారు.



## బాల్య వివాహాలను అరికట్టాలి..

ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :బాల్య వివాహాలను అరికట్టాలని మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ మౌనిక అన్నారు.గురువారం ఖానాపూర్ మండలంలోని బీర్నంది జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలన పట్ల విద్యార్థులకు,గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.వారు మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రజాప్రతినిధులు,అధికారులు,ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు.18 ఏళ్లు నిండకముందు బాలికలకు బలవంతంగా వివాహాలు జరిపిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098కి సమాచారం ఇవ్వాలని, సమాచారమిచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,సఖి కౌన్సిలర్ ,చైల్డ్ లైన్ కౌన్సిలర్ సుప్రియ,సఖి సిబ్బంది లావణ్య,ఎపిఎంఎమ్ నీల,ఉపాధ్యాయులు,అంగన్వాడీ,ఆశా,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## నవాబుపేట శివార్లలో తనిఖీలు

### 'ప్రజాపక్షం' వార్తకు స్పందించిన పిసిబి అధికారులు

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/శివ్వంపేట : కంపెనీ కాలుష్య వ్యర్థాలకు మూగ జీవాల అ స్వస్థత అనే కథనానికి జిల్లా పిసిబి అధికారులు స్పందించారు. మండలంలోని లచ్చిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బండ నగేశ్, రాయెల్లి కుమార్, నవాబ్‌పేట గ్రామానికి చెందిన కొమ్ము సంజీవ గొర్రెలు నవాబ్‌పేట శివారులోని కెమికల్ కంపెనీ గోడ పక్కన గల కాలుష్య వ్యర్థాలు తిని తీవ్ర అ స్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న రామచంద్రపురంపిసిబి అధికారులు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నవాబ్‌పేట గ్రామ శివారులోని కాలుష్యకర కంపెనీలలో తనిఖీలు నిర్వహించగా కాలుష్య జలాలు, కాలుష్య వ్యర్థాలు పారబోసేది ఎవరనేది పిసిబి అధికారులు విచారణ చేయగా కంపెనీకి ఎలాంటి బోర్డు కూడా ఏర్పాటు చేయని కోటేశ్వర్‌రావు కంపెనీగా తేలిందని అధికారులు తెలిపారు. కనీసం కంపెనీకి బోర్డు పెట్టకుండా కంపెనీ కార్యకలాపాలు ఎలా నిర్వహిస్తున్నారనే విషయాన్ని పిసిబిఅధికారులు నమోదు చేసుకోవడం జరిగిందని అధికారులు తెలిపారు. మూగ జీవాల అస్వస్థతకు కారణమైన నిత్యం కాలుష్య వ్యర్థాలను పారబోస్తున్నకోటేశ్వర్‌రావుకంపెనీపైచర్యలుచేపట్టేందుకుఅధికారులురాష్ట్ర కాలుష్యనియంత్రణమండలికినివేదికఅందజేస్తున్నట్లుఅధికారులుతెలిపా రు.

## శ్రావణి కుటుంబానికి ఆర్థిక సాయం

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా ఎస్పి కాంతిలాల్ పాటిల్



ప్రజాపక్షం/ఆసిఫాబాద్:కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలం గెర్రె గ్రామానికి చెందిన తలండి శ్రావణి హత్య కేసులో జిల్లా పరిపాలన స్పందించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసింది. జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా ఎస్పి కాంతిలాల్ పాటిల్ బాధిత కుటుంబ సభ్యులకు రూ. 4,12,500/ ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. అదేవిధంగా, ఇందిరమ్మ హౌసింగ్ పథకం కింద రూ. 5 లక్షల విలువైన ఇల్లు నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను అందించారు. అదనంగా, పొదుపు మహిళా సంఘం ద్వారా బాధిత కుటుంబానికి రూ. 1,00,000/ ఆర్థిక సాయం చెక్కు రూపంలో అందజేశారు. మృతురాలి చిన్న తమ్ముడు తలండి ప్రసిక్‌ను ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో (నాల్గవ తరగతి) చేర్పించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా 100 ద్వారా లేదా నేరుగా పోలీసులను వెంటనే సంప్రదించాలని ఎస్పి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ డిఎస్పి వాహిదుద్దీన్, లోకేశ్వరరావు డిఆర్ఓ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్, దహెగాం ఎస్.ఐ విక్రమ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన



ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్ గ్రామపంచాయతీ తేలిగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనం మెనూ, తరగతి గదులు, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీ సమయంలో పరిశుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. ఎ.ఐ. పద్ధతిలో విద్యార్థులకు బోధించడం ద్వారా పఠన సామర్థ్యం పెంపొందుతుందని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కవిత, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నగర అభివృద్ధి ప్రణాళికలపై కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష



ప్రజాపక్షం/నిజామాబాద్:నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి హోదాలో జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. వివిధ విభాగాల అధికారులతో పాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే వార్డు ఆఫీసర్లతో క్రమం తప్పకుండా సమావేశమవుతూ నగర పురోభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశంచేస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నగరపాలక సంస్థ పనితీరుపై కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఒక్కో డివిజన్ సమస్యలనుపవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగతం చేసుకుంటూ అభివృద్ధిప్రణాళికలపై కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ప్రతి నివాస ప్రాంతంలో పచ్చదనం, పరిశుభ్రత ఉట్టి పడేలా చొరవ చూపాలన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, పిడిపవన్‌కుమార్, అధికారులు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

# ప్రతీ ప్రభుత్వ పథకాన్ని అర్హులైన పేదలకు అందిస్తాం

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..





ప్రజాపక్షం/నిర్మల్/ఖానాపూర్:ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం ఖానాపూర్ ఎంపిడిఓ కార్యాలయంలో,ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి ఖానాపూర్ నియోజకవర్గానికి సంబంధించి వివిధ అభివృద్ధి పనులు,పథకాల అమలుపై సంబంధిత అధికారులు అందరితో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్నిటిని అర్హులైన నిరుపేదలకు చేరే విధంగాచర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ,ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు మార్గ నిర్దేశం చేస్తున్నట్లు వివరించారు.వివిధ శాఖల ఇంజనీరింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని ఆదేశించారు.నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే గుత్తేదారును మార్చేందుకు వెనకడుగు వేయవద్దని పేర్కొన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్య,వైద్యం,త్రాగునీరు,వంతెనలు,గృహాలు,విద్యుత్ అందించి,వారి జీవన ప్రమాణాలు పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఏ కారణాల చేతనైనా అభివృద్ధి పనులు ఆగితే, వెంటనే తమ దృష్టికి తేవాలని తెలిపారు.

**పథకాల ద్వారా పేదల అభ్యున్నతి సాధించడమే ప్రభుత్వ లక్ష్యం:ఖానాపూర్ ఎమ్మెల్యే**

ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి పేదలకు అభ్యున్నతికి తోడ్పడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.పథకాలన్నీ సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు.ప్రభుత్వ పథకాల అమలులో ఎట్టి పరిస్థితుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు.ఇండ్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించిందని అన్నారు.మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ వెంటనే పూర్తి చేయాలని అన్నారు.నియోజకవర్గంలోని మండలాలలో మంజూరైన ఇండ్లు,నిర్మాణంలో ఉన్న ఇండ్లకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.వివిధ మండలాలలో అటవీశాఖతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇబ్బందులు ఉన్న సమాచారాన్ని అధికారుల ద్వారా తెలుసుకున్నారు.అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.వివిధ ఇంజనీరింగ్ ఏజెన్సీల ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి,మౌలిక సదుపాయాల కల్పన పనులకు సంబంధించి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని అన్నారు.నిర్మాణాలకు అనుమతులు లభించి,పనులు ప్రారంభించినట్లయితే వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు.పనుల నిర్మాణంలో అలసత్వం వహించకూడదని హెచ్చరించారు.అదనపు నిధులు అవసరం ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి మంజూరు చేసేలా ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.అనంతరం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలకు సంబంధించి గోడప్రతులను కలెక్టర్, ఎమ్మె ల్యే,అధికారులు ఆవిష్కరించారు.ఈ సమీక్షా సమావేశం లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్, డిఎఫ్ఓ ,ఆర్‌డిఓ రత్నకళ్యాణి,మండల ప్ర త్యేక అధికారి జీవ రత్నం,వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## సమాజానికి మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




ప్రజాపక్షం/నస్పూర్:వైద్య కళాశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025 సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి మంచి వైద్య నైపుణ్యం, విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, వసతి గృహంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 31 నాటికి గుడిపేటలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో 300 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జిల్లాలోని లక్షెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతిరోజు దాదాపు 500 మంది ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆసుపత్రులు, వైద్య కళాశాల ద్వారా సమీప జిల్లాల నుండే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, సిబ్బందిని నియమించడం జరుగుతుందని, పీడియాట్రీషియన్, అనస్తీసియా, ఇతర వైద్య నిపుణులను తయారు చేసి ప్రజలకు సేవలు అందించడం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా మెడికల్ కౌన్సిల్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, నిరుపేదలకు వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## 'ఉజ్వల' లబ్ధిదారుల ఎంపికపై అవగాహన

ప్రజాపక్షం/ ఆసిఫాబాద్:ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద ఎల్‌పిజి గ్యాస్ లబ్ధిదారుల ఎంపికపై విస్తృత అవగాహన చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి ప్రధానమంత్రి ఉజ్వల పథకంపై పౌరసరఫరాల శాఖ అధికారులు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, రవాణా, వ్యవసాయ, మత్స్య శాఖల అధికారులు, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద పేదవారికి ఉచితంగా ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లు అందిస్తుందని, అర్హులైన వారిని గుర్తించడంలో సంబంధిత శాఖల అధికారులు విస్తృతంగా అవగాహన పరచాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యుల ద్వారా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని, ఉజ్వల సిలిండర్ అనర్హుల చేతిలో ఉంటే సమగ్ర విచారణ జరిపి తొలగించాలని, ఆదాయం, భూ విస్తీర్ణం వాహనాలు కలిగిన యజమానుల వివరాలు సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మి, రవాణా శాఖ అధికారి రామ్ చందర్, వ్యవసాయ శాఖ అధికారి వెంకటి, మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, తహసిల్దార్లు, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రూ. 60 లక్షలతో 'ఇంద్రేశం' రహదారి మరమ్మతులు

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



ప్రజాపక్షం/ పటాన్‌చెరు:శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నుండి ఇంద్రేశం మీదుగా పెద్ద కంజర్ల వరకు గల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు అతి త్వరలో హెచ్ఎండిఏ ద్వారా రహదారి విస్తరణ పనులు చేట్టనున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్‌చెరు పరిధిలోని ఒఆర్‌సర్వీస్ రోడ్డు నుండి ఇంద్రేశం మీదుగా పెందకంజర్ల వరకు 60 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న బిట్ ప్యాచ్ వర్క్ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరు పట్టణానికి ఇంద్రేశం పట్టన్చెరు పట్టణానికి ఇంద్రేశం తో పాటు రమేశ్వరం బండ, పెద్ద కంజర్ల, చిన్న కంజర్ల, ఐనోలు, లచ్చు గూడెం, పోచారంతో పాటు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ రహదారినే వినియోగిస్తారని తెలిపారు. గతంలో ఇంద్రేశం నుండి పెద్ద కంచెర్ల వరకు 22 కోట్ల రూపాయలతో రహదారి విస్తరణ పనుల కోసం కేటాయించడం జరిగిందని తెలిపారు. అనివార్య కారణాల వలన నిధుల కేటాయింపు రద్దు కావడం మూలంగా తిరిగి రహదారి మరమ్మతులుచేపట్టారని ప్రస్తుత ప్రభుత్వంలోని మంత్రులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. అతి త్వరలో రహదారి విస్తరణ ,పనులు సైతం ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి 20 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో బీటీ ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఏ ఈ చంద్రశేఖర్, ట్రాఫిక్, సిఐ లాలు నాయక్, మాజీ ప్రజాప్రతినిధులు అంతిరెడ్డి ,బండి శంకర్, దుర్గారెడ్డి, రామచందర్ ,సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దిలావర్‌పూర్ కళాశాల తనిఖీ..

### విద్యార్థులకు,అధ్యాపకులకు కీలక సూచనలు..



ప్రజాపక్షం/దిలావర్‌పూర్:మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురాం ఈ రోజు తనిఖీ చేశారు.ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఆదేశాల మేరకు ఆయన ఈ తనిఖీ చేపట్టారు.ప్రతి తరగతి గదిలోని విద్యార్థులతో నేరుగా మాట్లాడారు.ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.వార్షిక పరీక్షలకు కేవలం 100 రోజులు మాత్రమే సమయం ఉన్నందున,విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు పూర్తి స్థాయిలో,ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని ఆయన సూచించారు .ఈ సందర్భంగా ఆయన కీలక అంశాలపై సూచనలు చేశారు.విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి తీసుకున్నారు.ఇప్పటివరకు ఎంత శాతం సిలబస్ పూర్తి చేయడం జరిగింది అనే వివరాలు అడిగారు.వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని 90 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేయడం జరిగిందా అని ప్రశ్నించారు.విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచడానికి,ఎక్కువ సంఖ్యలో స్లిప్ టెస్టులు నిర్వహించాలని సూచించారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 9,10వ తరగతి విద్యార్థులను కలిసి,వారికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సౌకర్యాలు,అందిస్తున్న గ్రూపుల వివరాలను తెలియజేయాలని మాధ్యమిక అధికారి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్‌తోపాటు అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు సమాన అవకాశాలు



### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రజాపక్షం/ సంగారెడ్డి :మానసిక వికలాంగత అభివృద్ధి ఆలస్యం ఉన్న పిల్లలకు సమాన అవకాశాలు కల్పించడం మనందరి బాద్యత అని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని హస్టల్ గడ్డలో ఉన్న సహారా ప్రాథమిక పునరావాస కేంద్రం (ఎస్ఆర్‌హెచ్‌సి) లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి సమగ్ర పునరావాస కేంద్రాలు ఏర్పాటు తో వికలాంగత పిల్లలు ప్రయోజనం కలుగుతందన్నారు. పిల్లల కోసం సంస్థ చేపడుతున్న పీజియోథెరఫీ స్పీచ్ థేరపీ, బిహేనియర్ థెరఫీ, ఆక్యుపేషనల్ థెరపీ, వంటి సేవలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజంలోని అంచున ఉన్న పిల్లలకు ప్రేమ ,శ్రద్ధ ,విద్య ,ఆరోగ్యం, అందించాలనే సంకల్పాన్ని బలపరుస్తూ సహారా కేంద్రం సేవలు వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నాయని కలెక్టర్ అన్నారు. సహారా కేంద్రం ఆదర్శప్రాయంగా ఉందని అభిప్రాయపడ్డారు. సహారా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రతిమా రెడ్డి, డైరెక్టర్ శంకర్లు, కేంద్రం కార్యకలాపాలను కలక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో సంబందిత శాఖ అధికారులు ,తల్లిదండ్రులు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు పోలీసుల ప్రయత్నాలు





### జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్

ప్రజాపక్షం/నేరడిగొండ:జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికను రూపొందించే అవలంబందించడం జరుగుతుందని జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలియజేశారు.వారం రోజుల పాటుగా జరుగుతున్న ఈ రోడ్డు ప్రమాదాల నివారణపై ఈ రోజు ఇచ్చోడ సర్కిల్ పరిధిలోని జాతీయ రహదారి ఆదిలాబాద్ జిల్లాలో కలిగిన 3 మండలాల లో జిల్లా ఎస్పి,ఉట్నూర్ అదనపు ఎస్పి కాజల్ సింగ్ తో కలిసి రెండు సంవత్సరాలుగా జరిగిన ప్రమాదాల ప్రదేశాలను సందర్శించి ప్రమాదాలు జరిగిన కారణాలు వాటికి నివారించేందుకు చేయవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో రెవెన్యూ,పంచాయతీరాజ్,నేషనల్ హైవే అథారిటీ,కాంట్రాక్టర్స్ తో పాటుగా పోలీసు అధికారులతో ప్రమాదాల స్థలాలను పరిశీలించి సిబ్బందికి,అధికారులకు ప్రమాదాల నివారణకు చేయవలసిన సూచనలు చేయడం జరిగింది.ముఖ్యంగా గుడిహత్నూర్, ఇ చ్చోడ,నేరడిగొండ,మండలాలలోని దేవాపూర్ ఎక్స్ రోడ్,వాగాపూర్ ఎక్స్ రోడ్,గుడిహత్నూర్ బస్టాండ్,గాంధీనగర్,కుప్టి,బంధం ఎక్స్ రోడ్,ఆరెపల్లి,రో ల్ మామడా,బోరేగాం,కొల్లారి ఎక్స్ రోడ్,సీత గొంది గ్రామము,మేకల గండి ప్రదేశాలలో ఎక్కువగా ప్రమాదాలు జరిగిన కారణంగా ప్రదేశాలను సదర్శించడం జరిగింది.అదేవిధంగా గత సంవత్సరాలుగా జరిగిన ప్రమాదాల విశ్లేషణ చేసి ఇకముందు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రమాదాలు జరగకుండా నేషనల్ హైవేకు వేగ నియంత్రణ చేసేందుకు రంబుల్ స్ట్రిప్స్,అప్రోచ్ రోడ్ల నందు స్పీడ్ బ్రేకర్లను చేయాలని,నిర్మాణ ప్రదేశాలలో తగు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని,మరమ్మత్తులు జరుగుతున్న రోడ్ల నందు కచ్చితంగా మనుషులను ఏర్పాటు చేసి 24 గంటలు పర్యవేక్షించాలని,రాత్రి సమయాలలో కనిపించే విధంగాఇ రేడియం తో స్టిక్కర్లను ఏర్పాటు చేసే ప్రమాదాలు జరగకుండా నివారించాలని సూచించారు. ము ఖ్యంగా ఎక్కువ వేగంగా వెళ్లే దారులలో వేగ నియంత్రణకు,ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని,హైవేపై స్పీడ్ లేజర్ గన్ లను ఏర్పాటు చేసి వేగ నియంత్రణ చేయాలని తెలిపారు.రాత్రి సమయాలలో గ్రామాలను పట్టణాల నందు ప్రవేశిస్తున్న జాతీయ రహదారులలో లైట్ల ఏర్పాటు ఉండాలని తెలిపారు.ప్రమాదాలను నివారించే ప్రాణ నష్టాన్ని తగ్గించడమే జిల్లా పోలీసుల ప్రధాన ధ్యే యం గా,ప్రజల రక్షణకై పోలీసు వ్యవస్థ అహర్నిశలు కష్టపడుతుందని తెలిపారు.ఎలాంటి రోడ్డు ఇంజనీరింగ్ సమస్యలు ఉన్న ప్రమాదాలకు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ రోడ్డు ని ర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఉట్నూర్ అదన పు ఎస్పికాజల్ సింగ్ ఐపీఎస్,ఇచ్చోడా సిఐ బం డారి రాజు,ఎ స్ఐలు ఎల్ శ్రీకాంత్,వి.పురుషో త్తం, ఇమ్రాన్ సిబ్బందిపాల్గొన్నారు.

# క్రీడ



## రోహిత్ శర్మ విజయ్ హజారే ట్రోఫీలో ఆడతాడా?

### కీలక సమాచారం అందించిన ఎంసిఎ!

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ త్వరలో జరుగనున్నవ విజయ్ హజారే ట్రోఫీలో అందుబాటులో ఉంటాడని, ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కి సమాచారం అందించినట్లుగా వార్తలు వచ్చాయి. అయితే, మీడియా నివేదికలను ఎంసిఎకు చెందిన ఓ అధికారి తోసిపుచ్చారు. విజయ్ హజారే ట్రోఫీలో ఆడడంపై రోహిత్ నుంచి ఎలాంటి అప్‌డేట్ రాలేదని ఆయన జాతీయ మీడియా సంస్థకు తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి చర్చలు జరగలేదన్నారు. వాస్తవానికి, వన్డే క్రికెట్‌లో కొనసాగాలనుకుంటే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ దేశీయ టోర్నీలో ఆడాలని బిసిసిఐ సూచించిందని పలు నివేదికలు తెలిపాయి. ఈ విషయంలో ఎంసిఎకు రోహిత్ సమాచారం అందించాడని పేర్కొన్నాయి. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ బ్యాట్‌తో రాణించాడు. ఈ సిరీస్‌ను భారత్ 2–1 తేడాతో ఓడిపోయినప్పటికీ.. రోహిత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందుకున్నాడు. ఈ సిరీస్‌లో ఓ సెంచరీ, హాఫ్ సెంచరీ సహాయంతో మూడు మ్యాచుల్లో 202 పరుగులు చేశాడు. చివరి మ్యాచ్‌లో అజేయంగా 121 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక త్వరలో భారత జట్టు దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడుతుంది. తొలి మ్యాచ్ నవంబర్ 30న రాంచీలో జరుగుతుంది. రెండు, మూడో వన్డే డిసెంబర్ 3, 6 తేదీల్లో జరుగుతాయి. దేశవాళీ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచులు డిసెంబర్ 25 నుంచి జనవరి 18 మధ్య జరుగుతుంది. ఈ టోర్నీలోని అన్ని మ్యాచులు అహ్మదాబాద్, రాజ్‌కోట్, జైపూర్, బెంగళూరులో జరుగనున్నాయి. ఈ డొమెస్టిక్ టోర్నీలో రోహిత్, కోహ్లీ ఆడతారా? లేదా? అన్నది ప్రస్తుతానికి స్పష్టత లేదు. కానీ, కొద్దిరోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## క్వార్టర్స్‌కు దూసుకెళ్లిన లక్ష్యసేన్

### రెండో రౌండ్‌లో ప్రణయ్ ఓటమి..



ఈ సీజన్‌లో చెలరేగిపోతున్న లక్ష్యసేన్ జపాన్‌లో తనఫామ్ చూపిస్తున్నాడు. కుమమొటో మాస్టర్స్‌లో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో అతడు సింగపూర్ షట్లర్ జియా హెంగ్ జాసన్‌ను చిత్తు చేశాడు. మరో భారత ఆటగాడు హెచ్‌ఎస్ ప్రణయ్ కథ రెండో రౌండ్‌లోనే ముగిసింది. వరుస సెట్లలో విఫలమైన అతడు చేతిలో కంగుతిన్నాడు. క్వార్టర్స్‌లో అడుగుపెట్టడం ద్వారా పురుషుల సింగిల్స్‌లో భారత పతకం ఆశలను లక్ష్యసేన్ సజీవంగా ఉంచాడు. ఏడోసీడ్ అయిన లక్ష్యసేన్ కుమమొటో మాస్టర్స్‌లో తన తడాఖా చూపించాడు. తొలి రౌండ్ నుంచి దుమ్మురేపుతున్న భారత షట్లర్ ప్రీ క్వార్టర్స్‌లో జియా హెంగ్ జాసన్( సింగపూర్)ను మట్టికరిపించాడు. 39 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు సేన్. తొలి సెట్‌ను 21–13తో అలవోకగా గెలుచుకున్న అతడు.. రెండో సెట్‌ను సైతం 21–11తో సొంతం చేసుకున్నాడు. సెమీస్ బెర్తు కోసం 2021 వరల్డ్ ఛాంపియన్ లేహ్ కీన్ యెవ్‌తో లక్ష్యసేన్ తలపడనున్నాడు. మరోవైపు ప్రణయ్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. తొలి రౌండ్‌లో పర్వలేదనిపించిన అతడు ఈసారి డెన్మార్క్ షట్లర్ రాస్మస్ గెమ్కే ధాటికి చేతులెత్తేశాడు. రెండు సెట్లలో వెనకబడిన ప్రణయ్ చివరకు 18–21, 15–21తో ఓటమి పాలయ్యాడు.

## ఆల్‌రౌండర్ ఈజ్ బ్యాక్!

టీ20 ప్రపంచ కప్ 2026లో తమ టైటిల్‌ను కాపాడుకోవడానికి భారత్ సిద్ధమవుతోంది. ఈ మెగా టోర్నమెంట్‌కు సన్నద్ధమయ్యేందుకు మెన్ ఇన్ బ్లూ అనేక వైట్ బాల్ సిరీస్‌లకు సిద్ధమవుతున్నారు. అయితే ఆసియా కప్ 2025 సమయంలో హార్దిక్ పాండ్యా క్వాడ్రిసెప్స్ కండరాల గాయంతో జట్టుకు బిగ్ షాక్ తగిలింది. అప్పటి నుంచి హార్దిక్ పాండ్యా పాకిస్తాన్‌తో జరిగిన కీలక ఫైనల్‌తో పాటు ఆస్ట్రేలియా పర్యటనకు దూరమయ్యాడు. ఇప్పుడు టీమిండియాకు గుడ్ న్యూస్ వచ్చింది. హార్దిక్ పాండ్యా టీ20 ప్రపంచ కప్‌కు చాలా ముందుగానే తిరిగి రావడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆసియా కప్ 2025 సెమీఫైనల్లో శ్రీలంకతో జరిగిన మ్యాచ్ తర్వాత హార్దిక్ పాండ్యా తొలిసారిగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరపున ఆడనున్నాడు. ఈ దేశీయ టీ20 టోర్నమెంట్‌లో హార్దిక్ పాండ్యా మొదటి రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడు. ఆ తర్వాత రాబోయే దక్షిణాఫ్రికాతో వన్డే, టీ20 సిరీస్‌లలో టీమిండియాలోకి తిరిగి వస్తాడు.

### కోలుకుంటున్న హార్దిక్ పాండ్యా

హార్దిక్ పాండ్యా ప్రస్తుతం బెంగళూరులోని బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సిఎ)లో కోలుకుంటున్నాడు. నవంబర్ 26న బెంగాల్‌తో జరిగే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ప్రారంభ మ్యాచ్‌కు హార్దిక్ ఫిట్‌గా ఉంటాడని ఓ నివేదిక పేర్కొంది. ఒకవేళ ఏమైనా ఆలస్యమైతే, నవంబర్ 28న పుదుచ్చేరితో జరిగే టోర్నమెంట్ రెండో మ్యాచ్ నాటికి ఈ స్టార్ ఆల్‌రౌండర్ ఖచ్చితంగా యాక్షన్‌లోకి తిరిగి వస్తాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత హార్దిక్ పాండ్యాకు ఎటువంటి విశ్రాంతి ఉండదు. బరోడా తమ అన్ని మ్యాచ్‌లను ఆడనున్న హైదరాబాద్‌కు పాండ్యా నేరుగా చేరుకుంటాడు. హార్దిక్ పాండ్యా చివరగా ఆడిన ఆసియా కప్ 2025 టోర్నమెంట్ అతనికి అంతగా కలిసి రాలేదు. ఐదు మ్యాచ్‌లలో కేవలం 48 పరుగులు చేసి, 4 వికెట్లు మాత్రమే తీయగలిగాడు.



# ఫోకస్

## వారసత్వాన్ని మిగిల్చాలి..



వృద్ధాప్యం ముంచుకొచ్చే ముందు వారసత్వాన్ని భావితరాలకు అందించేలా జీవితాన్ని సాగించాలి. కానీ, చాలా మందికి అలాంటి అవకాశాలు లేవు... రావు.. చదువు, ఉద్యోగం, పెళ్లి, పిల్లలు, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలోనే సంవత్సరాలు గడిచిపోతాయి. వెనక్కు తిరిగి చూసుకుంటే, తమ కంటూ కేటాయించుకున్న సమయం చాలా తక్కువని అర్థమవుతుంది. కానీ, అప్పటికీ వృద్ధాప్యంలోకి అడుగుపెట్టడంతో, ఏమీ చేయలేమన్న ఆలోచన మనస్సులను తొలిచేస్తుంది. కానీ, ఈ సమయంలోనే మరింత చురుగ్గా ఉండాలి. మిగిలిన జీవితాన్ని స్ఫూర్తివంతంగా... మరింత అర్థవంతంగా మార్చుకోవాలి. ఒక వ్యక్తి యొక్క వారసత్వం అనేది అతను మరణించిన తర్వాత ఇతరుల హృదయాలలో మిగిలే జ్ఞాపకం.. భావితరాలపై అతని ప్రభావం. 'నేను ఇప్పుడు నా జీవిత చివరి దశలో ఉన్నాను' అనే భావం నిరాశను, నిరాసక్తతను పెంచుతుంది. కాబట్టి, అలాంటి ఆలోచనలు దరిచేరనీయకండి. పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, పది మందికి సహాయపడడం మంచిది. అపారమైన ప్రేమ, కరుణ, సానుకూల దృక్పథం పెంచుకోవాలి. మనిషి ఎప్పుడూ పరిపూర్ణుడుకాదు. కాబట్టి జీవితంలో చేసిన తప్పులను కొంతవరకైనా సరిదిద్దుకోవడానికి వృద్ధాప్యాన్ని మించిన సరైన సమయం మరొకటి లేదు. మృదు స్వభావులుగా మారడం అత్యవసరం. నిజాయితీ, అంతర సౌందర్యం, వ్యక్తిత్వం వంటి లక్షణాలను యువతలో పెంపొందించప చేయడానికి ప్రయత్నించాలి. మనవళ్ల జీవితాల్లో తాతయ్య, అమ్మమ్మల పాత్ర ఎంతో ముఖ్యమైనదని నిరూపించాలి. మన చిన్ననాటి విలువలను వారితో పంచుకోవాలి. మన జీవితాలు ఇతరులపై ఏ ప్రభావం చూపుతాయో మనకు ఎప్పుడూ తెలియదు. అందుకే, సాధ్యమైనంత వరకూ సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించాలి. భవిష్యత్ తరాలకు మార్గదర్శకులం కావాలి.

## దివ్యాంగులు



## ఆధారపడడం తగ్గించాలి..

తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులపై ఆధారపడడాన్ని దివ్యాంగులు సాధ్యమైనంత వరకూ తగ్గించుకోవాలి. వీలైతే మానుకోవాలి. తల్లిదండ్రుల సంరక్షణలో సంవత్సరాలు గడిపిన వారు, ఏదో ఒక రోజు ఒంటరిగా మిగిలిపోయినప్పుడు సమస్యలు చుట్టుముడతాయి. అప్పటి వరకూ ఉన్న రక్షణ కవచం చెదిరిపోతుంది. అందుకే నిరంతరం కొత్త మార్గాలను అన్వేషిస్తూ, స్వతంత్రంగా పనులు చేసుకోవడం చిన్నప్పటి నుంచే అలవాటు చేసుకోవాలి. తల్లిదండ్రులు సహజంగానే తమ పిల్లలు, ప్రత్యేకించి దివ్యాంగులైన పిల్లల పట్ల ఎంతో ఆప్యాయతను కనబరుస్తారు. వారిని సంరక్షించుకుంటారు. కానీ, వృద్ధాప్యం లేదా ఆరోగ్య సమస్యలు లేదా మరే ఇతర సమస్యల కారణంగా వారు సంరక్షణ బాధ్యతలను నిర్వహించలేకపోతే, పరిస్థితి ఏమిటనేది ప్రశ్న. వారి నుంచి సహాయం తగ్గిపోతున్నప్పుడు కొత్త మార్గాలను అన్వేషించక తప్పదుకదా! వృద్ధ తల్లిదండ్రులపై ఆధారపడే సంరక్షణ ఎప్పటికీ కొనసాగదు... కాబట్టి ముందుగానే మార్పులను ప్రణాళిక చేసుకోవడం చాలా అవసరం. ఇది చేదైన వాస్తవం.

## సీనియర్ సిటిజన్స్



## అంతులేని నిర్లక్ష్యం!

వృద్ధుల పట్ల దేశంలో అంతులేని నిర్లక్ష్యం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా పెన్షన్ వంటి అత్యంత కీలకమైన అంశాల్లో ప్రభుత్వాలు, అధికార యంత్రాంగాలు సరిగ్గా స్పందించడం లేదని నివేదికలు సైతం స్పష్టం చేస్తున్నాయి. తాజా ప్రపంచ పెన్షన్ సూచీలో భారత్ అత్యం కనిష్టంగా 'డి' గ్రేడ్‌లో ఉందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. వృద్ధుల పెన్షన్ పరిధి దేశంలో చాలా తక్కువగా ఉందనేది నిజం. ఒకపక్క వృద్ధులు చెల్లించాల్సిన ఆరోగ్య ఖర్చులు, సాధారణ ఖర్చులు పెరిగిపోతున్నాయి. మరోపక్క చాలా మందికి పెన్షన్ లభించడం లేదు. పెన్షన్ దారుల్లో అత్యధిక శాతం మందికి నామమాత్రపు చెల్లింపులే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వృద్ధులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతం. ఈ సమస్యను నివారించి, వృద్ధాప్యంలో గౌరవంగా, ఆర్థికంగా స్థిరంగా ఉండేలా చూడడం ప్రభుత్వాలు, సామాజిక సంస్థల బాధ్యత కావాలి. సాధారణంగా వృద్ధుల పరిస్థితిలో కొంత మంచి, కొంత బాధాకరమైన భాగాలు మిశ్రమంగా ఉన్నాయి. దురదృష్టవశాత్తు మన దేశంలో మంచి కంటే సమస్యలే ఎక్కువ. ప్రాణం ఉన్నది కాబట్టి బతుకుతున్నాం అనే పరిస్థితి నుంచి చివరి క్షణం వరకూ సుఖంగా బతకగలుతాం అనే భరోసాతో వృద్ధులు నిలువగలిగిన రోజునే, దేశానికి మంచి రోజులు వచ్చాయని అనుకోవాలి. లేకపోతే, సమస్యలు తీరవు. వృద్ధుల బతుకులు మారవు.



# శత వసంతాల సభకు భారీగా తరలుదాం

### సిపిఐ నేతల పిలుపు
### జిల్లాలలో జరిగే బస్సు యాత్ర విజయవంతానికి కృషి

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగే సభకు భారీగా తరులుదామని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎల్కతుర్తి మండలం కేంద్రంలో శనికరపు రాజకుమార్ అధ్యక్షతన ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్, హసన్ పర్తి సిపిఐ మండలాల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి కర్రే భిక్షపతి హాజరై మాట్లాడుతూ ఖమ్మం సభ విజయవంతానికి హనుమకొండ జిల్లాలో ఈనెల 18, 19 తేదీలలో ముల్కనూర్ ఎల్కతుర్తి హసన్ పర్తి, హనుమకొండ,దామెర, శాయంపేట, పరకాల మీదుగా జరిగే బస్సుజాతాకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగే సిపిఐ రాష్ట్ర బస్సు జాతాకు సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కలవేణి శంకర్, నాయకులు మార్వాక అనిల్ కుమార్, మణికంఠరెడ్డి నాయకత్వం వహిస్తారన్నారు,సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు,కరే లక్ష్మణ్, శంకరప్ప, రాజ్‌కుమార్, నేదునూరి రాజమౌళి, జక్కు రాజుగౌడ్, మంచాల రమాదేవి, నకిర్తి ఓదెలు, నెట్టం నారాయణ, మెట్టు శ్యామ్‌సుందర్‌రెడ్డి, మోత లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్‌లో..

**రామకృష్ణాపూర్ :** సిపిఐ 100 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే ముగింపు సభను విజయవంతం చేయాలని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కోరారు. ఈనెల 15 నుంచి కొమరం భీం జిల్లా ఆసిఫాబాద్ జోడేఘాట్ నుంచి భద్రాచలం వరకు జరిగే బస్సు జాతాకు ఘనంగా స్వాగతం పలకాలని పార్టీ నాయకులను కోరారు. రామకృష్ణాపూర్ యూనియన్ కార్యాలయంలో బస్సు జాతా కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. జోడేఘాట్ నుంచి ప్రారంభమయ్యే బస్సు జాతను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి, వనం సత్యనారాయణ, మామిడి గోపి, పార్టీ నాయకులు పోతర్ల రాములు, కె దేవానంద్, పొలవేన చందర్, మద్దెల శంకర్, జీలకర్ర మురళి తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ సిటీ :** భారత కమ్యూనిస్టుపార్టీ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని నవంబర్ 15 నుంచి జోడేగడ్‌లో ప్రారంభమై భద్రాచలం వరకు జరిగే ప్రచారజాత ఈనెల 17న కరీంనగర్ జిల్లాలోకి ప్రవేశిస్తుందని, రెండు రోజుల పాటు జిల్లాలో నిర్వహించే ప్రచారజాతాలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం సిపిఐ నగర శాఖ కార్యదర్శుల సమావేశం పైడిపల్లి రాజు అధ్యక్షతన జరిగింది. సమావేశంలె పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ 17న మద్యాహ్నం కరీంనగర్‌కు జాతా చేరుకుంటుందని, కరీంనగర్, తిమ్మాపూర్, చిగురుమామిడి, 18న సైదాపూర్, హుజురాబాద్ మండలంలో సాగుతుందని, జాతాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, కార్యదర్శులు బీర్ల పద్మ, కొట్టె అంజలి, ఎలిశెట్టి భారతక్క, గామినేని సత్యం, కసిబోజుల సంతోష్ చారి, చంచల మురళి, బాకం ఆంజనేయులు, మాడిశెట్టి అరవింద్, ఆకునూరి రమేష్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** జిల్లాలో జరిగే సిపిఐ ప్రచార జాతాలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ కోరారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌నుద్దేశించి సుధాకర్ మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర బస్సుజాతా 15న బాసర నుంచి ప్రారంభమై ఆర్సపల్లి చేరుకుంటుందని ఆర్సపల్లి నుంచి ర్యాలీగా గాంధీ గంజ్ చేరుకుని సభ నిర్వహించుకోవటం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ నాయకులు మాజీ ఎంపి అజీజ్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ, నాయకులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని పార్టీ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని బస్సు జాతాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఓమయ్య, రఘురాం, హన్మాండ్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తిలో..



కరీంనగర్‌లో..





నిజామాబాద్‌లో..

# కార్మికుల హక్కులు, సంస్థ పరిరక్షణకు కృషి



### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కార్మికుల హక్కులు, సంస్థ పరిరక్షణకు ఎఐటియుసి కృషి చేస్తుందని, సింగరేణి వ్యాప్తంగా ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న 86మంది ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందని సింగరేణి కాలరీస్‌వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. గురువారం గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఎఐటియుసి గెలిచిన తరువాత పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను ఒక్కటొక్కటిగా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం హాస్పిటల్‌లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు.

### సమస్యల పరిష్కారమే ధ్యేయం

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే ధ్యేయమని వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సొంత ఇంటి పథకం అమలుకు విధివిధానాలను ఖరారు చేసి అమలు చేసేందుకు యాజమాన్యం ఇటీవలే జరిగిన స్ట్రక్చ ర్ సమావేశంలో అంగీకరించిందని ఆయన తెలిపారు. సింగరేణిలో మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్స్, సూపర్ వైజర్లను సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇచ్చేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. కొన్ని నెలలుగా నిలిచిన మెడికల్ బోర్డును నిర్వహించేందుకు అంగీకరించిందన్నారు. సింగరేణిలో మెడికల్ ఫిట్ ఐన కార్మికుల పిల్లలకు ఉద్యోగ నియామక పత్రాలు ఈనెల 16న కొత్తగూడెంలో ఇచ్చేందుకు అంగీకరించిందని తెలిపారు. క్రమశిక్షణ చర్యల కింద యాజమాన్యం జారీ చేసిన 150 మస్టర్ల సర్క్యులర్‌ను అమలు చేయడంలో కార్మికులపై ఒత్తిడి చేయబోమని యాజమాన్యం అంగీకరించిందన్నారు. సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లాగౌడ్, వై.వి.రావు, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, కార్మిక నాయకులు మాదన మహేష్, రంగు శ్రీను, దాసరి అనిల్, వేముల అశోక్, విజయ లక్ష్మి, సంతోష్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాదానికి వ్యతిరేకంగా జనసేవా దళ్ పోరాటం

### పంజాల రమేష్

**ప్రజాపక్షం/నర్సంపేట :** మతోన్మాదానికి వ్యతిరేకంగా జనసేవా దళ్ కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని సంఘం రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ అన్నారు. జనసేవా దళ్ వరంగల్ జిల్లా శిక్షణ శిబిరం గురువారం రెండవ సిటీ గ్రౌండ్‌లో జరుగుతున్న సందర్భంగా పంజాల రమేష్ మాట్లాడుతూ మతోన్మాదులు వామపక్ష అభ్యుదయ భావాలు కలిగిన దళిత, మైనార్టీ మహిళలపై దాడులు చేస్తూ హిందూ మత భావాలను బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నాలు చేస్తూ, లౌకిక వ్యవస్థను, రాజ్యాంగాన్ని కించపరుస్తుందన్నారు. అలాంటి శక్తులతో పోరాడేందుకు జనసేవా దళ్ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. విపత్కర పరిస్థితులు, సునామీలు, తుఫాన్లు, వరదలు, అగ్ని, రోడ్డు, రైలు ప్రమాదాల జరిగినప్పుడు ప్రజలకు అండగా నిలబడి సహాయ సహకారాలు అందించేందుకు, పార్టీ సభలు, సమావేశాలు, ప్రదర్శనలు జరిగినప్పుడు ప్రజలను క్రమశిక్షణతో నడిపిస్తూ, పార్టీ నాయకులకు రక్షణగా నిలబడి పనిచేసే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.బాష్ మియా మాట్లాడుతూ సిపిఐ వంద సంవత్సరాల ముగింపు సభకు 15 వేల మంది జనసేన కార్యకర్తలతో ఎర్ర దండు కవాతు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, బుస్స రవీందర్, కందిక చెన్నకేశవులు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి ల్యాదల్ల శరత్, ఓర్సు రాజు, యండి అక్బర్ పాషా, పాలక కవిత, దామేర కృష్ణ, తాళ్లపల్లి రాహేలా, దస్రు, పరికిరాల రమేష్, చిట్యాల సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.





# దేశ రాజకీయాల చరిత్రలో సిపిఐది ప్రత్యేక స్థానం

### యానాల దామోదర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మోటకొండూరు :** దేశ రాజకీయాల చరిత్రలో సిపిఐది ప్రత్యేక స్థానమని పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం మోటకొండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి సంపూర్ణ స్వా తంత్ర్యం కావాలని, కార్మిక, విద్యార్థి, యువజన, రైతు, మహిళ తదితర ప్రజా సంఘాలను నిర్మించి వెట్టిచాకిరి విముక్తి కొరకు కార్మికులు, కర్షకులను దోపిడీ నుండి విముక్తి చేయడానికి సిపిఐ రాజీలేని అనేక పోరాటాలు చేసిందన్నారు. ఈ శతాబ్దికాలంలో ఎన్నో పోరాటాలు అనేక త్యాగాలు ఎంతో మంది అమర వీరులు రక్త తర్పనతో ఎన్నో విజయాలను సాధించి దేశ రాజకీయాల చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ మాట్లాడుతూ ఆనాటి సాయుధ పోరాటంలో అనేక ఉద్యమాలకు, పోరాటాలకు కమ్యూనిస్టులు ఇచ్చిన స్ఫూర్తితో నేటికీ తెలంగాణ అంటే పోరాటాల గడ్డగా బాసిల్లుతున్నదన్నారు. బోడిగే సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మండల కార్యవర్గ సభ్యులు మంచాల రాదమ్మ, బోళ్ల శీను, మండల కౌన్సిల్ సభ్యులు సూదగాని వెంకన్న, పల్లె శీను, సూర్యనారాయణ, షేక్ శంషుద్దీన్, రాంరెడ్డి, గువ్వ వెంకన్న, పల్లె శీను, నాగా చారి, బొంగు బిక్షం, నల్ల బిక్షం, శనిగల భాగ్యమ్మ, మెట్టు యాదయ్య, గంగాపురం అంజయ్య, బీరకాయల మధు, గొట్టి పాముల సునీల్ కుమార్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## అందరూ ఆరోగ్యంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** అందరు ఆరోగ్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఉద్యోగులకు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్వయంగా కలెక్టర్ పర్యవేక్షణ చేయడంతోపాటు తాను కూడా రక్త పరీక్షలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నింటి కన్నా ముందు ఆరోగ్య పరిరక్షణ అనేది చాలా ముఖ్యమైనదన్నారు. ఈ క్యాంపులో మొత్తం 242 మంది జనరల్ ఫిజీషియన్, గైనకాలజీ, చర్మ, గ్యాస్ట్రిక్, తదితర సమస్యలపై కన్సల్టేషన్ చేయించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, జిల్లా పోగ్రాం అధికారులు, ఐడీఓసీ అధికారులు, ఉద్యోగులు, వన్ మేడి హబ్ సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంచాల తిరుపతి యాదిలో స్మారక స్థూపం : ఆదరి శ్రీనివాస్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన దివంగత మంచాల తిరుపతి యాదిలో సిపిఐ ఆధ్వర్యంలో స్మారక స్థూపం నిర్మాణానికి గురువారం నాడు భూమి పూజ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సిపిఐ సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నుంచి మొదలైన తిరుపతి ప్రస్థానం అంచలంచెలుగా ప్రతి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి బలమైన పునాది వేశాడన్నారు. ఈ క్రమంలో నాటి దివంగత ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావు, దివంగత మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి పెద్దలగా రమాదేవితో ఆదర్శ వివాహం చేశారన్నారు. నాటి నుండి తాను మృతి చెందే వరకు నిరుపేద, కార్మిక, కర్షక, మహిళ అభ్యున్నతి కోసం వారి హక్కుల కోసం పోరాటం చేసి అమరుడయ్యాడని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాట్ల వెంకటస్వామి, మాజీ సర్పంచ్ కందె రమేష్, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు వల్లాల రమేష్, సిపిఐ పార్టీ నాయకులు ఆదరి శ్రీనివాస్, స్నేహితులు కందె సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## సోమన్న ఆలయ అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** ప్రసిద్ది గాంచిన పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి దిశగా కీలక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆలయాన్ని సందర్శించి సందర్శించి ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమేశ్వర ఆలయాన్ని భక్తుల ఆధ్యాత్మిక కేంద్రంగా పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. అదేవిధంగా అఖండ జ్యోతి కొత్త నిర్మాణం, అఖండ జ్యోతికి వెళ్లే మార్గంలో మెట్లు ఏర్పాటు, పంచగూళ్ల ఆలయం దగ్గర నుండి గుట్టపైకి ఘాట్ రోడ్ నిర్మాణం, కిచెన్ షెడ్ పెండింగ్‌పనులనుపూర్తిచేయడం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు.

## కరస్పాండెంట్‌పై దాడి హేయమైన చర్య

తీవ్రంగా ఖండించిన ట్రస్మా వడుప్సా జిల్లా కమిటీ



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వడుప్స జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం రోజున ట్రస్మా వడుప్స వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆడెపు శ్యామ్ ఆధ్వర్యంలో శివనగర్‌లోని వందన హైస్కూల్‌ను గురువారం సమావేశం నిర్వహించారు. బుధవారం హన్మకొండలోని స్మైల్ డిజి స్కూల్ కరస్పాండెంట్‌పై పిడిఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు చందా కొరకు వచ్చి దురుసుగా ప్రవర్తించి కరస్పాండెంట్‌ను దుర్భాషలాడుతూ భౌతిక దాడికి దిగడాన్ని ట్రస్మా వడుప్స జిల్లా కమిటీ ముక్త కంఠంతో ఖండిచడం జరిగిందని, ముందుగా వడుప్స జిల్లా కమిటీ సభ్యులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి వందల స్కూల్ గేట్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్మా వడుప్స వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆడెపు శ్యామ్, పిడిఎస్‌యూ సంఘం నాయకులు హన్మకొండలోని స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్‌పై దాడిని ఖండిస్తున్నామని ఇలాంటి దాడులకు పాల్పడడం పిడిఎస్‌యూ నాయకుల దిగజారుడుతనానికి నిదర్శనమని, ఇలాంటివి పునరావృతం కాకుండా దోషులపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా వడుప్స వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అంకం వీరస్వామి, ట్రస్మా వడుప్సా జిల్లా సలహాదారులు కోడెం శ్రీధర్, పొన్నూరు చక్రపాణి, వడుప్స వరంగల్ జోన్ అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్, జిల్లా నాయకులు మడిపల్లి రాజు, నాగపురి కిరణ్ కుమార్, సంగ వెంకట్రాజం, దాసి సతీష్ మూర్తి, వేల్పుగొండ శ్రీనివాస్, గోపు ప్రవీణ్, విలాసాగరం విశ్వనాథం, ముల్క శరత్ బాబు, కుపూరి శ్రీనివాస్, వడిచర్ల శ్రీనివాస్, పిట్టల సురేష్, కనుకుంట్ల వేణుగోపాల్, ఏ చంద్రశేఖర్‌లతో పాటు కరస్పాండెంట్స్‌లు పాల్గొన్నారు.

## కాళోజీ తెలంగాణ ప్రజా గొంతుక

నారాయణరావు వర్ధంతి వేడుకల్లో సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామయ్య

**ప్రజాపక్షం/గూడూరు:** కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల గొంతుక అని సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామయ్య అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికలలో సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్బంగా ఇటీవల మృతి చెందిన అందెశ్రీకి నివాళులు అర్పించి అనంతరం మాట్లాడుతూ కాళోజీ తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమంలో ప్రతిధ్వనిగా రాజకీయ సాంఘీక చైతన్యాలను సమూహారంగా కవిత్వం రాసిన ప్రజాకవి అని అన్నారు. తెలంగాణకు కావాల్సిన హక్కులను అడిగిన ప్రజల మనిషి అని ఆయన గుర్తు చేశారు. అందెశ్రీ తెలంగాణ రచయిత తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం గీతాన్ని రచించడం జరిగిందని అందెశ్రీ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. అయితే 2025 జూన్ రెండున తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదగా కోటి రూపాయల పురస్కారం సైతం అందుకోవడం జరిగిందని అన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తాటి అమృత సామాజిక అధ్యయన వెదిక జిల్లా ఉపాద్యాక్షుడు మూకాళ్ల వెంకన్న ఉపాధ్యాయులు ప్రసాద్ ఆల్ ఇండియా ఆదివాసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకలు అయిలబోయిన వీరయ్య రమాదేవి ఉమా రాణి శ్రీను విజయ అమృత విజయ సుధాకర్ స్వప్న పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు మరింత వేగవంతం

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులు, సెంటర్ల నిర్వాహకులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం, ఎల్కతుర్తి లోని ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సూరారం గ్రామంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలుకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సరైన వసతులు లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తాగు నీరు, నీడ సౌకర్యాన్ని ఏర్పాటు చేయకపోవడంపై నిర్వాహకుల పట్ల కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, కనీస సౌకర్యాలను ఎందుకు కల్పించలేదని నిర్వాహకులను ప్రశ్నించారు. ఎల్కతుర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వరి ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించి కొనుగోలు చేసిన వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు టోకెన్ ఇచ్చిన తర్వాతనే సెంటర్ నిర్వాహకులు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. గన్నీ సంచులు సరిపోను దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉండాలని, గన్ని సంచుల అవసరం మేరకు ఎపిఒకు సమాచారం అందించి ఇండెంట్ పెట్టించాలన్నారు. ప్రతి దాన్యం కొనుగోలు వద్ద తప్పనిసరిగా ధాన్యానికి సంబంధించిన కనీసం మద్దతు ధర, తేమశాతం, తదితర వివరాలు తెలిపే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఆ బ్యానర్ లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన అంశాలపై ఇబ్బందులు ఫిర్యాదుల కోసం రైతులకు ఉపయోగపడే విధంగా కంట్రోల్ రూమ్ నంబర్ ను ఉంచాలన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తప్పనిసరిగా తాగునీరు, నీడ సౌకర్యాలు ఉండాలని, గన్ని సంచులను భద్రపరచుకోవడానికి గది ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని వర్షాల నుండి కాపాడుకోవడానికి టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలన్నారు. ప్యాడి క్లీనర్ల ద్వారా ధాన్యాన్ని క్లీన్ చేసుకునేలా సౌకర్యం ఉండాలన్నారు. రైతులు ధాన్యం తరలింపును సొంత ఖర్చులతో చేయవద్దని, ధాన్యం కాంట పూర్తి కాగానే ప్యాడి ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, స్థానిక తహసీల్దార్ ప్రసాదరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.3

## వంట కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి సీతక్కకు వినతి



**ప్రజాపక్షం/ములుగు:** మధ్యాహ్న భోజనం వంట కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వంట కార్మికులు గురువారం మంత్రి సీతక్కకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మంత్రికి వినతిపత్రం సమర్పించిన అనంతరం మాట్లాడుతూ వంట కార్మికులను తొలగించడంలో భాగంగా హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ అక్షయపాత్రకు ధారాదత్తం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, దాని మూలాన వేలాది మంది వంట కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఉంటుందని, అది రద్దు చేయాలని మంత్రిని కోరారు. దానికి మంత్రి సానుకూలంగా హామీ ఇచ్చారు. అలాగే పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, దానితో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం 10వేల రూపాయల వేతనాలు చెల్లించాలని, మార్కెట్ ధరలకు ప్రభుత్వం ఇస్తున్న ధరలకు పొంతన లేనందున సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజద్ పాష, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సామల రమ, గున్నాల రాజకుమారి, మల్లంపల్లి, ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరు నాగారం, మంగపేట, వెంకటాపురం, వాజేడు నాయకులు పోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి, మాలగాని కమల, పొర రాధ, అంకం పద్మ, ముద్దబోయిన భారతి, సామ సమ్మక్క, రాజకుమారి, గుండ్రెడ్డి శ్రీనివాస్, భవాని, శోభ, అమృత, సుగుణ, స్వరూప, భాగ్య, ఆసరి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి సాదా బైనామాలు త్వరితగతిన పూర్తి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూ భారతి, రెవెన్యూ సదస్సులు, సాదా బైనామా దరఖాస్తులు పరిష్కారంలో ప్రగతి రాకుంటే చార్జెస్ ఫ్రేమ్ చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లను హెచ్చరించారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో భూ భారతి, రెవెన్యూ సదస్సులు, సాదా బైనామా దరఖాస్తులు పరిష్కారంపై అన్ని మండలాల తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, శనివారంవరకు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. లక్ష్యాన్ని పూర్తి చేయని తహసీల్దారులకు చార్జెస్ ఫ్రేమ్ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఆరు నెలలు గడిచినా దరఖాస్తుల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో ప్రగతి కనబడకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని, అవసరమైతే చార్జీలు ఫ్రేమ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను శనివారం నాటికి పూర్తిచేయాలని, రేయింబవళ్లు పని చేసి పూర్తి చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దరఖాస్తులు పరిష్కారంపై ప్రభుత్వం చాలా ఫోకస్ చేస్తున్నదని, ప్రతి వారం సిసిఎల్‌ఏ సమీక్ష నిర్వహిస్తున్నారని జాప్యం చేయొద్దని ఆయన స్పష్టం చేశారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓరవి, అన్నిమండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## కేంద్రం మెడలు వంచైనా బిసి రిజర్వేషన్ సాధిస్తాం

బిసి ధర్మ పోరాట దీక్షలో వక్తలు



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్ర బిసి జెఎసి పిలుపు మేరకు అష్టాంగ కార్యక్రమాలలో భాగంగా విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం... హన్మకొండలోని ఏకశిలా పార్క్ వద్ద బిసి జెఎస్సి వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన బిసిల ధర్మ పోరాట దీక్ష కార్యక్రమాన్ని జరిగింది. ఈ దీక్షను సామాజిక ఉద్యమ నాయకులు కూరపాటి వెంకటనారాయణ మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి బిసిల ధర్మపోరాట దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడారు. దేశంలో ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలతో పాటు ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లతో అగ్రవర్ణాలు కూడా వారి జనాభా ప్రకారం వారికి రిజర్వేషన్లు అనుభవిస్తుంటే, జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బిసిలకు మాత్రం బిసిల జనాభా ప్రకారం రిజర్వేషన్లను కల్పించడంలో అగ్రవర్ణాల పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, బిసిలకు రిజర్వేషన్లను కల్పిస్తే, ఆధిపత్య కులాల పెత్తనం నడవదని భావించి బిసిల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఇక నుండి బిసిలు చేసే ఉద్యమాలతో ఢిల్లీ పెద్దల దిమ్మ తిరగాలేనని ఆయన బిసిలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంనికి మద్దత్తు తెలపడానికి వచ్చిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను తగ్గించి, బిసిలకు తీవ్రమైన అన్యాయం చేసి, భూగర్భంలో కలిసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదింపజేసిన బిసిబిల్లును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుంది.. ఆలా ఐయ్యేతే బిజెపి కాలగర్భంలో కలవడం ఖాయమన్నారు. బిసిలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాతో పాటు చట్టసభలలో రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ అనుకూలమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జనాభా దామాషా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లను కల్పించేందుకు సిద్ధంగా ఉందని, కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. బిసి ధర్మ పోరాట దీక్ష కు మద్దతూగా వచ్చిన, మాజీ స్పీకర్ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూనాచారి, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ అంటూ, బిసిలకు రిజర్వేషన్లను కల్పిస్తామంటూ, ఎన్నికల ముందు వాగ్దానాలను ఇచ్చి బిసిల ఓట్లను దండుకొని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తూతూ మంత్రంగా కులగణన చేసి, బిసిలను మభ్య పెట్టేందుకు అసెంబ్లీలో బిసి బిల్లును ప్రవేశపెడితే తాము మద్దతు ఇచ్చామని, అయినప్పటికీ రాజ్యాంగ సవరణ ద్వారా బిసి బిల్లును 9వ షెడ్యూల్లో చేర్పించి, బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం బిసిరిజర్వేషన్లను అడ్డుకుంటుందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలంటే, అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవ తీర్మానం చేయడం ద్వారా చట్టబద్ధత కలుగదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిలపక్ష నేతలతో ఢిల్లీకి వెళ్లి ప్రధానిని ఒప్పించాలని, లేకుంటే ఇండియా కూటమి పార్లమెంట్ సభ్యులతో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పార్లమెంట్ ను స్తంభింపజేయాలని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బీసీ జేఏసీ నాయకులు కూరపాటి వెంకట్ నారాయణ, డాక్టర్ కూరపాటి రమేష్, వీరస్వామి, గడ్డం భాస్కర్, దాడి మల్లయ్య యాదవ్, బోనగాని యాదగిరి గౌడ్, దొడ్డేపల్లి రఘుపతి, ఎల్లయ్య, సాయిని నరేందర్, తాడిశెట్టి క్రాంతి కుమార్, వల్లాల జగన్, చాపర్తి కుమార్ గాడ్గే, జాగృతి శ్రీశైలం, డాక్టర్ జగదీష్ ప్రసాద్, ఎర్రరాజు బిక్షపతి, చోళ్ళేటి కృష్ణమాచారి, గిరిబోయిన రాజయ్య యాదవ్, చంద మల్లయ్య, అరె కటిక సురేష్, వేముల మహేందర్ గౌడ్, కాసగాని అశోక్ గౌడ్, భీమగాని యాదగిరి గౌడ్, గొట్టే మహేందర్, తేల్లా సుగుణ, కిషోర్, చాగంటి రమేష్, మౌనిక తదితరులు ఈ దీక్ష లో పాల్గొన్నారు.

## కలగానే మిగిలిన బిసి కులగణన

బిసి టిజెఎసి మహబూబాబాద్ జిల్లా చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణ



**ప్రజాపక్షం/గూడూరు:** స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ బిసి కులగానే మిగిలిపోయిందని దేశ జనాభాలో 75 శాతం ఉన్న బిసిలకు రాజ్యాధికారం ఆమడ దూరంలో ఉందని టిజెఎసి మహబూబాబాద్ జిల్లా చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన బిసి ధర్మపోరాట దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బిసిలకు రాజ్యాధికారం జనాభాకు అనుగుణంగా చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే పార్లమెంటులో బిసి బిల్లు ఆమోదం ద్వారానే సాధ్యమవుతుందని దాని కోసం జాతీయ స్థాయి ఉద్యమాన్ని నిర్మించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. దేశంలో అత్యధిక ఓటర్లు బిసి కులాలకు చెందిన వారే అని ఈవిషయం పాలకవర్గ ప్రభుత్వాలకు తెలిసినప్పటికీ రాజ్యాధికారం ఇవ్వడానికి మాత్రం అంగీకరించారు. బిసికులగన విషయంలో ప్రజలను మభ్యపెడుతూ మరిపించి మురిపించే ప్రయత్నం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. బిసిలను కేవలం ఓటు బ్యాంక్ లాగానే వాడుకుంటున్నారు. తప్ప బిసిలకు రాజ్యాధికారం కలగానే మిగిలిపోయిందని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలో 1931లో తొలిసారిగా జనాభా లెక్కల సేకరణ ప్రారంభమైందని ఆ సమయంలో మన దేశానికి అన్ని ఆధారాలు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి జెఎసి రాష్ట్ర జిల్లా నాయకలు ముంజాల రాజేందర్ పెద్దకాసు కుమారస్వామి వేముల వెంకన్న జెర్రిపోతుల వెంకన్న పింద్రాల రాందాస్ పుట్ట అయిలయ్య పోడిశెట్టి సురేష్ సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పార్నంది రామయ్య టిడబ్ల్యుజెఎ జిల్లా అధ్యక్షుడు బానోత్ లక్ష్మ ణ్ నాయక్ బిసి జెఎసి మండల చైర్మన్ చీర బిక్షపతి కన్వీనర్ కట్ల విష్ణు టియూడబ్ల్యూజె (ఐజెయు) మండల అధ్యక్షుడు గుర్రపు యాకాం బ్రం జిల్లా ఉపాధ్యక్షులు ముక్తవరం సత్యనారాయణ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రావుల సత్యనారాయణ చి ల్వూరి వెంకన్న సుధాకర్ మాదాసు రమేష్ నూకల ఉపేందర్ బుడెగే సతీష్ చిట్టె వెంకన్న తదితరులు పాల్గోన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంటను అమ్ముకునే సమయంలో దళారులను నమ్మి మోసపోవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం భూపాలపల్లి మంజూరు నగర్‌లోని యం ఎస్ ఆర్ కాటన్ ఇండస్ట్రీస్‌లో సిసిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ రైతులు ప్రైవేటు వ్యక్తులు, దళారులకు అమ్ముకొని మోసపోవద్దని, కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు స్లాట్ బుకింగ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల సంక్షేమమే సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ పని చేస్తుందని అన్నారు. పండించిన పత్తి పంటను సిసిఐ కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలని సూచించారు. 8 నుండి 12 శాతం వరకు తేమ శాతం ఉండడం వలన రైతులు నష్టపోతున్నారని 20 శాతం తేమ ఉండే విధంగా కొనుగోలు చేయాలన్నారు. ప్రతి ఎకరాకి 7 క్వింటాళ్లు కొనుగోలు చేయాలనే నిబంధన కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసి, 12 క్వింటాలు కొనుగోలు చేసేలా రైతులకు సహకరించాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అంతకుముందు వివిధ పంటలకు సంబంధించిన కనీస మద్దతు ధర పోస్టర్ ను ఎమ్మెల్యేలు, అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుంటూరు కిష్టయ్య, వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, సిసిఐ సిపిఒ అలోన్, మార్కెట్ సెక్రటరీ లా షరీఫ్, ఎమ్మెస్సార్ మిల్లు యాజమాని లింగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పిప్పాల రాజేందర్, దాట్ల శ్రీనివాస్, ముంజల రవీందర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ పంటపై ప్రత్యేక శ్రద్ధ



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకి అధిక ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో జిల్లాలో ఆయిల్ పామ్ సాగు అయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం అయిల్ ఫామ్ పంట విస్తరణ పైన ఉద్యన, వ్యవసాయ, సహకార శాఖ అధికారులతో కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తొందరగా పురోగతి కనబడాలని, ప్రతి పిఎసిఎస్ నుండి 5 మంది రైతులను ఆయిల్‌పామ్ సాగుకు గుర్తించాలన్నారు. ప్రతి ఎఇఒ 50 ఎకరాలు లక్ష్యంగా గ్రామంలో ఉన్న పెద్ద రైతులను గుర్తించాలన్నారు. దేవాదాయ రిజర్వాయర్ కింద ఉన్న రైతులను ఆయిల్ ఫామ్ సాగుకు గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు అంబికా సోని, కోదండరాములు, శ్రీధర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల వృద్ధికి స్ఫూర్తి కార్యక్రమం

కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ :** విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల వృద్ధికి, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడానికే స్ఫూర్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. గురువారం వరంగల్ నగర పరిధి రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన స్ఫూర్తి కార్యక్రమంలో కలెక్టర్ సత్య శారద, జిల్లా పరిషత్తు సిఇఒ, ఇరన్‌చార్జి డిఆర్‌డిఒ రామిరెడ్డిలతో కలసి హాజరయ్యారు. విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి వా రు భవిష్యత్తులో ఏం కావాలనుకున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికనుగుణంగా క్రమశిక్షణతో ఇష్టపడి చదవాలన్నారు. మానసిక దృఢత్వాన్ని కల్పించే మూడు వీడియోలను ప్రదర్శించి అందులో ఉన్న నీతిని కలెక్టర్ విద్యార్థుల నుండి రాబట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు భయం వీడితే ఏదైనా సాధించగలరని, జిల్లా స్థాయిలో పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నెలకొల్పే విధంగా ప్రేరణ కలిగిస్తున్నామన్నారు. విద్యార్థులలో ధైర్యం లోపించడం వలన సరైన విద్యను అభ్యసించలేకపోతున్నారని, సమాజంలో జరుగుతున్న ప్రతి విషయం పట్ల ధైర్యం ప్రదర్శించినప్పుడే విద్యార్థుల్లో నిజమైన సృజనాత్మకత వెలుబడుతుందన్నారు. ఆరోగ్యకరమైన పిల్లలను నిర్మించడానికి, శారీరక అభివృద్ధితో పాటు మానసిక అభివృద్ధిపై దృష్టి సారించి ఈరోజు స్ఫూర్తి కార్యక్రమం ద్వారా నేడు దాదాపు 100 పాఠశాలల్లో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, విశ్రాంత ఉపాధ్యాయులు, వివిధ రంగాల నిష్ణాతులతో విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలు, పోటీతత్వం, అడ్డంకులు, సవాళ్లు, సమయం స్ఫూర్తి, ఒత్తిడిని జయించి సామర్థ్యాలు పెంపొందించుకోవడంపై వివరించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న స్ఫూర్తి కార్యక్రమాన్ని త్వరలో ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలకు విస్తరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు వనజ, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీచైతన్య విద్యార్థి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి కోయడ మస్తాన్ (హెచ్ఈసిఐ) రాష్ట్ర స్థాయి క్రీడల్లో విశేష ప్రతిభ కనబర్చి కళాశాలకు గౌరవం తీసుకువచ్చినట్లు కళాశాల ఛైర్మన్ ఎం. శ్రీధర్, డైరెక్టర్ ఎం. శ్రీవిద్యలు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో మస్తాన్ 400 మీటర్ల పందెంలో మొదటి స్థానం, 200 మీటర్ల పందెంలో మూడవ స్థానం సాధించినట్లు వారు తెలిపారు. తన ప్రతిభతో యు19 నేషనల్ ఎస్‌జిఎఫ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీలు హర్యానాలో జరగనున్నాయన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థిని ఎజిఎం సిహెచ్ బ్రహ్మం, జి. గోపాలకృష్ణ, జి. ప్రకాశరావు, ఎగ్జిక్యూటివ్ డీన్ ఎన్ఆర్‌ఎస్‌డి వర్మ, జోనల్ ప్రిన్సిపల్ రత్నాకర్, డీన్ కృష్ణ లు విద్యార్థిని అభినందించా రు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్స్ జోజి చాకో, రవీందర్ లు విద్యార్థిని సత్కరించారు. జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలను సాధించాలని వారు ఆకాంక్షించారు.

## శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు విరాళాల సేకరణ

ప్రజాపక్షం/చింతకాని: డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు చింతకాని మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి.ఇప్పటికే మండల సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ప్రణాళికను సిద్ధం చేశారు. గ్రామల్లో వాల్ రైటింగ్ తో పాటు శాఖ సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రచారాన్ని ప్రారంభించారు. ముగింపు సభ ప్రచారంలో భాగంగా గురువారం చింతకాని మండలంలోని చింతకాని గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహిండంతో పాటు విరాళాల సేకరణ చేస్తున్నారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు ,చింతకాని నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జున్, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, షేక్ దస్తగిరి పాల్గొన్నారు.

## సొసైటీని సందర్శించిన నాబార్డు బృందం



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)ని నాబార్డు బృందం సందర్శించింది. గురువారం ముంబాయి నుంచి వచ్చిన నాబార్డు బృందం శ్రేయస్ దేశ్ పాండే, కృష్ణ కోలే తదితరులు సొసైటీని సందర్శించి సొసైటీలో నిర్వహిస్తున్న కార్యకలాపాలను పరిశీలించారు. డిపాజిట్ల సేకరణ, రైతులకు రుణాలు, బంగారం రుణాలు, ఎరువులు, విత్తనాల విక్రయం, స్టాక్ వెరిఫికేషన్, పంట రుణాలను పరిశీలించారు. సొసైటీ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవల పట్ల నాబార్డు బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో డిసిసిబి డిజిఎం వేణుగోపాలరావు, సొసైటీ ఛైర్మన్ రావూరి సైదబాబు, వైస్ ఛైర్మన్ రావెళ్ల శ్రీనివాస్, ఎబి మార్గ్ బ్రాంచ్ మేనేజర్ ఇందు, సూపర్‌వైజర్ జానిమియా, సొసైటీ కార్యదర్శి ఐ. తిరుపతిరావు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్టులో న్యూవిజన్ విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : విజ్ఞాన భారతి (విభ) నిర్వహించిన డిజిటల్ బేస్డ్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ప్రతిభా పరీక్షలో న్యూవిజన్ విద్యార్థులు 60 మందికి పైగా ఫైనల్ లెవల్‌కి అర్హత సాధించినట్లు పాఠశాల ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్ తెలిపారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్, భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, ఎన్‌సిఇఆర్‌టి (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) భారత విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2025 26 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన టాలెంట్ టెస్టులో 60 మంది విద్యార్థులు ఫైనల్‌కు అర్హత సాధించారన్నారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫైనల్ లెవల్‌కి అర్హత సాధించిన విద్యార్థిని, విద్యార్థులను అకాడమిక్ డైరెక్టర్స్ సిహెచ్ కార్తీక్, స్ఫూర్తి లు అభినందించారు. ఫైనల్ లెవల్‌లో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జెవి మైఖేల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు గిరిజన మ్యూజియం సందర్శించేలా చూడాలి



ప్రజాపక్షం/భద్రాచలం : ఆదివాసి గిరిజన సంస్కృతి సంప్రదాయాలు కా పాడేందుకు, వాటిని చిరకాలం గుర్తు ంచుకునే విధంగా ఏర్పాటు చేసుకుని గిరిజన మ్యూ జియాన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులు సందర్శించే విధంగా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. పిఓ వారికి కొన్ని సూచనలు చేశారు. గిరిజన మ్యూజయంలో పొం దుప రచడం జరిగిందని, వీటిని విద్యార్థులకు చూపిండం ద్వారా సాంప్రదాయ పరమైన విలువలు తెలుస్తాయని అన్నారు. 8 నుండి 10వ తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ తరగతులు నిర్వహి స్తున్నా మని, మంచి ఆదరణ రావడటం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వ హిం చేందుకు గిరిజన సంక్షేమ శాఖ చర్యలు తీసు కుం టుందని చెప్పారు. ప్రైవే టు పాఠశాలల్లో పిల్లల ఫీజులు వ్యవహారంలో అనుచితంగా ప్రవ రిస్తు న్నారని, పిల్లలు క్రమ శిక్షమతో మసులుకోక పోతే తల్లింద్రులకు చె ప్పాలని, చదువులు, ఫీజుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు చూసు కోవాలన్నారు. సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, డిఇఓ నాగలక్ష్మి , మాధవరావు, బండి లక్ష్మ ణ్ , ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా రామారావు



ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ దానలకోట రామారావు గురువారం విధుల్లో చేరారు. ముందుగా పూర్వ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి కళావతిబాయి సమక్షంలో జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఐడిఓసి కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్థులో గల వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు రామారావును కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## 'ఎస్‌బిఐటికి' ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఐటిసి అకాడమీ ప్రతి యేటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బ్రిడ్జ్ కార్యక్రమంలో 2025వ వార్షిక సంవత్సరానికి గాను ఖమ్మం ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలకు ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డు లభించింది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన బ్రిడ్జ్ 2025 కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్ర ఐటి శాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్ చేతుల మీదుగా ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డును ఎస్‌బిఐటి కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు కళాశాలలను ఎంపిక చేయగా తమ కళాశాల మొదటి స్థానంలో నిలిచిందని గుండాల కృష్ణ తెలిపారు.

# ప్రజల కోసమే ప్రజా ప్రభుత్వం

### మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు

### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క





ప్రజాపక్షం/ ముదిగొండ : ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వాన్ని ప్రజలకు అంకితం చేసి పాలన సాగిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం ఖమ్మం జిల్లా మధిర నియోజక వర్గంలోని ముదిగొండ మండలం గంధసిరి గ్రామంలో కాకతీయుల కాలం నాటి శివాలయ పునః నిర్మాణ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన వారు తాము లేకపోతే రాష్ట్రంలో కరెంటు ఉండదని అంధకారమవుతుందని ప్రచారం చేశారన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత ఉన్న ఇబ్బంది లేకుండా ఉండేలా వ్యవస్థను నెలకొల్పామన్నారు. ఇందిరమ్మ లబ్దిదారులు ఎంత త్వరగా ఇండ్లు నిర్మించుకుంటే అంతే వేగంగా బిల్లులు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇండ్లు లేని పేదలకు ఐదు లక్షలతో ఇండ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో 3,500 చొప్పున 4.50 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రతి పైసా ప్రజల అవసరాల కోసమే ప్రజా ప్రభుత్వం ఖర్చు పెడుతుందని తెలిపారు. తెలంగాణ బిడ్డలు ప్రపంచంతో పోటీ పడేలా అధికారంలోకి రాగానే పెరిగిన మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్, డైట్ ఛార్జీలు పెంచామన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో ఒకటి చొప్పున నిర్మిస్తున్నామన్నారు. మహిళలు ఆత్మ గౌరవంతో బతికేలా వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. మధిర నియోజక వర్గంలో 60వేల మంది మహిళా సభ్యులతో ఇం దిరా మహిళా డెయిరీని ఏర్పాటు చేసి దేశానికే తలమానికంగా తీర్చిదిద్దామన్నారు. ఒక్కో మహిళకు రెండు గేదెలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 70వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌మేళాను నిర్వహిస్తుందని తెలిపారు. గత పాలకులు పదేళ్ల పాటు రేషన్‌కార్డులు కూడా ఇవ్వలేకపోయారని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ కార్డును పంపిణీ చేశామన్నారు. మహిళలు ఎక్కడకు వెళ్లినా ప్రయాణ ఖర్చు లేకుండా ఆర్టిసి బస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్నబియ్యం పం పిణీ చేస్తున్నామన్నారు. రైతు సంక్షేమం కోసం పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా క్రింద నిధులు జమ చేసిందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సా గిస్తున్నామని ఆయన తెలిపారు. మధిర నియోజక వర్గ ప్రజలు వేసిన ప్రతి ఓటుకు గౌరవం తీ సుకు వస్తామన్నారు. మధిర ప్రజల ఇంటి బిడ్డగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పని చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు,మాజీ ఎంఎల్‌ఎ కొండబాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సొసైటీ ఛైర్మన్ యలగొండ స్వామి, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా ప్రజా ప్రభుత్వ పాలన

### రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/నేలకొండపల్లి: రాష్ట్రంలో నిరుపేదలకు అండగా ప్రజా ప్రభుత్వ పాలన కొనసాగిస్తుందని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలం లోని వివిధ గ్రామాలలో గురువారం విస్తృతంగా పర్యటించారు. మంగాపురంతండా లో రూ.30 లక్షలతో, బుద్ధారంలో 15 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్ల కు శంఖుస్థాపన చేశారు. నేలకొండపల్లి తహశీల్దార్ కార్యాలయంలో 58 మంది లబ్దిదారులకు రూ.20.29 లక్షలను విలువ గల సీఎంఆర్ఎఫ్ "చెక్కులను అందించారు. గత 20, నెలలోనే మంగాపురంలో 57 లక్షలతో సిసి రోడ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మంగాపురం నుంచి నాచేపల్లి వరకు రూ.4.50 కోట్లతో బీటీ రోడ్లు పనులు చేస్తున్నట్లు తెలిపారు. రాయగూడెం నుంచి మంగాపురం వరకు 2.22 కోటతో రోడు పనులు పూరి చేసినట్లు తెలిపారు. 22 నెలలకాలంలో మంగాపురంతండాలో రూ.7.65 కోట్లు, పనులు వేగవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. పేదలకు సొంతింటి కల ప్రజా ప్రభుత్వం మొదట విడత లో 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్య, వైద్య రంగం కు పెద్ద పీట వేస్తుందని అన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రమేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ ఛైర్మన్ శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, మామిడి వెంకన్న, బచ్చలకూరి నాగరాజు, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, నల్లాని మల్లిఖార్జున్ రావు, నెల్లూరి భద్రయ్య, జెర్రిపోతుల అంజిని, గోబ్రియా నాయక్, కడియాల నరేష్, కన్నా రెడ్డి, కొమ్మినేని విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## 16న జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సింగరేణి సంస్థ సౌజన్యంతో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సారధ్యంలో ఈనెల 16న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తెలిపారు. ఈ జాబ్ మేళలో 65 కంపెనీలకుపైగా పాల్గొంటున్నాయని, మూడు వేలకుపైగా ఉద్యోగాల కల్పన లక్ష్యంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ద్వారా విడుదలైన క్యూరో కోడ్ ద్వారా ఇప్పటి వరకు 3వేల మంది నిరుద్యోగులు తమ పేర్ల ను నమోదు చేసుకున్నారని తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో ఉదయం 9గం. నుండి సాయంత్రం 5 గం. వరకు జాబ్ మేళా జరగనుందని, శిబిర ంలో కూడా నమోదు ప్రక్రియ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపార.ఉ శిబిరాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,స్థానిక ఎంఎల్‌ఏ కూనంనేనితో కలిసి ప్రారంభిస్తారని, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సింగరేణి అధికారులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. జిలాల్తో పాటు ఇతర జిల్లా నిరుద్యోగులు కూడా సిపిఐ, యువజన,విద్యార్థి, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు సాబీర్ పాషా చెప్పారు.

## గ్రామీణ ప్రాంత క్రికెటర్లను ప్రోత్సహించడమే టిసిఎ లక్ష్యం

### త్వరలో గోల్డ్ కప్ టోర్నమెంట్

### టిసిఎ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రదీప్‌కుమార్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ గ్రామీణ ప్రాంత క్రికెటర్లను ప్రోత్సహించడమే టిసిఎ ప్రధాన లక్ష్యమని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ప్రదీప్‌కుమార్, వీరేష్‌గౌడ్ లు తెలిపారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్వరలో జరిగే తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌కు ముందస్తుగా ఐదు జోన్లలో ఒక్కో జోన్ నుంచి ఐదు జట్లను ఎంపిక చేసేందుకు ఈనెల 18 నుంచి ఆయా జోన్లలో ఓపెన్ సెలక్షన్స్ జరుగుతాయని వారు తెలిపారు. గురువారం ఖమ్మం సీక్వెల్ రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈస్ట్‌జోన్ పరిధిలోకి వచ్చే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, కోదాడ, మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి, ములుగు, పరకాల, హన్మకొండ, స్టేషన్ ఘన్‌పూర్ జిల్లాల నుండి ఆరు క్రికెట్ జట్లను ఎంపిక చేసి ఫైనల్ టోర్నమెంట్‌కు పంపిస్తామన్నారు. నవంబర్ 18న ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో ఎస్ఎస్ క్రికెట్ మైదానంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి ఓపెన్ సెలక్షన్ నిర్వహిస్తామన్నారు. క్రికెట్ పోటీల సెలక్షన్‌కు వచ్చే అభ్యర్థులు తమ డేటాఫ్ బర్త్‌తో ఉన్న ఆధార్ కార్డు కానీ, పుట్టిన తేదీ ధృవీకరించే పదవ తరగతి మెమో, పాన్‌కార్డు ఏదో ఒకటి తీసుకుని రావాలన్నారు. తెలంగాణ గోల్డ్ కప్‌కు సంబంధించి ఫైనల్ షెడ్యూల్ నవంబర్ చివరి వారంలో విడుదల చేస్తామన్నారు. ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ సెంట్రల్ జోన్లను కలుపుకుని మొత్తం ఐదు జోన్ల నుంచి ఒక్కో జోన్ తరుపున ఆరు జట్లను ఎంపిక చేసి 30 జట్లతో కలిపి గోల్డ్ కప్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. క్రికెట్ సెలక్షన్స్‌కు వచ్చే వారు ఏమైనా సందేహాలు ఉంటే సెల్ నెం. 9848882551, 7989134190 నెంబర్లను సంప్రదించాలన్నారు. తమ ఎంట్రీలను ఫోన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించడం టిసిఏ ప్రధాన లక్ష్యమన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ గతంలో దుర్వినియోగానికి పాల్పడి చేసిన తప్పులన్ని రుజువై నేడు బాధ్యులంతా జైలులో ఉన్నారన్నారు. టిసిఏ జిల్లా ఉపాధ్యక్షులు నరాల నరేష్ మోహన్ నా యుడు, కోశాధికారి రవికుమార్, జాయింట్ సెక్రటరీ విడిఐ రాజీవ్ రాజ్, క్రికెటర్లు ఎండి ఇర్షాద్, రాజశేఖర్, వెంకట్, ఫణి, రాధిక పాల్గొన్నారు.

## ఒంటరి మహిళలకు తోడ్పాటు అభినందనీయం

### ఐటిడిఎ పిఒ రాహుల్




ప్రజాపక్షం/భద్రాచలం : ఒంటరి మహిళలు, వితంతువులు స్వశక్తితో జీవించేందుకు ఆత్మగౌరవం సంపాదించుకునేందుకు ఐటిసి పిఎస్‌పిడి బంగారు భవిష్యత్ ఎన్‌జిఓ సంస్థ తోడ్పాటు అందించడం అభినందనీయమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. గురువారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ఐటిసి బంగారు భవిష్యత్ అతి నిరుపేద మహిళా సహాయ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఐటిసి వారు నిర్వహిసున్న బంగారు భవిష్యత్ నిరుపేద ఒంటరి మహిళలకు ఎంతో ఉపయోగం అన్నారు. మహిళలకు పలు రంగాల్లో శిక్షణ ఇచ్చి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు పలు రకాల కార్యక్రమాలు నిర్వహించేందుకు తోడ్పాటు అందించడం గర్వకారణం అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, పేదలకు తోడ్పాటు అందించి వారి భవిష్యత్‌కు చేదోడు వాదోడుగా ఉండి జీవితంలో స్థిరపడేలా సంస్థ ఎంతో కృషి చేస్తుందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.13వేల విలువగల సామాన్లు, 40 మందికి రూ.20 వేల విలువ గల కుట్టుమిషన్లు, కిరాణా వస్తువులు, బట్టల తోపుడు బండ్లు అందించి అమ్మకాలు జరుపుకునేందుకు మార్కెట్ సౌకర్యం కల్పించడం వలన ఆర్థికంగా నిలదొక్కుకుంటారన్నారు. పెంచుకుని జీవనోపాదిని మెరుగుపర్చుకోవాలన్నారు.జయప్రకాశ్, బంధన్ , ప్రథమ్, బైప్ స్వచ్ఛంద సంస్థల యువతి యువకులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు

### అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరణ




ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : నేరాల నియంత్రణ, చట్టవ్యతిరేక కార్యాకలాపాలను కట్టుదిట్టం చేసేందుకు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా వ్యా ప్తాంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో స్థానిక ఎస్‌హెచ్‌ఓలు, సిబ్బంది విస్తృత తనిఖీలు చేపట్టారు. విజబుల్ పోలీసింగ్‌ను పట్టిష్టంగా అమలు చేస్తేనే నేరాలు నియంత్రించవచ్చనే నేపథ్యంలో తనిఖీలు చేపడుతున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. అదేవిధంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా గం జాయి, రేషన్‌బియ్యం, ఇసుక వంటి అక్రమ రవాణాతో పాటు పాత నేరస్తుల కదలికను కట్టడిచేసేలా జిల్లా పోలీసు యంత్రాంగం వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ప్రధాన రహదారులతో పాటు రద్దీ ప్రాంతాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో జోరుగా సోదాలు చేస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# కట్టె మిల్లు సమీపంలో నిషేధిత చెట్ల కలప నిల్వ

### ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇస్తే అక్రమార్కులకు అందజేత

### చెట్ల కలప నిల్వలపై చర్యలు తీసుకోని ఫారెస్ట్ అధికారులు



ప్రజాపక్షం/కూసుమంచి: మండల కేంద్రం సమీపంలోని ప్రధాన రహదారికి పక్కన ఉన్న ఓ సామిల్(కట్టె మిల్లు)సమీపంలో నిషేధిత(చింత, నమిలినార మొదలైన) చెట్ల కలపను ఎంతో కాలంగా నిల్వ ఉంచుతున్న కూసుమంచికి చెందిన ఓ సామిల్ యజమాని ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకుండా ఒక రకంగా చెప్పాలంటే అతనికి సహకరిస్తూ నిషేధిత కలప వైపు కూడా చూడకుండా ఉంటున్నారనే విమర్శ తీవ్రంగా వినిపిస్తుంది. నిషేధిత చెట్ల కలప కాకుండా తక్కువ పర్మిట్లతో ఎక్కువ చెట్లను నరికి నిలువ చేసి ఉన్న వేప, తుమ్మ, మొదలైన చెట్ల కలప అనేకం నిల్వగా ఉండటం విశేషం. కూసుమంచిలో చెట్లు నరికే డాన్‌గా పేరుపొందిన అతనిపై చర్య తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని జనం అంటున్నారు.
కూసుమంచి ఫారెస్టు అధికారుల తీరు చూస్తే ప్రభుత్వ ఫారెస్ట్ అధికార వ్యవస్థ పైనే నమ్మకం కోల్పోయే విధంగా ఉందని నిస్సందేహంగా చెప్పవచ్చు అందుకు ఉదాహరణలుగా ఇటీవల కూసుమంచి మండలంలో ఓ చోట నిషేధిత కట్టుల లోడ్ ఉందని చెప్పగా సమాచారం ఉన్న అందుకోలేకపోవడం, మరో మారి ఓ చోట లారీలో నిషేధిత, పరిమితులు లేకుండా నరికిన లోడు వేస్తున్నారని తెలియజేసిన లోడు వేస్తున్న లారీని పట్టుకోకపోవడం, ఇంకా ఓ చోట నిషేధిత చెట్ల కలప నిల్వ చేశారని ఫారెస్ట్ అధికారులకే తెలియజేస్తే అక్రమార్కులకు సమాచారం తెలియడంతో వారు ఆ నిషేధిత మొద్దులని వేరే చోటుకు తరలించడం చూస్తుంటే అధికారుల తీరు ఫారెస్ట్ వ్యవస్థ మీదనే నమ్మకం కోల్పోయే విధంగా ఉన్నది. కూసుమంచి ఫారెస్ట్ అధికారులకు నిషేధిత చెట్ల నరికివేత వివరాలు నిల్వ ఉంచిన కలప పరిమితులు లేకుండా చెట్లు నరికివేత మొదలైన సమాచారాలు ఇటీవల కాలంలో ఫారెస్ట్ అధికారులకు అందజేసే క్రమంలో సమాచారం అందించిన వారితో అధికారులు మాత్రం మా టల్లో అత్యంత నీతివంతమైన మాటలు మాట్లాడుతూ ఆచరణలో లీకర్లుగా ఉండటం వారి చర్యల ద్వారా తెలుపుతున్న వైనం. కండ్లకు కట్టినట్టుగా తెలుస్తున్నది అయితే ఇటువంటి అధికారులపై ఉన్నత స్థాయి అధికారులు దృష్టి పెట్టక చూసి చూడనట్టుగా లేక తమకు సంబంధం లేని విధంగా వ్యవహరించడం వల్ల ఫారెస్ట్ వ్యవస్థను పట్టించుకోకపోవడం వలన కొందరు ఫారెస్ట్ అధికారులు ఇంటి దొంగలుగా ఉంటూ అక్రమ కలప వ్యాపారాలకు అండగా నిలుస్తున్నారని చెప్పటంలో ఎటువంటి సందేహం లేదని జనం చర్చించుకుంటున్నారు.
కూసుమంచి మండల కేంద్రం సమీపంలో ప్రధాన రహదారి సమీపంలో సామిల్(కట్టేమిల్లు) సమీపంలో నిషేధిత చెట్ల కలప(చింతా, నమిలి నారా మొదలైన) ఇంకా ఎటువంటి పర్మిట్లు లేకుండా నరికిన వేప తుమ్మ నిల్వలు సమీపంలోని చేలల్లో ఇళ్ల పాట్లలో మాబీర కట్టె, పిచ్చి మొక్కలలో కప్పుకొని ఉండటం విశేషం, కొన్ని సంవత్సరాలుగా అక్రమ కలప నిల్వలు నిర్వహిస్తున్నప్పటికీ కూడా ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడంలో కారణమేమిటి అని, అటుగా రోజు వెళ్తున్న రైతులు కూలీలు ప్రజలకు అనుమానం వస్తు చర్చించుకుంటున్నారు. అంటే ఫారెస్ట్ అధికారులకు ఏమైనా సంబంధిత అక్రమ కలప వ్యాపారులు చేతివాటం ఇస్తున్నారా..అని జనం చర్చించుకుంటూ ఫారెస్ట్ అధికారులపై నమ్మకం కోల్పోతున్న వైనం కనిపిస్తుంది. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు మొద్దు నిద్ర నుండి మేల్కొని కూసుమంచితో పాటు పాలేరు, నాయకన్‌గూడెం, పెరిక సింగారం, గట్టు సింగారం, పోచారంలలో అక్రమ కలప వ్యాపార స్థావరాలపై చర్యలు తీసుకొని వారి నిజాయితీని నిరూపించుకోవాలని జనం కోరుతున్నారు.



# రీల్

## 'చెన్నై లవ్ స్టోరీ'లో హీరోయిన్ శ్రీగౌరిప్రియ పోస్టర్ రిలీజ్



హీరో కిరణ్ అబ్బవరం, యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫోటో', 'బేబి' వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన దర్శక నిర్మాత సాయి రాజేశ్, ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ కాంబినేషన్ లో రూపొందుతున్న క్రేజీ మూవీ 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై సాయి రాజేశ్, ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు విషెస్ తెలియజేస్తూ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా నుంచి బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో బ్యూటిఫుల్ లవ్ పెయిర్ గా కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ ఆకట్టుకుంటున్నారు. ఈ మూవీలో నివి క్యారెక్టర్ లో శ్రీ గౌరి ప్రియ ప్రేక్షకుల మనసు గెల్చుకోనుంది. మెలొడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ జరుపుకుంటోంది.ఈ చిత్రానికి ఆర్ట్ భాస్కర్ ముదావత్,ఎడిటర్ సంతోష్ నాయుడు, డీవోపీ విశ్వాస్ డేనియల్, సాహిత్యం అనంత్ శ్రీరామ్,సంగీతం మణిశర్మ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ విశాల దాట్ల, లైన్ ప్రొడ్యూసర్ శ్యామ్ ప్రసాద్ మేక.




## 'ఆంధ్ర కింగ్ తాలూకా' టైటిల్ ట్రాక్ రిలీజ్

రామ్ పోతినేని హీరోగా 'ఆంధ్ర కింగ్ తాలూకా' లో అలరించబోతున్నారు. సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 28న థియేటర్లలోకి వస్తుంది. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర అన్నోన్ సూపర్ స్టార్ పాత్రను పోషిస్తున్నారు. వివేక్ ,మెర్విన్ స్వరపరిచిన ఈ సినిమా సంగీతం ఇప్పటికే అందరిని ఆకట్టుకుంది. తాజాగా సినిమా టైటిల్ ట్రాక్ ఫస్ట్ డే ఫస్ట్ షో పాటను విడుదల చేశారు.ఈ సాంగ్ను అభిమానులు విమల్ థియేటర్లో గ్రాండ్ గా లాంచ్ చేశారు. లాంచ్ ఈవెంట్కు అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ హీరో రామ్ కటౌట్ లాంచ్ చేశారు. అభిమానుల హంగామా మధ్య సాంగ్ లాంచ్ జరిగింది.దినేష్ కాకర్ల ఈ పాటకు సాహిత్యం అందించారు. ఈ చిత్రంలో రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, విటివి గణేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సిద్ధార్థ నుని సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్.అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు.

## 15న మహేష్ బాబు 'గ్లోబ్ ట్రోటర్' ఈవెంట్

సూపర్ స్టార్ మహేష్ బాబు , రాజమౌళి కాంబినేషన్ లో వస్తున్న సినిమాకు 'గ్లోబ్ ట్రోటర్' వర్కింగ్ టైటిల్ గా పెట్టుకున్నారు. ఈ సినిమా ఈవెంట్ ఈనెల 15వ తేదీన రామోజీ ఫిలిం సిటీలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈ సినిమాలోని బాలీ వుడ్ నటి ప్రియాంక చోప్రా పోస్టర్ ను విడుదల చేశారు. అంతేకాదు ఈ ఈవెంట్ కు వచ్చే మహేష్ బాబు ఫ్యాన్స్ కోసం రాజమౌళి పలు సూచనలు చేస్తూ వీడియోను విడుదల చేశారు. గ్లోబ్ ట్రోటర్ ఈవెంట్ కోసం వచ్చే అభిమానులకు డైరెక్టర్ రాజమౌళి సూచనలు చెప్పారు. ఈవెంట్కు 18 సంవత్సరాల లోపు వారికి, సీనియర్ సిటిజన్లకు అనుమతి లేదు.గ్లోబ్ ట్రోటర్ ఈవెంట్ అనేది ఓపెన్ ఈవెంట్ కాదు.. కేవలం ఫిజికల్ పాసులు ఉంటేనే రండి. ఈవెంట్ రోజు రామోజీ ఫిల్మ్ సిటీ మెయిన్ గేట్ మూసేస్తారు. విజయవాడ, ఎల్బీనగర్, గచ్చిబౌలి రూట్ల నుండి వచ్చే వాళ్ల కోసం పాస్ మీద ఉండే క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే రూట్ మ్యాప్ వస్తుంది. ఈవెంట్ గేట్లు మధ్యాహ్నం 2 గంటల నుండి తెరుస్తారు. ఈవెంట్ కు వచ్చిన వారు ప్రశాంతంగా తిరిగి ఇంటికి వెళ్ళండి అని రాజమౌళి చెప్పారు.




## ఎన్టీఆర్ చేతుల మీదుగా 'మోగ్లీ' టీజర్



బబుల్గమ్ తో సక్సెస్ ఫుల్ డెబ్యూ చేసిన యంగ్ హీరో రోషన్ కనకాల తన సెకండ్ మూవీ 'మోగ్లీ 2025' తో వస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, కలర్ ఫోటో ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన మోగ్లీ 2025 అడవి నేపథ్యంలో యూనిక్ రొమాంటిక్ యాక్షన్ డ్రామా. ఈ సినిమా గ్లింప్స్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ రోజు యంగ్ టైగర్ ఎన్టీ ఆర్ టీజర్ను లాంచ్ చేశారు. టీజర్ ప్రాజెక్ట్ పై బజ్ను మరింత పెంచింది.హాయిగా సంతోషంగా జీవితాన్ని గడిపేయాలనుకునే యువకుడు మోగ్లీ. ఓ అందమైన అమ్మాయిని ప్రేమించిన తర్వాత అతని ప్రపంచం ఒక మలుపు తిరుగుతుంది. రామసీతల ప్రేమకథలా వీరిద్దరి ప్రేమ కూడా అందంగా ఉంటుంది. వీరి సంతోషంలో రాక్షసుడు లాంటి పోలీస్ ఆఫీసర్ ఎంటరౌతాడు. దీంతో అంతా యుద్ధ భూమిగా మారుతుంది. దర్శకుడు సందీప్ రాజ్ టీజర్ను అద్భుతంగా కట్ చేశారు. రామసీత లాగా హీరోహీరోయిన్లను, రావణుడిలా విలన్ను చూపుతూ ఆధునిక రామాయణంలా ప్రజెంట్ చేశారు. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ మైథాలజీ ఫీల్ మోడరన్ ఎమోషన్ తో మిళితం చేస్తుంది.సినిమాటోగ్రాఫర్ రామ మారుతి ఎం అద్భుతమైన విజువల్స్ అందించారు. కాలభైరవ అందించిన బ్యాక్గ్రౌండ్ స్కోర్ కథకు మరింత డెప్త్ ని జోడించింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణ విలువలు అత్యుత్తమంగా ఉన్నాయి. ఎడిటర్ కోదాటి పవన్ కల్యాణ్, ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ మామిడి, యాక్షన్ కొరియోగ్రాఫర్ నటరాజ్ మడిగొండ అద్భుతమైన వర్క్ తో అలరించారు. ఈ చిత్రం డిసెంబర్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్కు సిద్ధమవుతోంది.




## 'ది గర్ల్ ఫ్రెండ్' చూస్తూ కన్నీళ్లు ఆపుకోలేకపోయా

హీరో విజయ్ దేవరకొండ

'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా చూశాను. సినిమా చూస్తున్నంత సేపు భావోద్వేగానికి గురయ్యా. కొన్నిసార్లు కన్నీళ్లు ఆపుకోలేకపోయాను. ఈ మూవీ రిలీజ్ అయ్యాక వస్తున్న రెస్పాన్స్ నాకు రశ్మిక, రాహుల్ పంపిస్తుండేవారు. సొసైటీలో ఇలాంటి ప్రాబ్లమ్స్ వుమెన్ ఎదుర్కోవడం బాధపడాల్సిన విషయం. రిలేషన్ షిప్స్ అంటే ఒకనొకరు గౌరవించుకోవాలి, ఒడిదొడుకుల్లో తోడుండాలి, పరస్పరం ఎదిగేలా సహకరించుకోవాలి. మీ రిలేషన్స్లో సమస్యలు ఉంటే ఓపెన్గా మాట్లాడుకోవాలి. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా కొంతమందికి అవేర్ నెస్ ఇస్తుంది. రెగ్యులర్ సినిమా ఫార్మేట్ లెక్కలు వేసుకోకుండా సొసైటీలో ఉన్న ఇష్యూ నేపథ్యంగా రూపొందించిన 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ అందుకోవడం మామూలు విషయం కాదు. ఈ సినిమా ప్రేక్షకుల్లో ఒక ఆలోచన కలిగేలా చేసింది, అవగాహన కల్పిస్తోంది. మహిళలు బయటకు వచ్చి మాట్లాడే స్ఫూర్తిని భూమా కలిగించింది. 'ది గర్ల్ ఫ్రెండ్' ప్రొడ్యూసర్ అరవింద్, విద్య, ధీరజ్ ఇతర టీమ్ అందరికీ కంగ్రాట్స్ అని అన్నారు. నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ ఈ సినిమాకు అమ్మాయిలతో పాటు అబ్బాయిలూ బాగా కనెక్ట్ అవుతారు, అప్రిషియేట్ చేస్తారని రాహుల్ మాతో చెప్పేవాడు. అతని అంచనా సినిమా రిలీజ్ అయ్యాక నిజమయ్యింది. మా గీత గోవిందంలో నటించిన రశ్మిక..'ది గర్ల్ ఫ్రెండ్'తో మా సంస్థకు పేరు తెచ్చింది. దీక్షిత్ మంచి నటుడు. అతను తెలుగులో రెండు సినిమాలే చేశాడు. హీరోయిన్ రశ్మిక మందన్న మాట్లాడుతూ భూమా లైఫ్లో జరిగినవి కొన్ని నా లైఫ్ లోనూ చూశాను. నేనే తప్పు చేస్తున్నానేమో అనిపించేది. ఈ సినిమా మేము చేయడం వెనక ఉన్న ఉద్దేశం ప్రేక్షకులు బాగా అర్థం చేసుకున్నారు. భూమా పాత్రను మీరు కనెక్ట్ కావడమే, ఈ పాత్రపై మీరు చూపిస్తున్న అభిమానం అన్ని పురస్కారాల కంటే ఎక్కువ. మన సొసైటీలో ఇంతమంది అమ్మాయిలు భూమాలా సమస్యలు ఎదుర్కొంటున్నారా అని చూస్తుంటే బాధగా అనిపిస్తోంది.

## సినిమా పిచ్చితో సాఫ్ట్వేర్ ఉద్యోగం వదిలేశా

సంతాన ప్రాప్తిరస్తు హీరో విక్రాంత్



నేను పుట్టి పెరిగింది విజయవాడ. మాది మధ్య తరగతి కుటుంబం. చిన్నప్పటి నుంచే సినిమాలంటే పిచ్చి. విదేశాలకు వెళ్లి చదువుకుంటే ఈ సినిమా పిచ్చి తగ్గుతుందేమోనని నన్ను ఫారిన్ పంపారు. ఇంతకంటే సినిమా పిచ్చోళ్ళు చాలా మంది ఉన్నారు. బాగా చదువుకున్నాను. సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసేవాడిని. సినిమా పిచ్చితో సాఫ్ట్ వేర్ జాబ్ మానేసి ఇండస్ట్రీకి వచ్చాను అని చెప్పాడు సంతానప్రాప్తిరస్తు హీరో విక్రాంత్ . ఈ సినిమా 14న విడుదల అవుతున్న సందర్భంగా విక్రాంత్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. యుఎస్లో జాబ్ మానేసి ఇండియాకు వచ్చాను. కోవిడ్ మూడు నెలలకు మించి ఉండదు అనుకుంటే రెండేళ్లు పట్టింది. ఫ్యామిలీ నుంచి ప్రెషర్ పెరిగింది. ఈ టెన్షన్లో 'స్పార్క్' అనే ఒక మూవీ చేశాను. ఆ సినిమా నాకు చేదు అనుభవం మిగిల్చింది. రాంగ్ డైరెక్టర్ను పెట్టుకున్నాం. ఆ తర్వాత చిన్న గ్యాప్ తీసుకుని థియేటర్ ద్వారా నటనను మెరుగుపర్చుకున్న. ఒకరోజు మధుర శ్రీధర్ గారిని కలిసే అవకాశం వచ్చింది. ఆ తర్వాత ఆయన సంతాన ప్రాప్తిరస్తు స్క్రిప్ట్ పంపించారు. స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండే హీరో కథ ఇది. మన తెలుగు ఆడియెన్స్కు నచ్చుతుందా అనే సందేహం ఉండేది. అయితే స్క్రిప్ట్ కంప్లీట్గా చదివాక ఎక్కడా లైన్ క్రాస్ కాకుండా, అసభ్యత లేకుండా చిన్నపిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు అందరూ చూసేలా కథ ఉంది. దాంతో ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం కలిగింది. పెద్ద హీరోలు ఇలాంటి మూవీస్ చేయరు. వారికి ఇమేజ్ అడ్డు వస్తుంది. నాలాంటి కొత్త వాళ్లే ఇలాంటి డిఫరెంట్ ప్రయత్నాలు చేయాలి. 'సంతాన ప్రాప్తిరస్తు'లో కథ ఇన్ ఫెర్టిలిటీ అనే ఒక సెన్సిటివ్ ఇష్యూను తీసుకుని దానికి ఎంటర్ టైన్ మెంట్ యాడ్ చేశాం. చివరలో మంచి ఎమోషన్తో, మెసేజ్తో ఆడియన్స్ థియేటర్స్ నుంచి బయటకు వెళ్తారు. దర్శకుడు సంజీవ్ 2017 నుంచి సిద్ధం చేసుకున్న స్టోరీ ఇది. ఎక్కడా ఒక్క సీన్ కూడా కదల్చనంత పక్కాగా స్క్రిప్ట్ చేశారు. ఈ మూవీలో చైతన్య అనే సాఫ్ట్ వేర్ ఎంప్లాయ్ రోల్ చేశాను. ప్రతి సాఫ్ట్ వేర్ ఎంప్లాయ్ ఈ క్యారెక్టర్ తో రిలేట్ అవుతారు. ఈ పాత్ర కోసం ఆరు కిలోల బరువు పెరిగాను. సంతాన లేమి అనే సమస్యను మేము ఎక్కడా కామెడీ చేయలేదు. ఈ సినిమాలో హీరోయిన్ ఫాదర్ రోల్లో మురళీధర్ గౌడ్ నటించారు. ఆయన తన కూతురును ప్రభుత్వ ఉద్యోగికి ఇచ్చి పెళ్లి చేయాలనుకుంటాడు. కానీ చాందినీ నన్ను ప్రేమిస్తుంది. మేము ప్రెగ్నెన్సీ విషయంలో వంద రోజుల ఛాలెంజ్ ఎదుర్కోవాల్సి వస్తుంది. మా సినిమాలో పాటలు మంచి ఆదరణ పొందుతున్నాయి. ఈ సినిమా తర్వాత శ్రీధర్ బ్యానర్లోనే దర్శకుడు సంజీవ్ రెడ్డితో సర్పంచ్ అనే మూవీ చేయబోతున్నా. గ్రామీణ నేపథ్యంగా సాగే చిత్రమిది. మృత్యుంజయ మార్కండేయ అనే మరో సోషియో ఫాంటసీ మూవీకి ప్రయత్నాలు చేస్తున్నాం.

## నిజమవుతాయా?

(మొదటి పేజీ తరువాయి)

క్యాంపస్లో ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అందులో సీనియర్ జిల్లా అధికారులతో సిబ్బందిని ఏర్పాటు చేయగా, సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల అన్ని జిల్లా ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూమ్లను తరచుగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్జెడి నాయకుడు, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ తమ పార్టీ కార్యకర్తలు, సామాన్య ప్రజలు ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. 2020లో జరిగిన మాదిరి ఒక వేళ కౌంటింగ్ ఆపితే వీధుల్లో నేపాల్ లాంటి పరిస్థితి కనిపిస్తుందని అంతగా వెలుగులో లేని ఆర్జెడి నాయకుడొకరు హెచ్చరించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ మాట్లాడుతూ పార్టీ నాయకులు కౌంటింగ్ కేంద్రాలలో కార్యకర్తలతో నిరంతరం సంప్రదిస్తున్నారని, పోలింగ్ ప్రశాంతంగా జరిగినందున, కౌంటింగ్ రోజు కూడా ఎటువంటి ఘటనలు లేకుండా ఉంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. తేజస్వీ యాదవ్ ఎక్స్లో పోస్టు చేస్తూ 'ఓట్ల లెక్కింపుకు ముందు పార్టీ అభ్యర్థులు, జిల్లా ఆఫీస్ బేరర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించాను. ప్రజాస్వామ్యానికి జన్మస్థలమైన బిహార్లో న్యాయాన్ని ప్రేమించే ప్రజలు, రాజ్యాంగాన్ని గౌరవించే సామాజిక, రాజకీయ కార్యకర్తలు అప్రమత్తంగా, జాగ్రత్తగా, పూర్తి అవగాహనతో ఉన్నారు. ఎలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు' అని అన్నారు. బిహార్, బిహారీలు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటానికి కట్టుబడి ఉన్నారని యాదవ్ స్పష్టం చేశారు. అదే విధంగా సునీల్ కుమార్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు మార్పు కోసం ఓటు వేశారని, 2025లో తేజస్వి యాదవ్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. 2020లో లెక్కింపు నాలుగు గంటలు ఆగిపోయిందని, ఈసారి కూడా అలాంటిదే జరిగితే వీధుల్లో నేపాల్ లాంటి పరిస్థితిని మనం చూస్తామని ఘాటుగా స్పందించారు. ఇదిలా ఉండగా, అధికార, ప్రతిపక్ష కూటములకు చెందిన సీనియర్ నాయకులు నిరంతరం పరిణామాలను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా లెక్కింపు కేంద్రాలలో మోహరించి వారి పార్టీ కార్యకర్తలతో నిరంతరం సంప్రదిస్తున్నారు.

## ఎన్ఐఎ సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో అహ్మద్ తన వద్ద ఉన్న సెల్ఫోన్ను పోలీసుల రాకను గమనించి మోరిలో సెల్ఫోన్ పడేశాడని తెలిసింది. దీంతో పాటు అహ్మద్ సోదరుడి ఫోన్ను కూడా సీజ్ చేశారు. అతని ఇంట్లో సుమారు ఆరు గంటల పాటు ఎన్ఐఎ అధికారులు సోదాలు నిర్వహించారు. అరెస్టు సమయంలో గుజరాత్ పోలీసులు ఇదే ఇంట్లో నుంచి పెద్ద మొత్తంలో రసాయన పదార్థాలను, ఆయుధాలను, బాంబు తయారీకి ఉపయోగించే ఇతర రా మెటీరియల్ను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తన సోదరుడితో సంబంధాలు పెట్టుకున్న కీలక ఉగ్రవాదులను పట్టుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. అమాయకులకు గాలం వేసి ఉగ్రవాదులుగా మారుస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. టెలీగ్రామ్ ద్వారా ఐఎస్కెపి సభ్యులతో మొహియుద్దీన్ జరిపిన చర్చల సారాంశాన్ని కూడా ఎన్ఐఎ అధికారులు ఆరా తీస్తున్నారు. మొహియుద్దీన్ విదేశాల్లో ఎంబిబిఎస్ చదువుతున్న సమయంలోనే ఉగ్రవాదులతో సంబంధాలు ఏర్పడ్డాయని అనుమానిస్తున్నారు. అహ్మద్కు గుజరాత్తో పాటు కాశ్మీర్లోని ఉగ్రవాదులతో కూడా సంబంధాలు ఉన్న విషయం వెలుగు చూసింది.

## సక్సెస్ సాధించాలంటే టెక్నాలజీనీ సొంతం చేసుకోవాలి

### టి-సాట్ వేదికపై ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యార్థులు సక్సెస్ సాధించాలంటే టెక్నాలజీలో మంచి ప్రావీణ్యం సంపాదించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్లోని టిసాట్ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల 'రాష్ట్ర స్థాయి వార్షిక పోటీలు2025' విజేతల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సమాజంలో అత్యంత వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త విషయాలు నేర్చుకుంటూ విద్యార్థులు ఉత్తమమైన ఫలితాలు సాధించాలని, ప్రస్తుత కాలంలో విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని అంచనావేయలేకపోతున్నామన్నారు. విద్యార్థుల మేథో సంపత్తికి టిసాట్ సాంకేతికను ఉపయోగించుకుని తమ భవిష్యత్కు గట్టి పునాదులు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు విజయం సాధిస్తే టీచర్లు మొదటగా, ఆ తరువాత తల్లిదండ్రులు సంతోషిస్తారని, చదువుల్లో మొదటి స్థానమే కాకుండా ఇలాంటి కార్యక్రమాలు చాలా ముఖ్యం అని, విద్యార్థుల్లో నైపుణ్యం వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. టిసాట్ పోటీల్లో విజేతలైన 99 మంది విద్యార్థులు, ఒక్కరు సుమారు 2,200 విద్యార్థుల నాలెడ్జితో సమానమనే విధంగా భావించాలని గుర్తుచేశారు. అందుకే ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తుందని, డిజిటల్ విద్యలో టిసాట్ నెట్వర్క్ అందిస్తున్న సాంకేతికతను ప్రభుత్వ పాఠశాలలు, మారుమూల ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వ కలలను తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిజం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు టిసాట్ డిజిటల్ పాఠాలు చాలా ఉపయోగపడతాయన్నారు. సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన మంత్రి శ్రీధర్ బాబు టిసాట్కు సంపూర్ణ మద్దతు అందచేస్తూ, తెలంగాణ విద్యార్థులు, యువతకు పరోక్షంగా చేయూనిస్తున్నారని కొనియాడారు. ప్రతి రోజూ గంట పాటు విద్యార్థులు టిసాట్ నెట్వర్క్ను చూడాలని కోరారు. ప్రతి రోజు ఒక్క గంటైనా టిసాట్ ప్రసారాలు చూడాలని విద్యార్థులకు సూచించారు. తెలంగాణ గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రాజ్ గంగారెడ్డి, ఎస్.గిరిధర్ గౌడ్ మాట్లాడుతూ టిసాట్ నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని విద్యార్థులకు అందించే విధంగా తాము సంధాన కర్తలుగా వ్యవహరిస్తూ మా బాధ్యతను నిర్వర్తిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి టిసాట్ ఎగ్జుక్యూటీవ్ డైరెక్టర్ ఎం.డి సాధిక్ స్వాగతోపన్యాసం చేయగా జనరల్ మేనేజర్ లింగారెడ్డి వందన సమర్పన చేశారు.

## కార్మికుల సమస్యలు విస్మరించడం బాధాకరం

### టిజిఎస్ ఆర్టిసి ఇయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఈదురు వెంకన్న

ప్రజాపక్షం/హైదరాబాద్ : రవాణా శాఖ మంత్రి ఆర్టిసిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని టిజిఎస్ ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. యూనియన్ అధ్యక్షుడు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయంలో ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావొస్తున్నా కార్మిక సంఘాల పునరుద్ధరణపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఒక్క రూపాయి ప్రభుత్వానికి ఖర్చు కాని ఈ అంశాన్ని కూడా అమలు చేయకపోవడం విచారకరమన్నారు. మహాలక్ష్మి పథకాన్ని భుజస్కంధాలపై మోసుకుంటూ ఎన్నో ఇబ్బందులు ఎదురైనా ఆర్టిసి కార్మికులు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం వారిని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రతినెల ఇవ్వాల్సిన రూ. 350 కోట్లతో పాటు రూ.900 కోట్ల పాత బకాయిలు ఇప్పటికీ చెల్లించకపోయినా, మొత్తం సొమ్ము ఇచ్చామని మంత్రి అబద్ధం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను వేలాదిగా ప్రవేశపెడుతూ, ఆర్టిసి స్థలాలను వాటి కోసం వినియోగించడం తప్పు అని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ చర్యలకు స్వస్తి పలికి, ప్రైవేట్ బస్సులకు ప్రత్యేక డిపోలను ప్రభుత్వ స్థలాల్లో నిర్మించాలని, ఆ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఆర్టిసికి అప్పగించాలని బాబు, వెంకన్న డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణ, 2025 వేతన సవరణ, 2017 నుండి బకాయిలో ఉన్న ఫ్రింజ్ బెనిఫిట్స్, రిటైర్డ్ ఉద్యోగులకు 2017 పిఆర్సి బకాయిలు తక్షణమే అమలు చేయాలని కోరారు. కారుణ్య నియామకాలను రెండు సంవత్సరాల పాటు కన్సాలిడేట్ పే కింద ఇవ్వాలన్న మంత్రి సూచన అన్యాయం అని అన్నారు.సింగరేణి, ఇతర ప్రభుత్వ సంస్థల్లో మాదిరిగా రెగ్యులర్ ప్రాతిపదికన కారుణ్య నియామకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనాభా పెరుగుదలతో పాటు గ్రేటర్ హైదరాబాద్లో కనీసం 7,000 బస్సులు అవసరమని, కానీ ప్రస్తుతం కేవలం 2,800 బస్సులు మాత్రమే నడుస్తున్నాయని తెలిపారు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. 16,000 ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఉద్యోగులపై అధిక పనిభారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో అనేక మంది కార్మికులు ఒత్తిడికి తట్టుకోలేక మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంత మంది చనిపోతే ఈ ప్రభుత్వం కార్మిక సమస్యలు పరిష్కరిస్తుందో చెప్పాలని బాబు, వెంకన్న మంత్రిని నిలదీశారు.

## చిక్కకుండా ఢిల్లీకి ఉమర్

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ పోలీసులు భావిస్తున్నారు. పేలుడు ఘటన ప్రధాన నిందితుడు డాక్టర్ ఉమర్ కదలికలపై దర్యాప్తు బృందాలు దృష్టి సారించాయి. అతడు ఎక్కడెక్కడకి వెళ్లాడు? ఎవరినీ కలిశాడనే దానిపై దర్యాప్తు చేస్తున్నాయి. హర్యానా నుంచి ఢిల్లీ వరకు ఉమర్ ప్రయాణానికి సంబంధించిన సిసిటివి దృశ్యాలను అధికారులు పరిశీలించారు. కెమెరాలకు దొరక్కుండా ఉమర్ జాగ్రత్తపడినట్లు తెలుస్తోంది. ఇందు కోసం ప్రధాన పట్టణాల గుండా వెళ్లకుండా హైవేలపై నుంచి ప్రయాణించినట్లు తెలుస్తోంది. కాగా, పేలుడు ఘటనలో కీలక నిందితుడైన డాక్టర్ ఉమర్ నబీ పేలుడు జరగడానికి ముందు అతని కదలికలను 50కి పైగా సిసిటివి కెమెరాల ఫుటేజీలను ఉపయోగించి ఢిల్లీ పోలీసులు రీకన్స్ట్రక్ట్ చేశారు. ఎర్రకోట పేలుడుకు ముందు రాత్రి ఫరీదాబాద్ నుండి బయలుదేరినప్పటి నుండి మరుసటి సాయంత్రం మెట్రో స్టేషన్ వైపు పేలుడు పదార్థాలతో నిండిన కారును నెమ్మదిగా నడపడం వరకు ఉమర్ కదలికలను తెలుసుకున్నారు. ఉమర్ హర్యానా నుండి ఢిల్లీ–ముంబై ఎక్స్ప్రెస్వే ద్వారా ఢిల్లీకి ఎలా ప్రయాణించాడో, రోడ్డు పక్కన ఉన్న తినుబండారంలో ఆహారం కోసం ఆగి, మరుసటి రోజు ఉదయం దేశ రాజధానిలోకి ప్రవేశించడానికి ముందు తన కారులో రాత్రి గడిపిన తీరును చూపించారు. ఉమర్ కదలికలు కచ్చితమైన ప్రణాళిక, గుర్తించకుండా ఉండటానికి ఉద్దేశపూర్వక ప్రయత్నాలను సూచిస్తున్నాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ఆదివారం ఢిల్లీముంబై ఎక్స్ప్రెస్వేలో ప్రారంభమై ఆపై ఎక్స్ప్రెస్వే నుండి దిగి, హర్యానా నుహ్ జిల్లాలోని ఫిరోజ్పూర్ ఝిర్కాకు చేరుకున్నారని పోలీసు వర్గాలు తెలిపాయి. అక్కడ ఒక రోడ్డు పక్కన ఉన్న ధాబా వద్ద ఆగి తన కారులో రాత్రి గడిపినట్లు సమాచారం. తరువాత, సోమవారం ఉదయం, అతను ఢిల్లీ–ముంబై ఎక్స్ప్రెస్వే వెంబడి ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాలలో మళ్ళీ కనిపించాడు. ఢిల్లీ వైపు నెమ్మదిగా కారు నడుపుతున్నాడు. ఒకసారి టీ తాగడానికి, ఒకసారి తన మొబైల్ ఫోన్ను తనిఖీ చేయడానికి అతను రెండుసార్లు ఆగి ఉన్నట్లు ఫుటేజీలో కనిపిస్తుంది. ఉమర్ మరుసటి రోజు ఉదయం బదర్పూర్ సరిహద్దు గుండా ఢిల్లీలోకి తిరిగి ప్రవేశించాడని, ఫరీదాబాద్ నుండి తాను గతంలో తీసుకున్న అదే మార్గాన్ని ఉపయోగించాడని పోలీసులు తెలిపారు. గుర్తింపును నివారించడానికి అతను తన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలతో సహా ప్రతి అడుగును ప్లాన్ చేసుకున్నట్లు అనిపించిందని పోలీసు వర్గాలు తెలిపాయి. తెల్లటి హ్యుందాయ్ ఐ20 కారు నడిపిన ఉమర్, ఫరీదాబాద్ నుండి ఢిల్లీలోకి ప్రవేశించి, ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్య నగరం అంతటా అనేక మలుపులు తిరిగి, చివరికి మధ్యాహ్నం 3:19 గంటలకు ఎర్రకోట దగ్గర పార్కింగ్ చేసినట్లు రూట్మ్యాపింగ్ చూపిస్తుంది. ఉమర్ కారు మొదట ఉదయం 7:30 గంటలకు ఫరీదాబాద్ నుండి ఆసియన్ హాస్పిటల్ దగ్గర కనిపించింది. ఆ తర్వాత అతను ఉదయం 8:13 గంటలకు బదర్పూర్ టోల్ ప్లాజాను దాటి ఢిల్లీలోకి అడుగుపెట్టాడు. అక్కడి నుండి, అతను ఓఖ్లా, ఇండస్ట్రియల్ బెల్ట్తో సహా ఆగ్నేయ ఢిల్లీలోని అనేక ప్రాంతాల గుండా ప్రయాణించి, కన్నాట్ ప్లేస్ను దాటాడు, తరువాత తూర్పు ఢిల్లీలో, తరువాత మధ్య ఢిల్లీలోని రింగ్ రోడ్ సమీపంలో కనిపించాడని పోలీసు వర్గాలు తెలిపాయి. ఉద్దేశపూర్వకంగా ప్రధాన రహదారులను తప్పించాడని, బదులుగా రద్దీగా ఉండే ప్రాంతాల గుండా జిగ్జాగ్ మార్గాన్ని తీసుకున్నాడని తెలుస్తుందన్నారు. బహుశా నిఘాను గందరగోళపరిచేందుకు లేదా జనసమూహ కదలికలను అధ్యయనం చేయడానికి ఇలా చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆగ్నేయ ఢిల్లీ, తరువాత తూర్పు, న్యూఢిల్లీ, సెంట్రల్, వాయువ్య ఢిల్లీలోని అశోక్ విహార్ నుండి ప్రారంభించి, మధ్యాహ్నం సమయంలో రోడ్డు పక్కన ఉన్న తినుబండారం వద్ద ఆగిన బహుళ జిల్లాల్లోని కెమెరాలలో కనిపించాడు. ఈ స్టాప్ తర్వాత, అతను సెంట్రల్ ఢిల్లీ వైపు తిరిగి వెళ్లాడు, అక్కడ రాంలీలా మైదాన్ సమీపంలోని అసఫ్ అలీ రోడ్ సమీపంలోని ఒక మసీదును సందర్శించాడు. అక్కడ ప్రార్థనలు చేసి, పార్కింగ్ ప్రాంతంలో దాదాపు మూడు గంటలు గడిపాడని ఫుటేజ్ చూపిస్తుంది. ఈ సమయంలో అతని ఫోన్ యాక్టివిటీని కూడా నిశితంగా పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆ ప్రదేశానికి వెళ్లే ముందు అతనికి సూచనలు అంది ఉండవచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. మధ్యాహ్నం 3:19 గంటలకు, ఉమర్ కారు ఎర్రకోట కాంప్లెక్స్ పక్కన ఉన్న పార్కింగ్ ప్రాంతంలోకి ప్రవేశించింది. అక్కడ దాదాపు మూడు గంటలు అలాగే నిలిచిపోయింది. సునేహ్రీ మసీదు పార్కింగ్ సమీపంలోని ఇతర వాహనాల మధ్య కారు నిశ్శబ్దంగా ఆగి ఉన్నట్లు సిసిటివి ఫుటేజ్లో చూపిస్తుందని దర్యాప్తు అధికారి ఒకరు తెలిపారు. సాయంత్రం 6:22 గంటలకు, కారు పార్కింగ్ ప్రాంతం నుండి బయలుదేరి ఎర్రకోట మెట్రో స్టేషన్ వైపు వెళుతున్నట్లు కనిపించింది. కేవలం 30 నిమిషాల తర్వాత, సాయంత్రం 6:52 గంటలకు వాహనం పేలిపోయింది. రద్దీ సమయంలో నెమ్మదిగా కదులుతున్న తెల్లటి కారు అకస్మాత్తుగా మంటల్లోకి దూసుకుపోవడాన్ని చూపించింది. ఎర్రకోట పేలుడు స్థలం నుండి సేకరించిన నమూనాల డిఎన్ఎ పరీక్షలో సోమవారం పేలిపోయిన కారును డాక్టర్ ఉమర్ నబీ నడుపుతున్నట్లు నిర్ధారణ అయింది. కాగా, అతని తల్లి డిఎన్ఎ నమూనాలను మంగళవారం సేకరించి పరీక్ష కోసం ఢిల్లీకి పంపారు. పేలుడు స్థలం నుండి సేకరించిన అవశేషాలతో పాటు వాటిని విశ్లేషించారు. ఆ దుర్ఘటన జరిగిన వాహనాన్ని నడిపింది ఉమర్ అని డిఎన్ఎ ఫలితాలు నిర్ధారిస్తున్నాయని వర్గాలు తెలిపాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com